www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 325 | సోమవారం | 26-10-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి

భవిష్యత్తు ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగించాలి : ఖర్గే

2029 నాటికి ఇస్రో నాలుగు లాంచ్ ప్యాడ్స్ 07



## ఓటు మీదే.. పోరాటమూ మీదే

- రండి..ఓటును, దేశాన్ని కాపాడుకుందాం
- నవంబర్ 1న ఇండియా కూటమి ర్యాలీకి కదలండి
- దేశ ప్రజలకు ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పిలుపు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, ఓట్ల చోరీ ఆరోపణలపై నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఈ ర్యాలీకి ప్రతిపక్ష నేతలకంటే ఎక్కువ బిజెపి, దాని మిత్రపక్షాల నాయకులే ప్రచారం చేస్తున్నారని రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఇంత ఉత్సాహంతో పెద్ద ఎత్తులో ప్రచారం చేస్తున్నందుకు, ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే తరువాయి 12లో

# రైస్ మిల్లర్లపై సిఐడి కొరడా

## సన్న బియ్యం పేరుతో దొడ్డు బియ్యం సరఫరా!

- నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లో 16 రైస్ మిల్లుల గుర్తింపు
- భారీ కుంభకోణంపై నేర పరిశోధనా విభాగం దర్యాప్తు
- మూడు కేసులు నమోదు.. 14 మంది రైస్ మిల్లర్ల అరెస్ట్
- సకాలంలో జోక్యం చేసుకొని రూ.242 కోట్ల నష్టం తప్పించిన పౌరసరఫరాల శాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వానికి బోనస్ రూపంలో చెల్లించాల్సిన మొత్తాన్ని పొందేందుకు కొందరు రైస్ మిల్లర్లు సన్న రకం ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌కు తరలించి, దాని స్థానంలో తక్కువ ధర కలిగిన దొడ్డు బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ)కి సరఫరా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఖరీఫ్ 2025–26 సీజన్‌కు సంబంధించి వెలుగుచూసిన ఈ అక్రమాలపై తెలంగాణ పోలీసు నేర పరిశోధన విభాగం (సిఐడి) దర్యాప్తు చేపట్టింది. ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి, 14 మంది మిల్లర్లను అరెస్టు చేసింది. సకాలంలో పౌరసరఫరాల శాఖ అధికారులు జోక్యం చేసుకుని, మరింత బియ్యం మార్పిడిని అడ్డుకోవడంతో సుమారు రూ.242 కోట్ల మేర బోనస్ సంబంధిత నష్టం తప్పినట్లు ప్రాథమిక అంచనా. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) శనివారం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిఐడి ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభించింది. 2025–26 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఈ ధాన్యానికి సంబంధించి ఎఫ్‌సిఐకి 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉంది. అయితే, సన్న రకం ధాన్యాన్ని కేటాయించిన కొందరు తరువాయి 8లో

# బియ్యం ధరలు పైపైకి..

## కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

మిల్లర్ల మాయాజాలం - దాడులు చేస్తున్న విజిలెన్స్

ముందస్తు బెయిల్‌తో వ్యాపారులు



ప్రజాపక్షం/ ఖమ్మం

రానున్న కరువుకు ప్రజలు ఇప్పుడే మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వ వర్గాలు ఏడాది పాటు ఆహార ధాన్యాలకు ఎటువంటి ఢోకా లేదని భరోసా ఇస్తుంటే ఇప్పుడే బియ్యం కొరత ఎలా వచ్చిందన్న దానికి అధికార యంత్రాంగమే సమాధానం చెప్పాల్సి ఉంది. కృత్రిమ కొరత సృష్టించి అందిన కాడికి ప్రజలను దోచుకుంటుంటే అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుంది. గోదాముల్లో పంట నిల్వ చేయలేనంత ధాన్యం దిగుబడి వచ్చిందని అధికార యంత్రాంగం ప్రకటనల విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఇది జరిగి నాలుగైదు నెలలు గడవక ముందే ఇంతటి కొరత ఎలా వచ్చిందో కానీ కేజీ రూ. 100కు చేరువైన బియ్యాన్ని కొనలేక సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల ఉదాసీనత, వ్యాపారులు, మిల్లర్ల మాయాజాలమే ఈ పరిస్థితికి కారణమవుతుంది. మిల్లర్ల దోపిడీకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అధికార యంత్రాంగం సహకరిస్తుందన్నది వాస్తవం. మాళ్ల మత్తులో జోగుతున్న పౌర సరఫరాల శాఖ అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. గతంలో తరువాయి 8లో



రైతాంగ ప్రయోజనాలే ముఖ్యం

## జలవివాదాలు వద్దు

- డిండి ప్రాజెక్టుకు 0.6 టిఎంసిల కేటాయింపు హర్షణీయం
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలి
- ప్రాంతీయ విభేదాలు సృష్టించడం సరికాదు : శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

కొరియా పెట్టుబడులకు

## తెలంగాణలో విస్తృత అవకాశాలు

- ఐదేళ్లలో పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- 'కె హర్మనీ ఫెస్టా కొరియా సాంస్కృతిక దినోత్సవం'లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## రూ.600తో వారం ప్రయాణం

- ఆర్‌టిసిలో కొత్త వీక్లీ బస్ పాస్ : ఎండి వై.నాగిరెడ్డి 3 లో



చిల్లర వివాదం

## కండక్టర్‌ను బస్సు కిందకు తోసిన మహిళ

దాడిని ఖండించిన కార్మిక సంఘాలు

ప్రజాపక్షం/ఖమ్మం/హైదరాబాద్

చిల్లర కోసం మొదలైన వివాదం చివరకు దాడి వరకు వెళ్లింది. మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు కండక్టర్ జి. ప్రవళికపై ఓ ప్రయాణికురాలు దాడికి పాల్పడి బస్సు నుంచి కిందకు నెట్టివేసింది. దీనితో కండక్టర్ ప్రవళిక కాలుపై నుంచి బస్సు వెళ్లడంతో కాలుకు తీవ్ర గాయమైంది. వివరాల్లోకి వెళితే... ప్రయాణికురాలు రూ. 100 ఇచ్చి రూ.10 టికెట్ తీసుకుంది. చిల్లర దిగేటప్పుడు ఇస్తానని చిల్లర లేదని చెప్పగా ప్రయాణికురాలు వాదనకు దిగింది. ప్రయాణికురాలు తరువాయి 12లో



## నీటి కుంటలో మునిగి ముగ్గురు మృతి

మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామ సమీపంలో ఘటన 3 లో

తుమ్మిడిహెట్టి నిర్మాణానికి

# భగీరథ యత్నం

బ్యారేజీపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నేడు కీలక చర్చలు

- ముంబయి వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృంధం
- 2023 తర్వాత ప్రాజెక్టు పునరుద్ధరణకు చర్యలు వేగవంతం



ప్రజాపక్షం/హైదరాబాద్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో కీలకమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గతంలో ఒప్పందాల దశలో ఆగిపోయిన ఈ ప్రాజెక్టును సాకారం చేసేందుకు వరుస సమీక్షలు, సమావేశాలతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ముంబైలో సోమవారం ఈ బ్యారేజీ ఎత్తుపై మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం కీలక చర్చలు జరుపనుంది. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం ఆదివారం ముంబైకి వెళ్ళింది. సెప్టెంబర్ 3న సిడబ్ల్యుపిఆర్‌ఎస్ పుణె నిర్వహించిన బ్యాక్ వాటర్ అధ్యయనాలను ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర జలవనరుల శాఖకు పంపించింది. కాగా 148 నుంచి +152 మీటర్ల వరకు వివిధ నీటిమట్టాల్లో ముంపు ప్రభావాన్ని చూపించే కాంటూర్ మ్యాపులను అందజేసింది. ముఖ్యమంత్రి వరుస ప్రయత్నాల నేపథ్యంలో కేంద్ర జల సంఘం ఢిల్లీలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సెప్టెంబర్ 1న అంతర్రాష్ట్ర సమావేశం ఏర్పాటు చేసింది. కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం తరువాయి 8లో

సంఘటిత పోరాటంతోనే

# హక్కుల సాధన

## మహిళా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐకమత్యమే ప్రధాన ఆయుధం

- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి
- ముగిసిన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు
- ఫీల్డ్ రిపోర్టర్లపై దాడులు, ఆన్‌లైన్ వేధింపులకు అడ్డుకట్ట వేయాలి సహా పలు అంశాలపై తీర్మానాలు





ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యమే ప్రధాన ఆయుధమని, అంతా సంఘటితంగా పోరాడినప్పుడే న్యాయపరమైన హక్కులను సాధించుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మహిళా జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. ''ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని టూరిజం ప్లాజా హోటల్‌లో నిర్వహించిన రెండు రోజుల మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ముగింపు సమావేశానికి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా జాతీయ సదస్సు చేసిన తీర్మానాల అమలుకు మీడియా అకాడమీ, ఐజెయు, మెఫీ బాధ్యతగా తీసుకుని అండగా నిలుస్తాయని ఆయన భరోసానిచ్చారు. కేవలం తీర్మానాలు ఆమోదించడంతోనే సరిపోదని, యాజమాన్యాలు, ప్రభుత్వం నుంచి డిమాండ్లను సాధించుకోవాలంటే మహిళా జర్నలిస్టులంతా ఐక్యంగా నిలబడాలని సూచించారు. మహిళా జాతీయ సదస్సుకు కశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్ వంటి సుదూర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు రావడం వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. 22 రాష్ట్రాల్లో 30 వేల మంది సభ్యత్వంతో పని చేస్తున్న ఐజెయు నిత్యం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని గుర్తు చేశారు.

కర్నాటక రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ ప్రస్తుతం జర్నలిజం సంక్షోభంలో ఉందని, మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న భద్రత, ఆరోగ్య బీమా సమస్యల పరిష్కారానికి తరువాయి 8లో

# పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం
- బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
- రూ.200 కోట్లతో జగిత్యాల జిల్లా తాటిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/జగిత్యాల

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ తరువాయి 12లో

## అటకెక్కిన అటవీ సంరక్షణ

తరిగిపోతున్న వణ్యప్రాణులు

నిధులు గోల్‌మాల్

మహబూబాబాద్ జిల్లా సీతానగరం అటవీ ప్రాంతంలోని భీముని పాదం అభివృద్ధి నిధులు పక్కదారి

ప్రజాపక్షం/గూడూరు

మహబూబాబాద్ జిల్లా గూడూరు అటవీ రేంజ్ పరిధిలో అటవీ సంరక్షణ అటకెక్కింది రక్షించాల్సిన అధికారులే చోద్యం చూస్తుండటంతో విలువైన అటవీ సంపద కొల్లగొడుతుండగా నిధుల గోల్ మాల్‌తో శాఖ పరువు బజారున పడుతోంది. గూడూరు మండలం సీతానాగరం అటవీ ప్రాంతంలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం భీముని పాదం (భీముని జలపాతం) తరువాయి 12లో

జీవన వ్యయం, విద్యా వ్యవస్థలో సమస్యలు

# ఫ్రాన్స్‌లో మళ్లీ రోడ్డెక్కిన జనం

దేశవ్యాప్తంగా 8 లక్షలమందికి పైగా ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు

1300 మంది అరెస్టు, ఘర్షణలు ● ఇటలీ, అల్బేనియాలలో శాంతియుత ప్రదర్శనలు



**పారిస్ :** ఫ్రెంచ్ ప్రభుత్వం అప్రమత్తమై ఎన్ని ముందస్తు నియంత్రణ చర్యలు తీసుకున్నప్పటికీ ఆ దేశంలో అనేక ప్రాంతాలలో 8 లక్షల మంది ప్రదర్శకులు వీధుల్లోకి వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు. కానీ పోలీసులు మాత్రం ఈ సంఖ్యను సగానికి సగం తగ్గించి చెప్పారు. జీవన వ్యయాల పెరుగుదల, విద్యారంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోరుతూ విద్యార్థులు, కార్మికసంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ రెండో విడత నిరసన ప్రదర్శనల్లో తరువాయి 8లో

# విశిష్ట సాహిత్య ధోరణి 'మేజిక్ రియలిజం'

సాహిత్య విమర్శలో 'మేజిక్ రియలిజం' ఒక విశిష్టమైన సాహిత్య ధోరణి. వాస్తవిక జీవితాన్ని చిత్రిస్తూనే, అతీంద్రియమైన, అద్భుతమైన, అసాధారణమైన సంఘటనలను సహజమైన జీవితానుభవాలుగా ప్రదర్శించడం దీని ప్రధాన లక్షణం. సాధారణంగా వాస్తవికతకు విరుద్ధంగా కనిపించే మాయాజాలం, పురాణాలు, జానపద విశ్వాసాలు, కలలు, ఆత్మలు, అద్భుత సంఘటనలు ఇందులో రోజువారీ జీవితంలో భాగంగా ఉంటాయి. అయితే, ఈ ధోరణిలోని మాయా లేదా మేజిక్ అంశాలు వాస్తవ ప్రపంచం నుంచి పూర్తిగా విడిపోయి ఉండవు. అవి చారిత్రక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక వాస్తవాలతో ముడిపడి ఉంటాయి. అందువల్ల 'మేజిక్ రియలిజం'ను వాస్తవికతను అర్థం చేసుకునే పద్ధతినే ప్రశ్నించే సాహిత్య దృక్పథంగా చూడాలి. జర్మన్ కళా విమర్శకుడు ఫ్రాంజ్ రోహ్ 1925లో 'దృశ్యకళల' ప్రదర్శనలో భాగంగా 'మేజిక్ రియలిజం' అనే పదాన్ని ఉపయోగించాడు. మొదటి ప్రపంచ యుద్ధానంతర జర్మన్ చిత్రకళలో వాస్తవిక వస్తువులను ఒక కొత్తదనంతో, అసాధారణమైన దృష్టితో చిత్రించే ధోరణిని వివరించడానికి ఆయన ఈ పదాన్ని ఉపయోగించాడు. తరువాత ఈ భావన లాటిన్ అమెరికా సాహిత్యంలో ప్రాధాన్యతను సంతరించుకుంది. అలెజో కార్పెంటియర్ తన ది కింగ్డమ్ ఆఫ్ దిస్ వరల్ నవలకు రాసిన ముందుమాటలో 'లో రియల్ మారవియోసో' అనే భావనను ప్రతిపాదించాడు. లాటిన్ అమెరికా చరిత్ర, వలసవాద అనుభవాలు, ఆఫ్రికన్, స్థానిక ప్రజల విశ్వాసాలు, సాంస్కృతిక వైవిధ్యం అక్కడి వాస్తవికతలోనే అసాధారణమైన అంశాలను కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డాడు. కొలంబియా రచయిత గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ రచించిన 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్' నవల 'మేజిక్ రియలిజం'కు ప్రపంచవ్యాప్త గుర్తింపును తీసుకువచ్చిన ప్రముఖ రచన. ఈ నవలలో మాకొండో అనే కల్పిత గ్రామం ద్వారా కుటుంబ చరిత్ర, రాజకీయ హింస, వలసవాద ప్రభావాలు, సామూహిక జ్ఞాపకాలు, పురాణాత్మక అనుభవాలు కలగలిసిపోతాయి. ఇందులో 'రెమేడియోస్' అనే పాత్ర ఆకాశంలోకి ఎగిరిపోవడం వంటి అసాధారణ సంఘటనలు కూడా సాధారణ జీవితంలో భాగంగా కనిపిస్తాయి. ఈ సంఘటనలను రచయిత అద్భుత ప్రదర్శనలుగా కాకుండా సహజమైన కథనంలో భాగంగా చూపించడం 'మేజిక్ రియలిజం' ప్రత్యేకతను తెలియజేస్తుంది. ఈ తరహా రచనల్లో వాస్తవం, మాయాజాలం అనే రెండు విభాగాల మధ్య స్పష్టమైన సరిహద్దులు ఉండవు. పురాణాలు, జానపద విశ్వాసాలు, మతపరమైన అనుభవాలు, సామూహిక జ్ఞాపకాలు కథనంలో ప్రాధాన్యం పొందుతాయి. ఆధునిక హేతువాద దృష్టిలో అసంబద్ధంగా కనిపించే అంశాలు ఇతర సాంస్కృతిక వ్యవస్థల్లో అర్థవంతమైనవిగా ఉండవచ్చు. ఈ విధంగా పాశ్చాత్య హేతువాదమే వాస్తవికతకు ఏకైక ప్రమాణమనే భావనను ఈ సాహిత్య ధోరణి ప్రశ్నిస్తుంది. అదేవిధంగా, 'మేజిక్ రియలిజం'లో చరిత్ర, రాజకీయాలు, సామాజిక సంబంధాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వలసవాదం, నియంతృత్వం, యుద్ధాలు, పేదరికం, సామాజిక



అసమానతలు వంటి అంశాలను మాంత్రిక కథన పద్ధతుల ద్వారా కొత్త కోణంలో చిత్రించవచ్చు. 'వన్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్' నవలలో అరటిపండ్ల కంపెనీ కార్మికుల ఊచకోతకు సంబంధించిన సంఘటన చరిత్రను ఎవరు నమోదు చేస్తారు, అధికార వ్యవస్థలు సత్యాన్ని ఎలా చెరిపివేస్తాయి అనే ప్రశ్నలను ముందుకు తెస్తుంది. కాబట్టి 'మేజిక్ రియలిజం' కేవలం సౌందర్యపరమైన ప్రయోగం కాదు; అది చరిత్రలోని మౌనాలను, అణచివేతలను వెలికితీసే సాధనంగా కూడా పనిచేస్తుంది.

## స్వరూపంపై ప్రశ్నలు ఎన్నో..

'మేజిక్ రియలిజం' సాహిత్యానికి కొత్త వ్యక్తీకరణ అవకాశాలను అందించినప్పటికీ, దాని సిద్ధాంతపరమైన స్వరూపంపై అనేక ప్రశ్నలు ఉన్నాయి. మొదటగా, ఈ సిద్ధాంతానికి అందరూ అంగీకరించే ఒకే నిర్వచనం లేదు. కొందరు విమర్శకులు దీనిని కథన పద్ధతిగా పరిగణిస్తారు. మరికొందరు సాంస్కృతిక దృక్పథంగా, వలసవాద వ్యతిరేక సాహిత్య వ్యూహంగా, వాస్తవికతను పునర్నిర్వచించే సౌందర్యశాస్త్రంగా వివరిస్తారు. మాంత్రిక సంఘటనలు ఉన్న ప్రతి రచనను 'మేజిక్ రియలిజం'గా పరిగణించలేం. అద్భుత కథలు, ఫాంటసీ సాహిత్యం, అధివాస్తవికత వంటి సాహిత్య ధోరణుల్లోనూ అసాధారణ అంశాలు కనిపిస్తాయి. అయితే 'మేజిక్ రియలిజం'లో అవి సామాజిక వాస్తవికతతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటాయి. అయినప్పటికీ ఈ ధోరణుల మధ్య సరిహద్దులు ఎల్లప్పుడూ స్పష్టంగా ఉండవు. అందువల్ల 'మేజిక్ రియలిజం'ను స్థిరమైన నిర్వచనంగా కాకుండా మారుతూ ఉండే విమర్శనాత్మక భావనగా చూడటం సముచితం. కాగా, 'మేజిక్ రియలిజం' చర్చలో లాటిన్ అమెరికా రచయితలకు అధిక ప్రాధాన్యం లభించింది. గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్, అలెజో కార్పెంటియర్ వంటి రచయితలు ఈ ధోరణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినప్పటికీ, దానిని ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి మాత్రమే పరిమితం చేయడం వల్ల ఇతర సాహిత్య సంప్రదాయాలు పక్కకు వెనకబడే ప్రమాదం ఉంటుంది. ఆసియా, ఆఫ్రికా, ఆదివాసీ సమాజాల్లో వాస్తవికతను అర్థం చేసుకునే పద్ధతులు భిన్నంగా ఉంటాయి. వాటిలోని మౌఖిక సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు, పురాణాత్మక కథనాలను లాటిన్ అమెరికా నమూనాలతోనే అర్థం చేసుకోవడం తగదు. ప్రతి ప్రాంతపు చారిత్రక, సాంస్కృతిక ప్రత్యేకతలను గుర్తించాలి.'మేజిక్ రియలిజం' పాశ్చాత్య హేతువాదాన్ని, యూరోపియన్ ఆధునికతను ప్రశ్నించగలగడం దాని ముఖ్యమైన బలం. వలసవాద పాలకులు స్థానిక ప్రజల విశ్వాసాలను వెనుకబాటుతనంగా చిత్రించిన సందర్భాలలో, ఈ సాహిత్య ధోరణి ఆ విశ్వాసాలకు సాంస్కృతిక గౌరవాన్ని పునరుద్ధరిస్తుంది. అయితే 'మేజిక్' లేదా 'మాయా' అంశాలను ఉపయోగించినంత మాత్రాన ఒక రచన వలసవాద వ్యతిరేక రచనగా మారిపోదు. కొన్నిసార్లు అవే అంశాలు సామాజిక అసమానతలను ప్రశ్నించకుండా వాటిని సహజమైనవిగా చూపించవచ్చు. అందువల్ల రచనలోని మాంత్రికత ఎవరికి స్వరం ఇస్తుంది? ఏ అధికార సంబంధాలను ప్రశ్నిస్తుంది? ఏ సమస్యలను కప్పిపుచ్చుతుంది? అనే అంశాలను పరిశీలించాలి.

> మరో విమర్శనాత్మక అంశం సామాజిక వాస్తవాల సౌందర్యీకరణ. 'మేజిక్ రియలిజం'లోని భాషా సౌందర్యం, అద్భుత సంఘటనలు, రూపకాల సమృద్ధి పాఠకులను ఆకర్షిస్తాయి. అయితే ఈ ఆకర్షణ వల్ల రాజకీయ హింస, పేదరికం, కుల వివక్ష, లింగ అసమానతలు వంటి సమస్యలు కేవలం విచిత్రమైన కథన అనుభవాలుగా మారిపోయే ప్రమాదం ఉంది. ఒక రచనలో ప్రజల బాధలను మాయాజాలంతో చిత్రించినప్పుడు, ఆ బాధలకు కారణమైన సామాజిక నిర్మాణాలు స్పష్టంగా కనిపించకపోవచ్చు. అయితే ఈ సమస్య అన్ని మాంత్రిక వాస్తవిక రచనలకు వర్తించదు. కొన్ని రచనలు మాంత్రిక కథనాన్ని ఉపయోగించడం ద్వారానే అధికార వ్యవస్థల క్రూరత్వాన్ని మరింత తీవ్రంగా బయటపెడతాయి. కాబట్టి మాంత్రికత సామాజిక వాస్తవాలను స్పష్టంగా చూపిస్తుందా, లేక వాటి తీవ్రతను తగ్గిస్తుందా అనే ప్రశ్నను ప్రతి రచన విషయంలో విడిగా పరిశీలించాలి.పాఠకుడి పాత్ర కూడా ఈ సిద్ధాంతంలో ముఖ్యమైనది. 'మేజిక్ రియలిజం' సాధారణ అవగాహనను సవాలు చేస్తూ, వాస్తవికతపై సందేహాన్ని కలిగిస్తుంది. అయితే రచనలోని సాంస్కృతిక సంకేతాలను అర్థం చేసుకోవడానికి పాఠకుడికి స్థానిక చరిత్ర, విశ్వాసాలపై అవగాహన అవసరం కావచ్చు. ఆ నేపథ్యం లేని పాఠకుడు రచనలోని అంతరార్థాలను గ్రహించలేకపోవచ్చు. మరోవైపు, అసాధారణ సంఘటనలపై సందిగ్ధతను సృష్టించడం ద్వారా పాఠకుడిని క్రియాశీల వ్యాఖ్యాతగా మార్చడం ఈ ధోరణి ప్రత్యేకత. అందువల్ల దాని బలాన్ని, పరిమితులను రెండింటినీ గుర్తించడం అవసరం.

భారతీయ సాహిత్యంలో పురాణాలు, ఇతిహాసాలు, జానపద విశ్వాసాలు, ఆధ్యాత్మిక అనుభవాలు, సమకాలీన సామాజిక వాస్తవాలు పరస్పరం కలిసిపోయే సంప్రదాయం ఉంది. అందువల్ల 'మేజిక్ రియలిజం'ను భారతీయ సాహిత్య అధ్యయనంలో ఉపయోగించవచ్చు. అయితే భారతీయ సంప్రదాయంలోని ప్రతి అద్భుత లేదా పురాణాత్మక అంశాన్ని 'మేజిక్ రియలిజం'గా పరిగణించకూడదు. ఒక రచనలోని మాంత్రిక అంశాలు సామాజిక వాస్తవికతతో, చారిత్రక అనుభవాలతో, సాంస్కృతిక విశ్వాసాలతో ఏ విధంగా సంబంధం కలిగి ఉన్నాయో పరిశీలించాలి. సల్మాన్ రష్దీ రచించిన 'మిడ్‌నైట్ చిల్డ్రన్' భారత స్వాతంత్ర్యానంతర చరిత్రను మాంత్రిక అంశాలు, వ్యక్తిగత జ్ఞాపకాలు, రాజకీయ పరిణామాలతో కలిపి చిత్రించిన ప్రముఖ ఆంగ్ల నవల. ఈ రచనలో వ్యక్తిగత జీవితం, జాతీయ చరిత్ర పరస్పరం ముడిపడి ఉంటాయి. మాంత్రిక కథనం ద్వారా దేశ చరిత్రను పునర్వ్యాఖ్యానించడం, అధికారిక చరిత్రలోని పరిమితులను ప్రశ్నించడం సాధ్యమవుతుందని ఈ నవల సూచిస్తుంది. తెలుగు సాహిత్యంలోనూ జానపద కల్పనలు, పురాణ ప్రతీకలు, స్థానిక విశ్వాసాలు, సామాజిక వాస్తవాల మధ్య సంబంధాలను 'మేజిక్ రియలిజం' సిద్ధాంతం ఆధారంగా పరిశీలించవచ్చు. ముఖ్యంగా గ్రామీణ జీవితం, కుల సంబంధాలు, అణగారిన వర్గాల అనుభవాలు, ప్రాంతీయ సంస్కృతులు వంటి అంశాలను అధ్యయనం చేయడానికి ఈ సిద్ధాంతం ఉపయోగకరమైన విమర్శనాత్మక పద్ధతిని అందిస్తుంది. అయితే తెలుగు రచనలకు ఈ సిద్ధాంతాన్ని అన్వయించేటప్పుడు వాటి స్థానిక చారిత్రక, సామాజిక, సాంస్కృతిక సందర్భాలను విస్మరించకూడదు. విదేశీ సిద్ధాంతాన్ని యథాతథంగా అన్వయించడం కంటే, తెలుగు సమాజపు ప్రత్యేక అనుభవాలకు అనుగుణంగా దానిని విమర్శనాత్మకంగా పునర్వ్యాఖ్యానించడం అవసరం. కాబట్టి, 'మేజిక్ రియలిజం' అనే ప్రక్రియను సాహిత్యంలో వాస్తవికతను అర్థం చేసుకునే సంప్రదాయ పద్ధతులను ప్రశ్నించిన ప్రభావవంతమైన సిద్ధాంతంగా చూడాలి. ఇది మాయాజాలాన్ని వాస్తవానికి వ్యతిరేకంగా నిలపకుండా, సామాజిక అనుభవాలు, సాంస్కృతిక విశ్వాసాలు, చారిత్రక జ్ఞాపకాలతో మేళవిస్తుంది. తద్వారా అణగారిన సమూహాల అనుభవాలను, అధికారిక చరిత్రలో కనిపించని స్వరాలను, ఆధునికత విస్మరించిన జ్ఞాన సంప్రదాయాలను సాహిత్యంలో వ్యక్తీకరించడానికి అవకాశం కల్పిస్తుంది. అదే సమయంలో, నిర్వచనంలోని అస్పష్టత, ప్రాంతీయ పరిమితులు, సామాజిక సమస్యల సౌందర్యీకరణ, స్థానిక సంస్కృతుల సరళీకరణ వంటి సమస్యలను విస్మరించలేం. కాబట్టి 'మేజిక్ రియలిజం'ను అన్ని సాహిత్యాలకు వర్తించే సర్వసమర్థమైన సిద్ధాంతంగా కాకుండా, రచనను దాని చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ సందర్భాల్లో విశ్లేషించడానికి ఉపయోగపడే విమర్శనాత్మక సాధనంగా చూడాలి. 'మేజిక్ రియలిజం' యొక్క ప్రధాన ప్రాముఖ్యత వాస్తవం నుంచి పారిపోవడంలో లేదు; వాస్తవం అనేది మనం సాధారణంగా ఊహించిన దానికంటే విస్తృతమైనదని చూపించడంలో ఉంది. ఇదే దాని సాహిత్యపరమైన బలం, విమర్శనాత్మక ప్రాధాన్యం.

– సత్య శ్రీ

## చదవాల్సిన పుస్తకాలు

### 'చురుకుగా తయారవ్వండి'

ప్రముఖ ప్రేరణాత్మక రచయిత బ్రియాన ట్రేసీ రచించిన 'చురుకుగా తయారవ్వండి' (గెట్ స్మార్ట్) వ్యక్తి ఆలోచనా విధానాన్ని పునర్నిర్మించడంపై, మెదడు సామర్థ్యాన్ని విస్తరించడంపై, లక్ష్యసాధనలో ఆలోచనల పాత్రపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఈ గ్రంథానికి ఒక సాధారణ 'స్వీయ సహాయక' పుస్తకంగా ముద్ర వేయడం సరికాదు. ఎందుకంటే ఇది ఒక సంపూర్ణ విధాన పరిశీలనాత్మక అధ్యయనం. 'మనం మెదడును పూర్తిగా ఉపయోగించుకోలేకపోతున్నాం, కానీ సరైన ఆలోచనా పద్ధతులు అలవాటు చేసుకుంటే మన సామర్థ్యాన్ని విస్తరించవచ్చు' అంటాడు రచయిత. ఇది పాఠకుడిని ఆకర్షించే ఆలోచన. ఈ గ్రంథంలోని మొదటి ముఖ్యమైన పాఠం 'పెద్ద దృశ్యాన్ని చూడడం' లేదా 'విస్తారమైన ఆలోచన కలిగి ఉండడం'. బౌద్ధ మతంలోని అంధులు ఏనుగును వేర్వేరు భాగాలుగా అర్థం చేసుకున్న కథ ద్వారా రచయిత ఒక ప్రధాన సూత్రాన్ని సూచిస్తాడు. ఇది సత్యానికి దగ్గర గా ఉన్న ఆలోచన. ఈ పుస్తకంలోని రెండవ ప్రధాన అంశం 'నిదానంగా ఆ లోచించడం'. రచయిత ఇక్కడ ఆలోచన, వేగంగా ఆలోచించడం, నెమ్మదిదిగా ఆలోచించడం వంటి డానియన్ కానెమన్ సిద్ధాంతాలను పరోక్షంగా ఉపయోగిస్తాడు. ముఖ్యమైన నిర్ణయాల విషయంలో మనం నిదానంగా ఆలోచించాలనేది రచయిత నిశ్చితాభిప్రాయం. ఒకే విధానాన్ని పదేపదే అనుసరించడం సృజనాత్మకతను అణచివేస్తుంది అనే వాదనలో నిజం ఉంది. కాగా, స్పష్టత, నిశిత దృష్టి, ఏకాగ్రత అవసరాన్ని రచయిత ప్రస్తావిస్తాడు. ఇవి ఉపయోగపడే అంశాలు. లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవడం, తక్కువ పనులను ఎక్కువ నాణ్యతతో చేయడం, దృష్టి వికేంద్రీకరణను తగ్గించడం వంటివి గుణాత్మక ధోరణులు. ఈ గ్రంథం యొక్క మరో ముఖ్యమైన బలం దాని సరళత. భాష స్పష్టంగా ఉంటుంది, ఉదాహరణలు సులభంగా అర్థమవుతాయి, ప్రతి భావన ఒక 'చేయగల సూచన' రూపంలో ఇ వ్వబడుతుంది. మొత్తం మీద ఈ పుస్తకం ఎక్కువగా 'ఏం చేయాలి' అనే విషయంపై దృష్టి పెడుతుంది. 'ఎందుకు చేయాలి' అనే ప్రశ్నకు కొంత మేర మాత్రమే సమాధా ం ఇస్తుంది. సానుకూల దృక్పథం, నిరంతర అభ్యాసం, స్వీయ నియంత్రణ ద్వారా వ్యక్తి తన జీవితాన్ని మార్చుకోగలడని రచయిత నమ్మకం. అందుకే, ఈ పుస్తకాన్ని పూర్తిస్థాయి జీవన మార్గదర్శిగా కాకుం డా, వ్యక్తిగత అభివృద్ధికి ఒక భాగంగా చూడడం సముచితం.

**పుస్తకం పేరు**

చురుకుగా తయారవ్వండి
రచయిత : బ్రియాన్ ట్రేసీ, అనువాదం: డి. అరుణ
వెల: రూ.165/

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## సాహిత్య సాంస్కృతిక విలువలకు మణిహారం

### సుద్దాల హనుమంతు, జానకమ్మ జాతీయ పురస్కారం



ఏడు దశాబ్దాల క్రితమే ప్రజాకవి సుద్దాల హనుమంతు ఒక చేత్తో కలం, మరో చేత్తో తంబురా పట్టుకొని తన పాటలతో, మాటలతో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారు. పాలకుల నిరంకుశత్వాన్ని, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు, ప్రజాసంక్షేమం కోసం పోరాడారు. ఆయన జీవితం, సాహిత్యం, సాంస్కృతిక ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి అందించడంలో సుద్దాల హనుమంతుజానకమ్మ జాతీయ పురస్కారాలు విశిష్ట పాత్ర పోషిస్తున్నాయి. 1910 జూన్ 6న నల్లగొండ జిల్లా పాలడుగు గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన హనుమంతు, నిజాం పాలనలో ప్రజలు అనుభవిస్తున్న వెట్టిచాకిరీ, దోపిడీ, సామాజిక అసమానతలను ప్రత్యక్షంగా చూశారు. అటెండర్‌గా, ఆర్యసమాజ కార్యకర్తగా, బుర్రకథకుడిగా, ప్రజాకవిగా, కమ్యూనిస్టుగా వివిధ బాధ్యత లు నిర్వహిస్తూ ప్రజా ఉద్యమాల్లో భాగమయ్యారు. ఆయన పాటలు ప్రజల బాధలను ప్రతిబింబించడమే కాకుండా, వారిలో పోరాట స్ఫూర్తిని నింపాయి. 'పాలబుగ్గల జీతగాడ' వంటి సామాన్యుల జీవిత చిత్రణ ద్వారా శ్రమజీవుల కష్టాలను సాహిత్యంలో ఆవిష్కరించారు. బుర్రకథలు, జానపద కళారూపాల ద్వారా ఉద్యమకారుల త్యాగాలను, వీరత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రజల నుంచి పుట్టిన ఆయన సాహిత్యం తిరిగి ప్రజలనే చైతన్యప రిచింది. హనుమంతు జీవిత సహచరి జానకమ్మ ఆయనకు కేవలం కుటుంబ భాగస్వామి మాత్రమే కాదు... ఉద్యమ గానంలోనూ, సాంస్కృతిక ప్రస్థానంలోనూ సహచరిగా నిలిచారు. ఆయన పాటకు పల్లవిగా, తంబురా నాదానికి వంతపాటగా తన గొంతును కలిపారు. ఈ ఆదర్శ దంపతుల స్మృతిని చిరస్థాయిగా నిలపాలనే సంకల్పంతో ప్రముఖ సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ వారి పేర్లతో జాతీయ పురస్కారాలను నెలకొల్పారు. 2010లో హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రారంభమైన ఈ పురస్కారాలు సాహిత్య, సాంస్కృతిక, జానపద, ప్రజా కళారంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులను గౌరవిస్తున్నాయి. బి. నర్సింగరావు, గద్దర్, గూడ అంజయ్య, వంగపండు ప్రసాదరావు, గోరేటి వెంకన్న, జయరాజు, ఆర్. నారాయణమూర్తి, అందెశ్రీ, ఓల్గా, విమలక్క, మధుప్రియ తదితరులు ఈ పురస్కారాన్ని అందుకున్న వారిలో ఉన్నారు. వివిధ ప్రాంతాలు, భాషలు, కళారూపాలకు చెందిన ప్రతిభావంతులను గౌరవించడం ఈ పురస్కారాల విశిష్టత. హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం (అక్టోబర్ 26న) జరిగే జాతీయ పురస్కారాల కార్యక్రమంలో ప్రముఖ కథారచయిత్రి, అనువాదకురాలు స్వాతి శ్రీపాదకు జాతీయ సాహితీ పురస్కారం, యక్షగాన కళాకారుడు మహమ్మద్ అక్బర్ పాషాకు జాతీయ జానపద పురస్కారం అందజేయనున్నారు. సుద్దాల సుధాకర్ తేజ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. తాటి రమేష్ కీలకోపన్యాసం చేయనున్నారు. నేటి సమాజంలో అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాలు, మత అసహనం, సామాజిక అసమానతలు ప్రజాస్వామిక విలువలకు సవాళ్లుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా 'జెన్ జి' తరానికి ప్రజా పోరాటాల చరిత్రను, శ్రమజీవుల జీవితాలను, అభ్యుదయ సాహిత్య స్ఫూర్తిని పరిచయం చేయాలి. సుద్దాల హనుమంతు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాటలు ప్రజల గొంతుల్లో, కళాకారుల ప్రదర్శనల్లో, సామాజిక ఉద్యమాల్లో ప్రతిధ్వనిస్తూ నే ఉన్నాయి. ప్రజల పక్షాన నిలవడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, కళను సామాజిక మార్పుకు సాధనంగా మలచడం ఆయన అందించిన సందేశం. ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడంలో సుద్దాల హనుమంతు–జానకమ్మ జాతీయ పురస్కారాలకు విశేష ప్రాధాన్యం ఉంది. సుద్దాల అశోక్ తేజ స్థాపించిన ఈ ఫౌండేషన్ కుటుంబ సభ్యుల సహకారంతో సాహిత్య, సాంస్కృతిక సేవలను కొనసాగిస్తోంది. ఈ పురస్కారాలు ప్రతిభను గౌరవించడమే కాకుండా, ప్రజా సాహిత్యాన్ని, జానపద కళలను, సామాజిక బాధ్యతను ప్రోత్సహిస్తున్నాయి.

**ప్రజాకవి సుద్దాల హనుమంతు, జానకమ్మలకు జోహార్లు!**
**ప్రజాసాహిత్యం, ప్రజాకళలు వర్ధిల్లాలి!**



– కెవిఎల్
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం
తెలంగాణ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
9490952649

(సుద్దాల హనుమంతు–జానకమ్మ జాతీయ పురస్కార వేడుకలు 2026 అక్టోబర్ 26న రవీంద్రభారతిలో జరుగుతున్న సందర్భంగా సుద్దాల హనుమంతు గారిని స్మరించుకుంటూ)

## ఈ వారం కవితలు

### అర్ధరాత్రి స్వాతంత్ర్యం

నిర్భయ భారత్ అంటూ..
నీతులెన్నో చెప్పుతుండ్రు
నిర్భయంగా..
ప్రజాస్వామ్య దేశాన్ని
అంగట్లో అమ్ముతుండ్రు

అధికారం అడ్డుపెట్టి
నియంతగ ఏలుతుంటే
నీట్ పేపర్ లీకేజీ
నిగ్గదీస్తూ.. నిరసిస్తే
ప్రశ్నించే గొంతులను
దిమాగి నక్సల్సంటున్నరు

ఎస్ఐఆర్ సాకుతోటి
ఓట్లను తొలగిస్తుంటే
చూస్తూ ఊరుకోని జనం
తిరుగుబాటు చేస్తుంటే
పోలీసు బలగాలతో

నిర్బంధము చేస్తున్నరు

హిందూ ముస్లింలని
మతం మంట పెడుతున్నరు
ఎలక్షన్లో ఓట్ల కొరకు
జై శ్రీ రాం అంటున్నరు
దేవుండ్ల బొమ్మలెట్టి
ఓట్లడుగుట తప్పంటే
హిందువే కాదంటరు

అర్ధరాత్రి స్వాతంత్ర్యం
ఇంకా తెలవారదాయె
కూలన్నలు, రైతన్నలు
దండోరా చేయండి
చీమల దండై సాగండి

వేగు చుక్కలై వెలుగండి
కారు చీకటిని తరమండి
రాజ్యాధికారం సాధించండి

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

### అక్షరాల అనుభూతులు

శిఖరాల అగ్రాలు ఎక్కుతా
విజయ జెండా ఎగరేస్తా!
పాతాళంలో పడ్డా పైకి వస్తా
పట్టుదలతో విధిరాతనే
తిరగరాస్తా!

కడలి అలలపై తేలుతా
కలల నావలో విహరిస్తా!
నీలి గగనాలపై ఎగురుతా
నక్షత్రాలతో చెలిమి చేస్తా!

ఊహల లోకానికి తీసుకెళ్తా
ఉల్లాసాల ఊయలలో ఊపుతా!
మనసుల తలుపులను తడతా
మమతల మకరందం పంచుతా!

చైతన్య దీపాలను వెలిగిస్తా
చీకటి తెరలను చీల్చుతా!
కలతల గుండెలకు
కొండంత అండనిస్తా
కన్నీటి చుక్కలను తుడుస్తా!

మోడుబారిన మనసుల్లో
మొలకెత్తే ఆశలను నాటుతా!
ఎండమావుల దారుల్లో
ఎదురయ్యే ఎడారిని
నందనవనం చేస్తా!

కాలగమనాన్ని ఆపలేకున్నా
కావ్యగమనంతో
కాలాన్నే దాటుతా!
మరణం దేహాన్ని మట్టిలో కలిపినా

మధురాక్షరాలతో
మరపురాని జ్ఞాపకమవుతా!
కలం కదిలిస్తా కావ్యాలు సృష్టిస్తా,
కల్పనలు రగిలిస్తా
కొత్త లోకాలు వెలిగిస్తా!

భావాలు పలికిస్తా
భువనాన్ని పులకిస్తా,
కవితలు విరబూయిస్తా
హృదయాలను పరవశపరుస్తా!

ఊహలకు రెక్కలిస్తా
ఉవ్వెత్తున ఎగరేస్తా!
అక్షరాలకు అంతమెందుకు
అనంతాన్ని ఆవిష్కరిస్తా!
అక్షరాలే నా అస్త్రాలు
అనుభూతులే నా శస్త్రాలు!
భావాలే నా భువనాలు
భాషా వైభవాలే
నా విజయతోరణాలు!

గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,

## విభిన్న రచనల కేంద్రం అహ్మదాబాద్ పుస్తకోత్సవం




గుజరాత్‌లో ప్రారంభమైన అహ్మదాబాద్ అంతర్జాతీయ పుస్తకోత్సవం నవంబర్ ఒకటో తేదీ వరకు పాఠకులకు విభిన్న రచనలను అందుబాటులో ఉంచుతుంది. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బిటి) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ 12వ పుస్తకోత్సవం సబర్మతి రివర్‌ఫ్రంట్‌లోని ఈవెంట్ సెంటర్‌లో కొనసాగుతుంది. ఇందు లో 700 పుస్తక విక్రయ స్టాళ్లను ఏర్పాటు చేశారు. సాహిత్యం, కవిత్వం, గజల్స్, సంగీతం, బాలసాహిత్యం, రచనా ప్రక్రియలు, పుస్తక ప్రచురణ, మేధో చర్చలు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. కాగా, పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడం నేటి సమాజంలో అత్యంత అవసరం. అందుకే, ఇలాంటి బుక్‌ఫెయిర్స్ విరివిగా జరగాలి. అహ్మదాబాద్ పుస్తకోత్సవం భాషలు, సంస్కృతుల మధ్య వారధిగా నిలుస్తుంది. గుజరాత్ సాహిత్య, సాంస్కృతిక గుర్తింపును జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది. అంతేగాక, వివిధ భాషలకు చెందిన ఎంతో మంది రచయితలు కూడా పరిచయమవుతారు. ఉత్సవంలో పిల్లల కోసం ప్రత్యేక పెవిలియన్, రచయితల సమావేశాల కోసం కార్నర్, 'జ్ఞాన గంగా', 'విచార్ మంథన్' చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సనాతన ధర్మంలోని ప్రాచీన జ్ఞానం, విలువలను యువతకు పరిచయం చేసే 'సనాతన్ బోధ్' పుస్తక శ్రేణిని కూడా ప్రదర్శిస్తున్నారు. పుస్తకాలతోపాటు హస్తకళలు, వస్త్ర కళలను ప్రోత్సహించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ 'ఛాప్' పేరుతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహిస్తోంది. ఈ పుస్తకోత్సవంలో పాల్గొనేవారు రచయితలతో ముఖాముఖి చర్చలు, పఠన కార్యక్రమాల ద్వారా సాహిత్య ప్రపంచాన్ని మరింత దగ్గరగా తెలుసుకునే అవకాశం పొందవచ్చు.

## ఎనిమిదేళ్లలో 16 జైళ్లు!

భారతీయ రచయిత వీరిందర్ సింగ్ పర్వార్ రచించిన 'ఎగ్జైల్డ్ అలైవ్: 8 ఇయర్స్ ఇన్ 16 అమెరికన్ ప్రిజన్స్' జ్ఞాపకాల పుస్తకం ఇటీవల జరిగిన ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శనలో ఆవిష్కరణకు నోచుకుంది. ఉన్నత విద్యను అభ్యసించి విద్యారంగంలో స్థిరపడాలనే ఆశతో పర్వార్ 1981లో అమెరికాకు వెళతాడు. అయితే, ఆయన జీవితం అనూహ్యమైన మలుపు తిరుగుతుంది. అమెరికా ఫెడరల్ జైళ్ల వ్యవస్థలో ఎనిమిదేళ్లు గడిపిన ఆయన, ఆ కాలంలో 16 వేర్వేరు జైళ్లలో ఉన్నాడు. తన జీవితంలోని ఈ కఠినమైన అధ్యాయాలను పుస్తకంలో వివరించారు. జైలు జీవితంలోని అనుభవాలు, సుదీర్ఘ నిర్బంధం, న్యాయపరమైన ప్రక్రియలు, వ్యక్తిత్వం ఎదుర్కొన్న సంక్షోభాలు ఈ పుస్తకంలో ప్రధానంగా కనిపిస్తాయి. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆత్మస్థైర్యాన్ని నిలబెట్టుకోవడం, వ్యక్తిగత గుర్తింపును కాపాడుకోవడం, ఆశను కోల్పోకుండా ముందుకు సాగడం వంటి అంశాలకు పర్వార్ తన అనుభవాల రూపంలో ప్రాధాన్యమిచ్చాడు. 2003లో భారత్‌కు తిరిగివచ్చిన పర్వార్ పంజాబ్‌లో స్థిరపడ్డాడు. రచనా వ్యాసంగంతోపాటు సామాజిక సేవలోనూ చురుగ్గా పాల్గొంటున్నాడు. నిరాశ్రయుల కోసం 'హోమ్ ఫర్ ది హోమ్‌లెస్' సంస్థను స్థాపించి, దాదాపు 300 ఇళ్ల నిర్మాణానికి సహకరించాడు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సాయం అందించాడు. ప్రపంచవ్యాప్తంగా రచయితలు, ప్రచురణకర్తలు, పుస్తక ప్రియులను ఆకర్షించే ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శన అంతర్జాతీయ ప్రచురణ రంగంలో కీలక వేదికగా నిలుస్తోంది. ఈ వేదికపై పర్వార్ జ్ఞాపకాల పుస్తకం పరిచయం కావడం ద్వారా ఆయన అసాధారణ జీవిత ప్రయాణం అంతర్జాతీయ పాఠకులకు చేరువయ్యే అవకాశం ఏర్పడింది.




## సరిహద్దులు దాటుతున్న సాహిత్య స్వరం

ఒకప్పుడు సాహిత్యానికి కూడా సరిహద్దులు ఉండేవి. ఒక భాషకు ఒక ప్రపంచం, ఒక దేశానికి ఒక సాహిత్య సంప్రదాయం, ఒక సంస్కృతికి ఒక కథనం అన్నట్లుగా ప్రపంచ సాహిత్యం విభజించబడి ఉండేది. కొన్ని ప్రాచీన కావ్యాలు, కొన్ని భౌగోళిక ప్రాంతాలు, కొన్ని ఆధిపత్య భాషలు మాత్రమే 'ప్రపంచ సాహిత్యం' అనే పదానికి ప్రతినిధులుగా నిలిచేవి. కానీ కాలం తన అడుగులు మార్చింది. సాంకేతికత ప్రపంచాన్ని దగ్గర చేసినట్లే, సాహిత్య ప్రపంచాన్నీ విశాలం చేసింది. ఇప్పుడు ఒక మూలన రాసిన కథకు మరో మూలన ఉన్న పాఠకుడి హృదయంలో చోటు దొరుకుతోంది. ఆఫ్రికా నేల నుంచి వినిపించే స్వరం, లాటిన్ అమెరికా జ్ఞాపకాల నుంచి పుట్టిన కథ, దక్షిణాసియా జీవితాల నుంచి వెలువడిన అనుభవం, మధ్య ప్రాచ్యపు వేదన వంటి ఎన్నో భావాలు, విషయాలు, ఆలోచనలు నేడు భాషల సరిహద్దులను దాటి ప్రపంచ పాఠకుల ముందుకు వస్తున్నాయి. అనువాదం ఈ ప్రయాణానికి వంతెనగా నిలుస్తోంది. నేటి సాహిత్యంలో ప్రక్రియల మధ్య గోడలు కూడా కూలిపోతున్నాయి. చరిత్రతో కల్పన చేయి కలుపుతోంది. సైన్స్ ఫిక్షన్‌లో మానవ అనుభూతులు పలుకుతున్నాయి. మాయా వాస్తవికతలో జీవితపు లోతైన సత్యాలు దర్శనమిస్తున్నాయి. ఒకే కథలో అనేక ప్రపంచాలు కలిసిపోతూ పాఠకుడికి కొత్త సాహిత్యానుభూతిని అందిస్తున్నాయి. ప్రకృతి కూడా నేటి సాహిత్యంలో ఒక పాత్రగా మారింది. వాతావరణ మార్పు, అడవుల విధ్వంసం, నీటి కొరత, ప్రకృతి విపత్తులు వంటి ఎన్నో అంశాలు శాస్త్ర నివేదికలలోని గణాంకాల పరిధిని దాటి, మనిషి కన్నీటిలో, కుటుంబాల ఆందోళనలో, భవిష్యత్తుపై పిల్లల భయంలో ప్రతిధ్వనిస్తున్న కథలుగా మారుతున్నాయి. అలాగే, రచయిత తన జీవితాన్నే కథగా మలుచుకునే 'ఆటోఫిక్షన్' ధోరణి వ్యక్తిగత జ్ఞాపకాలకు సాహిత్యపు కొత్త కిటికీ తెరిచింది. తనలోని మనిషిని ప్రపంచం ముందు నిలబెట్టే ఈ రచనలు పాఠకుడికి ఒక విచిత్రమైన సాన్నిహిత్యాన్ని కలిగిస్తున్నాయి. ఒకప్పుడు పుస్తకాన్ని పాఠకుడి చేతికి చేర్చేది ప్రచురణ సంస్థ. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఒక పాఠకుడి మాట వేలాది మందిని ఒక పుస్తకం వైపు నడిపించగలదు. 'బుక్‌టాక్' వంటి వేదికలు పఠన సంస్కృతికి కొత్త ఊపిరినిస్తున్నాయి. అయితే సాహిత్యపు అసలు ప్రయాణం సాంకేతికతలో కాదుమనిషి హృదయంలో. భాషలు వేరైనా కన్నీటి రుచి ఒక్కటే; సంస్కృతులు వేరైనా ప్రేమకు స్పందించే హృదయం ఒక్కటే. అందుకే నేటి ప్రపంచ సాహిత్యం కేవలం దేశాల మధ్య సంభాషణ కాదు; మనిషి నుంచి మనిషికి, హృదయం నుంచి హృదయానికి సాగే ఒక నిశ్శబ్ద సంభాషణ. సరిహద్దులు మారవచ్చు. భాషలు మారవచ్చు. కాలం మారవచ్చు. కానీ ఒక మంచి కథ మాత్రం తన దారిని తానే వెతుక్కుంటుంది. చివరకు అది చేరేది మాత్రం పాఠకుడి హృదయానికే.

## రైతాంగ ప్రయోజనాలే ముఖ్యం..
# జలవివాదాలు వద్దు

- డిండి ప్రాజెక్టుకు 0.6 టిఎంసిల కేటాయింపుపై హర్షం
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలి
- ప్రాంతీయ విభేదాలు సృష్టించడం సరికాదు
: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగ ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 0.6 టిఎంసిల నీటిని కేటాయించాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షల సాధన దిశగా కీలక ముందడుగని అభివర్ణించారు. ఆదివారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు సరికావని గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని మాట్లాడటం సమంజసం కాదన్నారు. జాతీయ పార్టీకి చెందిన కీలక నాయకురాలిగా, బిజెపి ఎంపిగా ఉన్న డీకే అరుణ ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే వ్యాఖ్యలకు బదులుగా సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. జాతీయ హోదా లభిస్తే అవసరమైన నిధులు సమకూరి, పెండింగ్ పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డిండి ఎత్తిపోతల పథకం కేవలం సాగు నీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో సతమతమైన దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన కీలక ప్రాజెక్టు అని గుత్తా తెలిపారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షితమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు వివరించారు. ఈ ప్రాంత ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని గుర్తించాలని కోరారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు నీటి కోసం పరస్పరం వివాదాలకు దిగడం వల్ల ఇరు ప్రాంతాలకూ నష్టం జరుగుతుందని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం జరుపుతున్న చర్చలు సఫలమై రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలమైన ఫలితాలు రావాలని ఆకాంక్షించారు.

# వాస్తవాలు నియంత్రిస్తున్న ప్రభుత్వం.. జర్నలిజానికి సవాల్

- డిజిటల్ యుగంలో మారుతున్న మీడియా స్వరూపం
- జర్నలిస్టులకు కొత్త నైపుణ్యాలు అవసరం: సీనియర్ జర్నలిస్టు ఉమా సుధీర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒకప్పుడు అభిప్రాయాలను, వాస్తవాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వమే వాస్తవాలను నియంత్రించే పరిస్థితులు నెలకొన్నాయని సీనియర్ జర్నలిస్టు, ఎన్‌డిటివి సౌత్ మాజీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమా సుధీర్ ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ మీడియా, కృత్రిమ మేధ (ఎఐ) ప్రభావంతో జర్నలిజంలో పెనుమార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా జర్నలిస్టులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సులో ఆదివారం 'మారుతున్న జర్నలిజం: డిజిటల్ నైపుణ్యత, విశ్వసనీయత, విలేకరుల ఐక్యత' అంశంపై ఆమె ప్రసంగించారు. వార్తల సేకరణ, ప్రసారం, ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానాలు మారుతున్నాయని పేర్కొన్నారు. ఎఐ వినియోగం పెరిగినా వార్తల వాస్తవికతను నిర్ధారించడంలో మానవ ప్రమేయం కీలకమని స్పష్టం చేశారు. వార్తల విశ్వసనీయతను కాపాడేందుకు ఫ్యాక్ట్ చెకింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సంప్రదాయ మీడియా కంటే సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి డిజిటల్ వేదికల ద్వారా వార్తలు తెలుసుకోవడానికి యువత ఆసక్తి చూపుతోందని ఉమా సుధీర్ తెలిపారు. జర్నలిస్టులు మొబైల్ జర్నలిజం, రీల్స్, చిన్న వీడియోల రూపకల్పన, ఆకట్టుకునే శీర్షికలు రాయడం వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వార్తలపై విమర్శలు, సోషల్ మీడియా ట్రోలింగ్ పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులు, రక్షణ కోసం యూనియన్లు చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు పరస్పరం అండగా నిలిచి ఐక్యం గా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఐ డ్రీమ్ మీడియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ స్వప్న మోడరేటర్‌గా వ్యవహరించారు.

**పాత్రికేయ విలువలకు తిలోదకాలివ్వకుండా ఎఐ వినియోగం : ఖలీజా గరారి**



పాత్రికేయ సూత్రాల విషయంలో రాజీ పడకుండా కృత్రిమ మేధ (ఎఐ)ను బాధ్యతాయుతంగా వినియోగించాలని న్యూస్ మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఖలీజా గరారి సూచించారు. వార్తా సేకరణ, సమాచార విశ్లేషణ, అనువాదం వంటి పనుల్లో ఎఐ సహాయక సాధనంగా ఉపయోగపడుతుందని, అయితే అది జర్నలిస్టుల మానవ విచక్షణకు, క్షేత్రస్థాయి రిపోర్టింగ్‌కు ప్రత్యామ్నాయం కాదని ఆమె స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సులో రెండో రోజు ఆదివారం 'జర్నలిజంలో మరింత మెరుగ్గా, బాధ్యతాయుతంగా ఎఐ వినియోగం' అనే అంశంపై ఆమె మాట్లాడారు. జర్నలిస్టులు ఎఐపై పూర్తిగా ఆధారపడకుండా, తమ వృత్తిపరమైన పరిజ్ఞానంతో సమాచారాన్ని పరిశీలించి, వాస్తవాలను ధ్రువీకరించిన తర్వాతే వార్తలను ప్రచురించాలని సూచించారు. ప్రెస్‌నోట్‌లు, ఇతర సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి ఎఐని ఉపయోగించినప్పటికీ, ముందుగా జర్నలిస్టులు స్వయం గా వాటిని అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. యువ జర్నలిస్టులు వృత్తి జీవితంలో తొలి నాలుగేళ్లు క్షేత్రస్థాయి రిపోర్టింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఖలీజా గరారి సూచించారు. వార్తల్లో, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలో ఎఐతో రూపొందించిన చిత్రాలు, వీడియోలను విచ్చలవిడిగా ఉపయోగించడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవాల ధ్రువీకరణకు, పాత్రికేయ నైపుణ్యాల మెరుగుదలకు ఎఐను ఉపయోగించుకోవాలే తప్ప, సొంత ఆలోచనకు, విచక్షణకు దూరం కాకూడదని ఆమె స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే సాంకేతికతను వినియోగిస్తూ, వార్తల విశ్వసనీయతను కాపాడాలని జర్నలిస్టులకు సూచించారు. కార్యక్రమానికి రీసెర్చర్ అండ్ అనలిస్ట్ దీప్తి బత్తిని మోడరేటర్‌గా వ్యవహరించారు.

**టిఆర్‌పిల వేటలో జర్నలిజం నైతిక విలువలు పతనం : ప్రొఫెసర్ పద్మజా షా**



ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యతలను పక్కనపెట్టి టిఆర్‌పిలు, క్లిక్‌లు, లైకులు, వైరల్ వార్తల కోసం పరుగులు తీస్తున్న ప్రస్తుత మీడియా ధోరణి ఆందోళన కలిగిస్తోందని ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విశ్రాంత హెడ్ ప్రొఫెసర్ పద్మజాషా అన్నారు. వార్తా సేకరణ, ప్రసారం, భాషా వినియోగంలో నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండో రోజు జరిగిన జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సులో భాగంగా 'జర్నలిజంలో నైతికత, బాధ్యతాయుతమైన భాషా వినియోగం' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. ముఖ్యంగా ప్రాంతీయ మీడియాలో అసభ్యకరమైన భాష, దిగజారుతున్న నైతిక ప్రమాణాలు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. వార్తల్లో ఏ అంశాలను ప్రసారం చేయాలి, వేటిని నివారించాలనే విషయంలో నైతికత కీలకమని, ఇది వార్తా భాషతోపాటు దృశ్యాలకూ వర్తిస్తుందని తెలిపారు. బాధిత మహిళలు, బాలికల వివరాలు, ఫొటోలను వెల్లడించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ప్రముఖ మీడియా సంస్థలు సైతం వాటిని ఉల్లంఘించడం బాధాకరమన్నారు. జర్నలిజం విద్యార్థులను మీడియా యాజమాన్యాల స్వప్రయోజనాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దే సంస్థాగత శిక్షణా విధానాల్లో మార్పులు రావాలని పద్మజా షా సూచించారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యమిచ్చేలా జర్నలిజం పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

**నైతిక విలువలే జర్నలిజానికి ఆత్మ వంటివి: అయేషా ఖానుమ్**



నైతిక విలువలే జర్నలిజానికి ఆత్మ వంటివని కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ అయేషా ఖానుమ్ అన్నారు. ప్రైవేట్ న్యూస్ ఛానెళ్లు, డిజిటల్ వేదికలు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సంచలనాల కోసం కాకుండా ప్రజలకు విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడంపై జర్నలిస్టులు దృష్టి సారించాలని, ఆత్మపరిశీలనతో వృత్తిపరమైన విశ్వసనీయతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.



- ఐదేళ్లలో పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- 'కె హార్మనీ ఫెస్టా కొరియా సాంస్కృతిక దినోత్సవం'లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

# కొరియా పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థలతో కలిసి పనిచేసేందుకు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన 'కె హార్మనీ ఫెస్టాకొరియా కల్చర్ డే 2026' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ.లీ సియుంగ్‌హో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ 2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ కొరియాలో చేపట్టిన పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేశాయని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ పర్యాటక విధానం 2025 –2030 ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పర్యాటక మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, సాంస్కృతిక అనుభవాల అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

**భారత్–కొరియా మధ్య సాంస్కృతిక బంధం**

కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని డిప్యూటీ సిఎం అన్నారు. యుద్ధం, పేదరికం వంటి సవాళ్లను అధిగమించి కొరియా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని కొనియాడారు. సాంకేతికత, తయారీ, విద్య, ఆవిష్కరణల్లో ఆ దేశం సాధించిన విజయాలు ప్రశంసనీయమన్నారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయని, సాంస్కృతిక ప్రభావం కూడా ఒక దేశ అంతర్జాతీయ గుర్తింపును పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు. ప్రాచీన భారతదేశం నుంచి కొరియాకు వెళ్లినట్లు విశ్వసించే రాణి హియో హ్వాంగ్ ఓక్ గాథ రెండు దేశాల మధ్య చారిత్రక స్నేహానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

**తెలంగాణ వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు**

విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల కలయికకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రంగా నిలిచిందని చెప్పారు. బతుకమ్మ, బోనాలు, తెలుగు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కట్టడాలు తెలంగాణ ప్రత్యేకతలని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క వివరించారు. చార్మినార్, గోల్కొండ కోట, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం సహా రాష్ట్రంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలు భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయగలవని అన్నారు. కొరియా పర్యాటకులు తెలంగాణను సందర్శించాలని, ఇరు ప్రాంతాల యువత చదువు, పరిశోధన, ఉద్యోగాలు, సృజనాత్మక రంగాల్లో పరస్పరం అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం

- కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఉత్సవాలలో హామీ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మికుల సంక్షేమం కోసం హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి హమాలీలకు న్యాయం చేస్తామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రొక్యూర్‌మెంట్ జరిగిందని, అందులో హమాలీల పాత్ర కీలకమైందని మంత్రి ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలో అమలవుతున్న హమాలీ సంక్షేమ బోర్డులను పరిశీలించి, రాష్ట్రంలో హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎంబి గార్డెన్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎఎంసి వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి ఎంబి గార్డెన్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికులను చైతన్య పరిచే విధంగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియ్యన్ ఆధ్వర్యంలో ప్రచురించిన హమాలీ వాయిస్ పత్రికను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రసంగిస్తూ కార్మికుల ఐక్యతతోనే ఏదైనా సాధ్యం అని, కార్మికుల ఐక్యతే మహాబలం అని అన్నారు. బరువులు బస్తాలు మోస్తున్న హమాలీ కార్మికులను సంఘటిత పరుస్తూ పది సంవత్సరాలు సంఘాన్ని దిగ్విజయంగా నడపడం గొప్ప విషయమని అన్నారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ ఉపన్యసిస్తూ, గడ్డం కుటుంబం ఎప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని, తాత దివంగత గడ్డం వెంకటస్వామి ఎల్లప్పుడూ కార్మికుల సంక్షేమం కోసం పరితపించే వారని గుర్తు చేశారు.

ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ బరువులతో కూడిన బస్తాలు మోస్తూ శ్రమిస్తున్న హమాలీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక అండగా ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. హమాలీ కార్మికుల సమస్యలను సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో హమాలీ సంఘం భవనానికి స్థలం ఇప్పించడంతో పాటు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హమాలీ కార్మికులకు మాట ఇచ్చిన విధంగా హమాలీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, కార్మిక క్షేత్రమైన పెద్దపల్లి జిల్లాలో హమాలీ కార్మికులకు హమాలీ కాలనీ ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర బాధ్యుడు గుంటి సామ్రాజ్యం ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఫ్లాట్‌ఫామ్, గిగ్ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె సలావుద్దీన్, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెడి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పి శివకుమార్, రైతు స్వరాజ్య వేదిక కన్నెగంటి రవి, న్యాయ సలహాదారులు ఉప్పు రాజన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగ సంపత్ యాదవ్, కామ భూమయ్య, కొమ్ము మధు, జిఎంఆర్ గోదాం నాయకులు చిప్ప రాజు, తిరుపతి, సందీప్, ఎస్‌డబ్ల్యూసి బండారి రమేష్, నాగన్న, రైల్వే గూడ్స్ షెడ్ నాయకులు శ్రీశైలం, కనుకయ్య, బండారి రాజ్‌కుమార్, ఎస్.రాజు, దాగటి రాజేందర్, బజార్ హమాలీ సంఘం నాయకులు ప్రభాకర్, లింగన్న, సది, ఉమ్మడి జిల్లాలోని ప్రభు త్వ ప్రైవేటు గోదాములు, ఏఎంసి, రైల్వే గూడ్స్ షెడ్, బజార్, ఐకెపి, వివిధ సంస్థల స్థలాలు, ప్రదేశాలలో పనిచేస్తున్న హమాలీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తీవ్ర వాయుగుండంగా 'అర్నబ్'

**విశాఖపట్నం/హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం స్థిరంగా కదులుతోంది. విశాఖకు 880 కి.మీ, కాకినాడకు 980 కి.మీ, మచిలీపట్నానికి 1,080 కి.మీ, బాపట్లకు 1,150 కి.మీ దూరంలో ఇది కేంద్రీకృతమైంది. గంటకు 5 కి.మీ వేగంతో ముందుకు కదులుతోందని వాతావరణశాఖ (ఐఎండి) తెలిపింది. తీవ్ర వాయుగుండం.. సోమవారానికి తుపానుగా బలపడుతుందని వెల్లడించింది. ఈనెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా, 28 ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెంది అదే రోజు మధ్యాహ్నానికి బాపట్ల, విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశముందని అధికారులు తెలిపారు. తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 140 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ తుపానుకు బంగ్లాదేశ్ సూచించిన 'అర్నబ్' పేరు పెట్టిన విషయం తెలిసిందే.

**వచ్చే బుధ, గురువారాల్లో తెలంగాణలో భారీ వర్షాలు**

రాష్ట్రంలో రాగల ఏడు రోజుల పాటు పలుచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ముఖ్యంగా వచ్చే బుధ, గురువారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆది, సోమవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు జల్లులు కురుస్తాయన్నారు. మంగళవారం నుంచి నుంచి వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందన్నారు. మంగళవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. అయితే బుధవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుండి అతి భారీ వర్షాలతోపాటు అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్నారు. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. కరీంనగర్, పెద్దపల్లి, హన్మకొండ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడి గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో 30–40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయన్నారు. గురువారం కోమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, హైదరాబాద్ సహా మెజారిటీ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపారు.శుక్ర, శనివారాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ తెలిపారు.

## వాటర్ బోర్డు జాయింట్ డైరెక్టర్ కారులో రూ.2.40 లక్షల నగదు స్వాధీనం

- అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు.. నగదుపై పొంతనలేని సమాధానాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి)లో పనిచేస్తున్న జాయింట్ డైరెక్టర్ కారులో లెక్కల్లో చూపని రూ.2.40 లక్షల నగదును అవినీతి నిరోధక శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఖైరతాబాద్‌లోని కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో అందిన సమాచారం మేరకు నిఘా పెట్టిన ఎసిబి సిటీ రేంజ్2 బృందం, శుక్రవారం రాత్రి కారును అడ్డగించి తనిఖీ చేసింది. నగదుకు సంబంధించి అధికారి సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోవడంతో దాన్ని స్వాధీనం చేసుకుని, అవినీతి కోణంలో తదుపరి విచారణకు చర్యలు చేపట్టింది. ఎసిబి వెల్లడించిన వివరాల ప్రకారం.. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ఖైరతాబాద్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ అక్రమంగా వసూలు చేసిన నగదుతో కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్నారంటూ గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందింది. దీంతో ఎసిబి సిటీ రేంజ్2 అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 24న రాత్రి 7 గంటల సమయంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ రోడ్డులో మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ల ఎదురుగా టిఎస్08 జిక్యూ 3699 నంబరు గల మారుతీ స్విఫ్ట్ కారును అడ్డగించారు. ఆ కారు జాయింట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్‌కు చెందినదిగా గుర్తించారు. కారులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా రూ.2,40,000 నగదు లభ్యమైంది. ఈ మొత్తానికి సంబంధించి అధికారులు ప్రశ్నించగా, శ్రీనివాస్ పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు ఎసిబి తెలిపింది. దీంతో నగదును పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. నగదు మూలాలు, అవినీతి కోణంపై ధ్రువీకరణ చేపట్టడంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు, ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించనున్నట్లు పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106తో పాటు తెలంగాణ ఎసిబి సామాజిక మాధ్యమాల ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై ఈడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం, అరెస్టులతో భయపెట్టడం వంటి రాజకీయ ధోరణులు ప్రజాస్వామ్యానికి మంచివి కాదన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ కెటిఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ దేశంలో మతతత్వ రాజకీయాలను అడ్డుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ ఒక్కటే సరిపోదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదుర్కొనే రాజకీయ సత్తా కాంగ్రెస్‌కు లేదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, కుంభకోణాలపై రాహుల్‌గాంధీ స్పందించకుండా మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. మైనారిటీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల హక్కు కూడా అని అన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఒక్కొక్కటిగా వివాదాలు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో వెలుగులోకి వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని, సంబంధిత వ్యవహారాలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని కోరారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపైనా చట్టబద్ధంగా పోరాటం చేస్తామన్నారు.

## రూ.600తో వారం ప్రయాణం

- ఆర్‌టిసిలో కొత్త వీక్లీ బస్ పాస్ : ఎండి వై.నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) కొత్త వీక్లీ బస్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.600 చెల్లించి ఈ పాస్ పొందితే కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని రకాల సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఎసి బస్సులకు కూడా ఈ పాస్ వర్తిస్తుంది. అయితే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం వర్తించదు. ప్రస్తుతం అమల్లో ఉన్న డైలీ, మంత్లీ బస్‌పాస్‌లకు అదనంగా వీక్లీ పాస్‌ను ప్రవేశపెట్టినట్లు సంస్థ వెల్లడించింది. నగరంలో వారం రోజుల పాటు ప్రయాణించాల్సిన ఉద్యోగులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రయాణికులకు ఈ పథకం ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొంది. ప్రతిసారీ టికెట్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, ఒకే పాస్‌తో ఏడు రోజుల పాటు ప్రయాణించే అవకాశం కలుగుతుందని తెలిపింది. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు ప్రయాణికులకు అందుబాటు ధరల్లో మెరుగైన సేవలు అందించడమే ఈ పథ కం లక్ష్యమని సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి తెలిపారు.

## నీటి కుంటలో మునిగి ముగ్గురు మృతి



**ప్రజాపక్షం/జైపూర్ :** నీటి కుంటలో దిగి ప్రమాదవశాత్తు ముగ్గురు వలస వ్యాపారులు మృతి చెందిన విషాదకర సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. జైపూర్ మండలం ఇందారం గ్రామ సమీపంలోని నీటి కుంట వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. బాధితులు వ్యాపారం నిమిత్తం ఇందారం గ్రామానికి వచ్చి తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం బట్టలు ఉతుక్కునేందుకు గ్రామ శివారులోని నీటి కుంటలోకి దిగారు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తు లోతైన నీటిలోకి వెళ్లి మునిగిపోవడంతో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు విచ్చలవిడిగా మట్టిని తవ్వడంతో అక్కడ లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదానికి కారణమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని నీటిలో నుంచి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషాద ఘటనతో ఇందారం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

రూ.2.57 కోట్లతో ఆధునిక సౌకర్యాల కల్పన

మంత్రులు పొన్నంప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్





ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రూ.2.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు ఆదివారం రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన చేశారు.

**ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు :** బస్‌స్టేషన్ ఆధునీకరణలో భాగంగా ప్లాట్‌ఫారాల విస్తరణ,సిసి పేవ్‌మెంట్, గ్రానైట్ ఫ్లోరింగ్, భవనానికి ఎసిపిక్లాడింగ్, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, విద్యుదీకరణ, బోర్‌వెల్ ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిందని తెలిపారు. గ్రామగ్రామాన ఆర్‌టిసి సేవలను విస్తరించడంతోపాటు పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేయాలన్న స్థానికుల ఆకాంక్షను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఎన్నికలకు ముందే డిపో నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించినట్లు వెల్లడించారు.

**పుష్కరాల అభివృద్ధికి రూ.226 కోట్లు :** మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని బాసర నుంచి భద్రాచలం వరకు పుణ్యక్షేత్రాలు, ఘాట్లు, రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు, పుష్కర ఘాట్లు, బైపాస్ రహదారులు తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ.226 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బస్‌స్టేషన్ ఆధునీకరణతో ధర్మపురికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎస్. దినేష్,ఆర్‌టిసిఅధికారులు, సిబ్బంది,స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

### నృసింహుడి సన్నిధిలో మంత్రుల పూజలు

తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు.స్వామివారి దర్శనార్థం ఆలయానికి చేరుకున్న మంత్రులకు ఆలయ అధికారులు అర్చకులు దేవస్థానం సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజాది కార్యక్రమాలనంతరం వేద పండితులు,అర్చకులు మంత్రులిరువురికి ఆశీర్వచనం అందించారు. దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ మంత్రులను శేషవస్త్రం,ప్రసాదం,స్వామివారి చిత్రపటం అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్,జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ఓంకార శర్మ, ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు నంబి నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.

## ఆగని అక్రమనిర్మాణాలు..



ప్రజాపక్షం/ముస్తాబాద్: మండల కేంద్రంలో అక్రమనిర్మాణాల వ్యవహారం చర్చనీయంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రజలనుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులనుండి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని వి మర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంలో కొన్ని నిర్మాణాలు రేకుల షెడ్డు ఇటుక గోడలతో కొనసాగుతున్నట్టు క్షేత్ర స్థాయిలో దృశ్యాలు కనిపిస్తున్నాయి. వీటికి అవసరమైన అనుమతులున్నయా?నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లయితే వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలసిన భాద్యత అధికారులపై ఉంది. అక్రమ నిర్మాణాలపై గతంలోనే అధికారు ల దృష్టికి వెళ్లిన క్షేత్ర స్థాయిలో పరిస్థితి మారలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అక్రమనిర్మాణాలను అడ్డుకోవాలని కోరుకుంటున్నారు.

## దాబా హోటళ్లలో మద్యం సేవిస్తే చట్టరీత్యా చర్యలు: ఎక్సైజ్ సిఐ



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని దాబా హోటళ్లలో మ ద్యం సేవిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ప్రోహిబిషన్ ఎక్సైజ్ సిఐ రవి తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని దాబా హోటళ్లను ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. డాబా హోటళ్లలలో మద్యం సేవించవద్దని పోస్టర్లను అతికించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దాబాల్లో కస్టమర్లకి మద్యం సేవించడానికి అనుమతి ఇస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. ఇలా దాబాల్లోమద్యం సేవించడానికి అనుమతి లేదని, ఒకవేళ ఈ నియమాన్ని అతిక్రమిస్తేఅట్టి దాధాబాలపై దాడి చేసి నిర్వహించి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, కానిస్టేబుళ్ళు సురేష్, కార్తీక్ ,స్వాతి పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో 20 కి.మీ సైకిల్ ర్యాలీ : సిపి గౌష్ ఆలం



ప్రజాపక్షం / కొత్తపల్లి : పోలీస్ అమరవీలు సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రోజున కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలో మీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పోలీస్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టేషన్ మీదుగా ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోట పొన్నం కాంప్లెక్స్, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగింది. అనంతరం ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూటర్న్ తీసుకొని కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా తిరిగి బస్టాండ్ సర్కిల్ ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగిసిందని సిపితెలిపారు. కార్యక్రమం అనంతరం సిపి ర్యాలీలో పాల్గొన్న సభ్యులకు అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలల్లో ప్రజలను భాగస్వాములను చేసే ఉద్దేశంతో అక్టోబర్ 31 వరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపిలు వెంకటస్వామి, విజయకుమార్, కమిషనరేట్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు. వీరితోపాటు కరీంనగర్ కమీషనరేట్ రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేశ్ పసుల, డా.కిరణ్, అడ్వకేట్ తిరుపతి, పాఠశాల విద్యార్తులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## 'ట్రినిటీ' విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/కరీంనగర్: ట్రినిటీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కరీంనగర్‌లోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం, బోధన, బోధనేతర సిబ్బంది, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలలోని ట్రినిటీ గ్రూప్ అన్ని శాఖలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు,అధ్యాపకుల కరతాళధ్వనుల మధ్య చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి కేక్ కట్ చేశారు. డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌లు , సీనియర్ అధ్యాపక బృందం ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, శాలువలు మరియు జ్ఞాపికలను బహూకరించారు. సిబ్బందికి, విద్యార్థులకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, తన పట్ల చూపిన అపారమైన అభిమానానికి దాసరి ప్రశాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు,పరిపాలనా సిబ్బంది, విద్యార్థులు,స్థానిక ప్రముఖులు హాజరయ్యారు.

## వేములవాడలో మెగా రక్తదాన శిబిరం: సిఐ వీర ప్రసాద్




ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా విధినిర్వహణలో తమ ప్రాణాలు త్యాగం చేసిన అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ మహేష్ బి.గితే ఐ.పి.ఎస్, ఆదేశాల మేరకు వేములవాడ డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు, వేములవాడ టౌన్ ఇన్స్‌పెక్టర్ అఫ్ పోలీస్ బి. వీర ప్రసాద్ ఆధ్వర్యంలో తేది 27.10.2026 మంగళవారం రోజున వేములవాడ పట్టణంలోని బింగి మహేష్ ఫంక్షన్ హాల్ నందు మెగా రక్తదాన శిబిరం నిర్వహించుచున్నారు. రక్తదాతలు, యువకులు,పట్టణ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయగలరని సిఐ కోరారు.

## వాగు ప్రాజెక్టుకు మహర్దశ!

బీర్పూర్ మండల అభివృద్ధికి మరో చరిత్రాత్మక ముందడుగు



ప్రజాపక్షం/బీర్‌పూర్: బీర్పూర్ మండల రైతాంగానికి సాగునీటి భరోసా కల్పించాలనే లక్ష్యంతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేస్తున్న ప్రత్యేక కృషి మరో కీలక ముందడుగు వేసింది. మండల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రోల వాగు ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించడంతో,ప్రాజెక్టుకు అవసరమైన 43 ఎకరాల భూ కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్లు మండల నాయకులు వెల్లడించారు. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన కీలక అడ్డంకులు తొలగే దిశగా పురోగతి సాధించింది.

**ఏళ్ల నాటి రైతుల కల.. సాకారం దిశగా సంజయ్ కుమార్ అడుగులు!** బీర్పూర్ మండల వ్యవసాయ రంగానికి రోల వాగు ప్రాజెక్టు ఎంతో కీలకం. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి అవసరాలు తీర్చుకునే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రాజెక్టుకు సంబంధించిన భూ కేటాయింపు, అనుమతుల ప్రక్రియలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని నాయకులు తెలిపారు.

**43 ఎకరాల భూ కేటాయింపుతో కీలక పురోగతి!** రోల వాగు ప్రాజెక్టుకు అవసరమైన 43 ఎకరాల భూమి కేటాయింపు పూర్తికావడం ప్రాజెక్టు ముందడుగులో ముఖ్యమైన పరిణామమని మండల నాయకులు పేర్కొన్నారు. ఈ ప్రక్రియతో ప్రాజెక్టుకు సంబంధించిన కీలక సమస్యలు పరిష్కారమయ్యే మార్గం సుగమమైందని తెలిపారు. మిగిలిన అధికారిక ప్రక్రియలు కూడా పూర్తయి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే బీర్పూర్ మండల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పిఏసిఎస్ చైర్మన్ ముప్పాల రామచంద్రరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజగోపాలరావు మాట్లాడుతూ.. రైతుల సాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టుల కోసం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. రోల వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మండల వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతుల ఆశలకు అండగా బీర్పూర్ అభివృద్ధికి బాటలు వేస్తూ.. రోల వాగు ప్రాజెక్టు సాకారం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి అనుమతుల ప్రక్రియ కూడా వేగంగా పూర్తై, రైతులకు త్వరలోనే ప్రయోజనాలు అందాలని ఆకాంక్షించారు.

## ట్రినిటీ టి సాట్ స్కాలర్‌షిప్ పరీక్షకు విశేష స్పందన

1,138 మంది విద్యార్థుల హాజరు



ప్రజాపక్షం/కరీంనగర్: ట్రినిటీ జూనియర్ కాలే జ్ (ఐఐటి, నీట్, ఇఎపిసెట్ అకాడమీ) ఆధ్వర్య ంలో దివారం నిర్వహించిన టి సాట్ (ట్రినిటి స్కా లర్‌షగిప్ టెస్ట్) పరీక్షకు విశేష స్పందన వచ్చింద ని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రె డ్డి తెలిపారు. కరీంనగర్ తోపాటు పరిసర ప్రాం తాల్లో వివిధ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షకు ను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించారు. 1,138 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో స్వచ్ఛందంగా హాజరయ్యారని, 2027–28 విద్యా సంవత్సరం లో ఇంటర్ మొదటి సంవత్సరం / 11వ తరగతి లో చేరబోయే విద్యార్థుల కోసం ఈ పరీక్షను ప్ర త్యేకంగా నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభకనబరిచిన అర్హులైన 100 మంది విద్యార్థులకు వారి మార్కుల ఆధారంగా 100 శాతం వరకు ఫీజు మి నహాయింపుతోపాటు నగదు బహుమతులు అం దించబడునని ప్రకటించారు. ఆదివారం నిర్వహించిన పరీక్ష హాజరు కాని విద్యార్థులకు నవంబరు 1 వ తేదీన ఉదయం 10:00 నుండి 12:00 వరకు, ,మధ్యాహ్నం 2:00 నుండి 4:00 వరకు రెండు వి డతలుగా ఈ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ దాసరి ప్ర శాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మరియు ప ట్టణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అం దించి, ఐఐటి, నీట్ , ఇఎపిసెట్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు లు సాధించేలా తీర్చిదిద్దడమే ట్రినిటీ విద్యా స ంస్థల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పరీక్షను వి జయవంతం చేసిన విద్యార్థులకు, సహకరించిన తల్లి దండ్రులకు పాఠశాల యాజమాన్యాలకు , అధ్యాపక బృందానికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజల సుఖ సంతోషాలే ప్రభుత్వ ముఖ్య ధ్యేయం

నీరు,విద్యుత్,ఆహారాన్ని వృథా చేయొద్దని ప్రజలకు పిలుపు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాలు ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయని, రాష్ట్ర ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజలు నీరు,విద్యుత్,ఆహార పదార్థాలను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వనరుల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించకుండా ప్రతిపక్ష నాయకులు ప్రకృతి ప్రభావాన్ని సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని అంతటి అన్నయ్య గౌడ్ విమర్శించారు .రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు విజయరమణరావు ప్రత్యేక చొరవతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకున్నారని ఆయన పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఎల్ నినో ప్రభావం వల్ల వాతావరణంలో ఏర్పడే మార్పులను ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ సూచనలను పాటించాలని,అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అంతటి అన్నయ్య గౌడ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం,రైతుల శ్రేయస్సు,ప్రకృతి వనరుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దేశం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం

మెదక్ ఎంపి రఘునందన్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట : కుల, మత, పార్టీలకు అతీతంగా అందరినీ ఒకే చోట చేర్చాలనే ఉద్దేశంతో 25 సంవత్సరాల క్రితం మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ ప్రారంభించిన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని సిద్దిపేటలోనూ కొనసాగించడం గర్వకారణం అని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో బిజెపి సీనియర్ నాయకులు దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశం గొప్ప సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన దేశం అని, ఏ దేశం వెళ్లిన హిందువుల పండుగలను గొప్పగా జరుపుతున్నారని, మన పండుగలు విశ్వవ్యాప్త మయ్యాయని అన్నారు. అందరూ ఒకే దగ్గర కలవాలని ఉద్దేశంతో దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏడు ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణం అన్నారు. ముందు ముందు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన కోరారు. కుల,మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అలయ్‌బలయ్‌ను మరింత విస్తృతంగా నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, అంబటి బాలేష్ గౌడ్, కలాల్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు బాసంగారి వెంకట్, కొత్తపల్లి రాధ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల కల నెరవేర్చాం: ప్రభుత్వ విప్



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయ ప్రధాన ద్వారం నుంచి బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల ప్ర ధాన రహదారి నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేములవాడ రాజన్న భక్తుల, పట్టణ ప్రజల 50 సంవత్సరాల చిరకాల వాంఛను కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నెరవేర్చిందని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి 80పిట్ల రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సుమారు 6.30 కోట్లతో రోడ్డు వెడల్పు, ఒక టిన్నరకోట్లతో లైటింగ్ పనులను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ వెంట మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## మెడికల్ షాప్‌ల ఇష్టారాజ్యం..!

శాంపిల్స్ – జనరిక్ మందుల పేరుతో దోపిడీ..?

లైసెన్స్ ఒకరిది..దందా మరొకరిదనే విమర్శలు

అధికారుల పర్యవేక్షణ కరువు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండలంలో మెడికల్ షాపుల నిర్వహణపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల మండలవ్యాప్తంగా కొత్త మెడికల్ షాపులు వేగంగా పెరుగుతుండగా, వాటి కార్యకలాపాలపై ప్రజల్లో చర్చ మొదలైంది. ముఖ్యంగా శాంపిల్ మందులు, జనరిక్ ఔషధాల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం వైద్యుల ప్రిస్క్రిప్షన్‌పై మాత్రమే విక్రయించాల్సిన కొన్ని మందులు, ప్రిస్క్రిప్షన్ లేకుండానే అందుబాటులోకి వస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల స్వయంగా మందులు వాడే ధోరణి పెరిగి ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, డ్రగ్ లైసెన్స్ ఒకరి పేరుపై ఉండగా దుకాణాన్ని నిర్వహించేది మరొకరేననే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హత కలిగిన ఫార్మసిస్టులు విధుల్లో ఉన్నారా? లైసెన్స్ నిబంధనలు అమలవుతున్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.తక్కువ ధరకు అందాల్సిన జనరిక్ మందులు కొన్ని చోట్ల అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలతో పాటు,శాంపిల్ మందుల వినియోగంపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**కనిపించని తనిఖీలు... పెరుగుతున్న అనుమానాలు :** మెడికల్ షాపుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ,డ్రగ్స్ కంట్రోల్ శాఖ తనిఖీలు తగిన స్థాయిలో కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. నిబంధనల ఉల్లంఘనలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను వెలికితీసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని అన్ని మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి. డ్రగ్ లైసెన్స్ నిబంధనల అమలును కఠినంగా పరిశీలించాలి. శాంపిల్, జనరిక్ మందుల విక్రయాలపై ప్రత్యేక విచారణ జరిపి ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి అని ప్రజలు కోరుతున్నారు. మెడికల్ షాపుల దందాపై సంబంధిత జిల్లా అధికారి డ్రగ్ ఇన్స్‌పెక్టర్ వివరణకై ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

## ఓటు హక్కు పరిరక్షణకు నవంబర్ 1న 'ఛలోఢిల్లీ'

చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం పిలుపు



ప్రజాపక్షం /కరీంనగర్ టౌన్ : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించే భా రీ బహిరంగ సభకు కరీంనగర్ జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు డా.మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి సుమారు 15 వేల మందితో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లోని డిసిసి కార్యాలయంలో ఆదివారం కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో ని ర్వహించిన విలేకరుల సమావేశంలో డా.మేడిపల్లి సత్యం, ఎఐసిసి పరిశీలకుడు ఎస్.శరత్ పిసిసిపరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మానకొ ండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణలు హాజరై మాట్లాడారు. ఎ మ్మె ల్యే మేడిపల్లి మాట్లాడుతూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుమేరకు ని ర్వహించే ఈ కార్యక్రమం కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం కాదని ప్రజా స్వా మ్య పరిరక్ష ణ ఉద్యమమని పేర్కొన్నారు. కరీంనగర్ జి ల్లాలోని ప్రతి నియో జ కవర్గం నుంచి కనీసం 100 మంది ఢిల్లీకి తరలిరావాలని కోరారు. పిసిసి పరి శీలకుడు కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నవంబర్ 1న ఢి ల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మానకొండూర్ ఎమ్మెల్యే మా ట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడేందుకు ప్రజా స్వా మ్యవాదులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎఐసిసి పరిశీల కుడు ఎస్.శరత్ మా ట్లాడుతూ 'ఓట్ బచావో– దేశ్ బచావో' నినాదంతో ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథా లయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, వొడితెల ప్రణవ్, మాజీ సుడా చైర్మన్ కోమ టిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని, పురుమల్ల శ్రీనివాస్, సిరాజ్ హుస్సెన్, ఊట్కూరు నరేందర్ రెడ్డి, ఎం.డి.తాజ్, ఆరేపల్లి మోహన్, ఉప్పుల అంజనీ ప్రసాద్, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, ముత్యం శంకర్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, అహ్మద్ అలీ, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలతో మంత్రి తుమ్మల ముచ్చట్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ధాన్యం కాంటా కార్మికులతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముచ్చటించారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కల్లూరు వెళ్తున్న మార్గ మధ్యలో బోడుమల్లు వద్ద ధాన్యం కాంటాలు వేస్తున్న హమాలీలను చూసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన వాహనాన్ని ఆపి వారి వద్దకు వెళ్లి ముచ్చటించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడి ఎలా వచ్చింది, మార్కెట్‌లో ధరలు ఏవిధంగా ఉన్నాయి, ఈ ప్రాంతంలో సాగు పరిస్థితులు ఎలా ఉన్నాయంటూ క్షేత్రస్థాయిలో వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందు చూపుతో వ్యవహరించి సకాలంలో గోదావరి జలాలను విడుదల చేయించారని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఆ నీటి చలువ వల్లే మండలంలో వరి సాగు విస్తీర్ణం పెరిగిందని, ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా పంట చేతికి వచ్చిందని హమాలీలు తెలిపారు. కాన్వాయ్ ఆపి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ వద్దకు వచ్చి సమస్యలను, పరిస్థితులను అడిగి తెలుసుకోవడంపై హమాలీలు ఆనందం వ్యక్తం చేశారు.

## పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణ శివారులోని రాజుపేట కాలనీలో పోలీసులు ఆదివారం తెల్లవారు ఝామున కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. డిఎస్‌పి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఇంటింటికీ సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 42 బైక్‌లు, 8 ఆటోలు నంబర్ ప్లేట్లు లేని 8వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి మొత్తం 150 కేసులు నమోదు చేసి రూ. 36,390 జరినామా విధించారు. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డిఎస్‌పి ఆరుణ్ కుమార్ కాలనీవాసులతో మాట్లాడుతూ గం జాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం, వి క్రయం, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై క ఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సేవించే వారిని గుర్తించి డి అడిక్షన్ కేం ద్రాలకు తరలించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీల్లో నేరాల నియంత్రణ ప్రజల భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వానహదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నే రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఒటిపిలు, బ్యాంకు వివరాలు, యుపిఐ పిన్‌లను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాల బారినపడితే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి తనిఖీలు ఇక ముం దు కూడా ముమ్మరంగా కొనసాగుతాయన్నా రు. ఈ కార్యక్రమంలో సిఐ రాజు, పోలీస్ అధికారులు, సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి వేణు గోపాల్ కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల వేణుగోపాల్ తండ్రి శ్రీరాంరావు మృతిచెందిన విషయం విధితమే. నగరంలోని మామిళ్లగూడెంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వేణుగోపాల్ నివాసానికి వెళ్లి శ్రీరాంరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రితో పాటు ఐజెయు నాయకులు నలజాల వెంకట్రావు, ఏనుగు వెంకటేశ్వర రావు, మామిడాల భూపాల్, మహేందర్ తో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానిక కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

## వెంకట్రామిరెడ్డికి 'అభ్యుదయ రైతు' అవార్డు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామానికి చెందిన కుడుముల వెంకట్రామిరెడ్డికి అభ్యుదయ రైతు అవార్డు దక్కింది. గోవాలో జరిగిన అంతర్జాతీయ రైతు సదస్సులో ఈ అవార్డు ప్రదానం చేశారు. దేశ విదేశాలకు చెందిన 450 మంది రైతులు, శాస్త్రవేత్తలు హాజరైన ఈ సదస్సులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, బయో ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ వినియోగంపై సదస్సు నిర్వహించారు. అనంతరం పలువురికి అభ్యుదయ రైతు అవార్డులు ప్రదానం చేశారు. అవార్డు పొందిన వారిలో ఖమ్మంజిల్లాకు చెందిన నల్లమల వెంకటేశ్వరరావు, కుడుముల వెంట్రామిరెడ్డి, గొర్ల సత్యనారాయణ రెడ్డి, సురేందర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ..ఈ సదస్సు రైతులకు ఎంతో ఉపయోగకరంగా సాగిందన్నారు. సత్యసాయి రైతు సేవా సంస్థలను నిర్వహిస్తున్న కుడుముల వెంకట్రామిరెడ్డి ప్రకృతి వ్యవసాయం గురించి సదస్సులో వివరించారు.

## 27న ఖేలో ఇండియా పోటీలకు ఎంపికలు

**ప్రజాపక్షం/పాల్వంచ:** హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి తెలంగాణ రాష్ట్ర ఖేలో ఇండియా క్రీడల పోటీలకు 27వ తేదీన ఉదయం 9 గంటలకు కిన్నెరసాని ప్రభుత్వ గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నామని ఎంపికల ఇన్‌చార్జి, సీనియర్ క్రీడాకారులు జి. సుధాకర్ ఆదివారం తెలిపారు.2009 జనవరి 1వ తేదీన జన్మించినవారు అర్హులని చెప్పారు. ఎంపికలకు హాజయ్యే క్రీడాకారులు జనన ధ్రువీకరణ, పదవ తరగతి మెమో, (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్)తో కూడిన పాఠశాల స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని తెలిపారు. క్రీడాకారులు సకాలంలో హాజరై ఎంపికల ఇంచార్జిలు ఎస్. సుబ్రమహ్మణ్యం (పిడి) కొమరం వెంకటనారాయణ ( ఎఎస్ఒ)లకు నివేదించాలని కోరారు.

### ఏదులా'పుర'ను..

# ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి

- ఇప్పటికే రూ.75.50కోట్ల నిధులు మంజూరు
- ఎల్ నినో నేపథ్యంలో రైతులు, ప్రజలు నీటి పొదుపుపై అప్రమత్తం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూ. 38కోట్లతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్, సిసిడ్రైన్ల నిర్మాణ పనులతో పాటు రూ.కోటి వ్యయంతో చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ...మద్దులపల్లి నుంచి గొల్లగూడెం నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్తయితే ఏదులాపురం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ప్రభుత్వం రూ.75.50 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏదులాపురాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేటాయింపులు జరిగాయని, రహదారు లు, డ్రైనేజీలు, జంక్షన్ల అభివృద్ధి తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొనే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

### ఘనంగా పోలీస్ సైకిల్ ర్యాలీ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పోలీస్ అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని డిఎస్‌పి ఆదినారాయణ అన్నారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీసులు జిల్లా కేంద్రంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రైల్వే స్టేషన్ సమీపం నుండి పాత డిపో పోస్టాఫీస్ సెంటర్ మీదుగా కొత్తగూడెం 1టౌన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డిఎస్‌పి ఆదినారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి సేవలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రధానంగా ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. దేశం సమాజం ప్రజల రక్షణ కోసం ఆమరవీరులు చేసిన త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పోలీస్ అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిటిఎస్‌పి అసిస్టెంట్ కమాండెంట్లు రామకృష్ణారెడ్డి, రంజిత్ కుమార్, సిఐలు వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, రామారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ అభివృద్ధికి నిధులు

- ప్రహరీ, సిబ్బంది నివాసాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలి
- ఎమ్మెల్యే ఆదినారాయణ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పోలీస్ స్టేషన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, ప్రహరీ గోడ నిర్మాణం, పోలీస్ సిబ్బంది నివాసాల ఏర్పాటు, స్టేషన్ మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు అందజేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దుకూరు, శీతాయిగూడెం, దామరచర్ల, అయ్యన్నపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాలను సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్ఐ విజయకుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్లమోతు రమణ, నాయకులు అంకిరెడ్డి, కృష్ణారెడ్డి, భోజ్యా నాయక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఇమ్రాన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులు భారీ వర్షాలు

- రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) నివేదికల ప్రకారం 27న జిల్లాలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కి లోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా 28న జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. 29న కూడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ ఉరుములు, మెరుపులతో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వర్షాల తీవ్రత దృష్ట్యా రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో ప్రజలు ఎవరూ బహిరంగ ప్రదేశాల్లో తిరగవద్దని, చెట్ల కింద, విద్యుత్ స్తం భాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో నిలబడవద్దని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా యం త్రాంగం వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

### గోదావరి జలాలు ఒడిసిపట్టి..

# వేసవి తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/మణుగూరు:** ఎల్ నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుమ్ముగూడెం వైపు ఆనకట్టపై ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి, పడవలను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగం, ప్రజారోగ్యం, పశుసంపదపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం తమ ఉద్దేశం కాదని, రానున్న పరిస్థితులను ముందుగానే అర్థం చేసుకుని నష్టాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది వర్షపాతం లోటు, నదులు, వాగులు, వంకల్లో తగ్గిన నీటి ప్రవాహాలు, రిజర్వాయర్లలో పరిమిత నీటి నిల్వల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేసేందుకు రోజుకు 10 వేల నుంచి 15 వేల బస్తాలను ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వాతావరణ శాఖ వర్ష సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ గోదావరి ప్రవాహంలో వచ్చే మార్పులకు అనుగుణంగా పనులు నిర్వహించాలని, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి ప్రవాహం పెరిగినప్పటికీ చేపట్టిన పనులకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఇ, అమ్మగారిపల్లి సర్పంచ్ కవిత, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం డిమాండ్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల సందర్భంగా ముస్లిం మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని గతంలో ఉన్న పథకాలను సైతం అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఆదివారం ఖమ్మం నగర ఇన్సాఫ్ కమిటీ సమావేశం యాకూబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సలాం మాట్లాడుతూ రాజకీయాల కోసం తమ పదవులను కాపాడుకోవడం కోసం మంత్రులు పనిచేస్తున్నారు తప్ప మైనార్టీల సంక్షేమానికి ని ధులు విడుదల చేయడం లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండు రెండేనని పెద్దగా తేడా లేదని సలాం తెలిపారు. హక్కుల సాధన కోసం పోరాటాలే మార్గమని సంక్షేమ పథకాల కోసం ఉద్యమించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివరెడ్డి, ఇన్సాఫ్ నాయకులు మజీద్, మహ్మద్ మసియుద్దీన్, జాకీర్, రెహ్మాన్, అక్రం, ముజమిల్ పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి, గిరిజన దర్బార్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నేడు ఐడిఒసిలో ప్రజావాణి, ఐటిడిఎలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఆయా కార్యాలయాల పరిపాలనాధికారులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవచూపాలని, సకాలంలో విధులకు హాజరుకావాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించేవారిపై శాఖాపరమైన చర్యలుతప్పవని హెచ్చరించారు.

## కల్లూరు కార్యాలయాల్లో పాములు..!



**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రభుత్వ కార్యాలయ ఆవరణలలో పాములు బెడదతో అధికారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండల పరిధిలోని ఎన్ఎస్‌పి సర్కిల్ కార్యాలయాలు, మార్కెట్ కమిటీ ఆవరణ, ఎంపిడిఒ, తహసీల్దార్, వెటర్నరీ, ఎంఇఒ, రైతు వేదిక, ఉపాధి హామి, ఐకెపి మండల సమాఖ్య కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, పంచాయతీ రాజ్ డిఇ, కార్యాలయం, పలు శాఖల కార్యాలయాల ఆవరణలో పాములు స్వైర విహారం చేస్తుండటంతో అధికారులు అప్రమత్తమై జాగ్రత్త పడుతున్నారు. ఈ సందర్భంగా పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తూ జాగ్రత్త పడుతూ, కిటికీలకు మెసులు ఏర్పాటు చేసుకుంటున్నారు. పాములతో పాటు కుక్కలు, కోతులు పట్ల కూడా జాగ్రత్తగా ఉంటున్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

- ఎఐసిసి నాయకుడు వెంకటేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సర్ పేరుతో బిజెపి ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందని, దీనిపై కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని ఎఐసిసి నాయకులు వేగి వెంకటేష్ తెలిపారు. రానున్న కాలంలో రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ, అమిత్‌షా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఓట్లను తొలగిస్తున్నారని వెంకటేష్ ఆరోపించారు. నవంబర్ ఒకటిన ఢిల్లీలోని రాంలీల మైదానంలో జరిగే భారీ ర్యాలీకి ఖమ్మంజిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని ఆయన తెలిపారు. గ్రామ గ్రామాన రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సామాజిక సేవా ధృక్పథంతో పనిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు చక్కిలం రాజేశ్వరరావు, శాసన మండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వర రావు, మద్దినేని బేబిస్వర్ణకుమారి, సాయికుమార్, సౌజన్య పాల్గొన్నారు.

# సర్వోత్తమ్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం– నల్గొండ– వరంగల్ జిల్లాల పట్టభద్రుదల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పిలుపునిచ్చారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంపై నియోజకవర్గ పార్టీ నాయకులు, బిఎల్ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో పాటు ఖమ్మం జిల్లా టిపిసిసి కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి దుద్దిళ్ల శ్రీను బాబు, ఎఐసిసి కో ఆర్డినేటర్ వేగి వెంకటేష్, పట్టభద్రుదల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టిపిసిసి అధికార ప్రతినిధి లోకేష్‌యాదవ్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి క్లస్టర్ పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు రాంరెడ్డి వెంకటరెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డిల తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ఆయన విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటిని పొదుపుగా వినియోగించేలా చైతన్యపరచాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ సాగు ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బూరి నరహరి, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ చైర్మన్ బోళ్ల గంగారావు, జిల్లా అధికార ప్రతినిధి పమ్మి అశోక్, దాసరి దానియేలు, మండల అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాములు, ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి

**భవిష్యత్తు ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగించాలి**
**'సర్' వ్యతిరేక నిరసనలు రెండో స్వాతంత్ర్య యుద్ధం : ఖర్గే**



**పాట్నా :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలను రెండో స్వాతంత్ర్య యుద్ధంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. ఈ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, భవిష్యత్తు ఎన్నికలన్నింటిలో బ్యాలెట్ పత్రాల వినియోగాంచాలని, గత రెండేళ్లలో జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'శ్రీబాబు'గా ప్రసిద్ధి చెందిన బిహార్ తొలి ముఖ్యమంత్రి కృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఖర్గే ప్రసంగిస్తూ, ఆర్ఎస్ఎస్, బిజెపిల భావజాలం దేశంలో విభజనలను మరింత తీవ్రతరం చేస్తోందని ఖర్గే ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నిర్మూలించనంత కాలం దేశంలో శాంతి ఉండదన్నారు. ఓటర్ల జాబితాలలో అవకతవకలు జరిగాయని, ప్రతిపక్ష మద్దతుదారుల పేర్లను తొలగించారని ఆరోపిస్తూ, ఖర్గే ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల సంఘం సమగ్రతను ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్, హర్యానా, బిహార్, మహారాష్ట్రలలో ఓటు దొంగతనం ద్వారా దొంగిలించబడిన ప్రభుత్వాలను రద్దు చేయాలన్నారు. ప్రజలు వీధుల్లోకి వచ్చి, తమ హక్కుల కోసం పోరాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, గత రెండేళ్లుగా జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నుండి ప్రజలకు పారదర్శకత, జవాబుదారీతనం కావాలన్నారు. పారదర్శకతను నిర్ధారించడానికి, ప్రజా విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి ఎన్నికలు నిర్వహించాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, ప్రతి ఓటుకు విలువ ఉండాలని సూచించారు. బిజెపి విభజన రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తూ, దేశ సామాజిక సామరస్యాన్ని కాపాడటానికి ఐక్యత చాలా అవసరమని ఖర్గే పిలుపు నిచ్చారు. తాము ఐక్యత, సమానత్వం, రాజ్యాంగాన్ని విశ్వసించే దేశభక్తులమని, బిజెపి నాయకుల్లా రాజకీయ లబ్ధి కోసం మన ప్రజలను విభజించేవాళ్లం కాదన్నారు. కాగా, కృష్ణ సింగ్‌కు నివాళులర్పిస్తూ, బిహార్ మొదటి ముఖ్యమంత్రి సంస్థలను నిర్మించడం, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, నీటిపారుదల రంగాలను ప్రోత్సహించడం ద్వారా ఆధునిక రాష్ట్రానికి పునాదులు వేయడంలో సహాయపడ్డారని ఖర్గే కొనియాడారు. జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని, మాజీ ముఖ్యమంత్రి ఒకప్పుడు రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్ వంటి సోషలిస్ట్ నాయకుల పక్కన నిలబడ్డారని ఖర్గే అన్నారు. 'కానీ ఈ రోజు ఆయన బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. సోషలిస్ట్ రాజకీయాల వారసత్వం నుండి బిజెపి ఒడిలో కూర్చోవడానికి ఇది ఎంత నాటకీయమైన మార్పు' అని ఆయన అన్నారు. అయోధ్యలోని రామ మందిరానికి అందిన విరాళాల చుట్టూ ఉన్న వివాదంపై బిజెపిని లక్ష్యంగా చేసుకుని ఖర్గే మాట్లాడుతూ, 'శ్రీరాముడు కళ్లు తెరిచి, ఆయన పేరుతో సంపదను దోచుకున్న వారిని శిక్షించాలని ప్రార్థిస్తున్నాను' అని అన్నారు.

# 2029 నాటికి ఇస్రో నాలుగు లాంచ్ ప్యాడ్స్

- వేలాది హైటెక్ ఉద్యోగావకాశాలు • ఇస్రో ప్రైవేటీకరణ ప్రశ్నేలేదు • రెండు నెలల్లో మానవరహిత గగనయాన్ పరీక్షలు
- జపాన్ సాయంతో చంద్రయాన్- 5:రోవర్ ప్రయోగం • ఇస్రో చైర్మన్ నారాయణన్ వెల్లడి




**చెన్నై:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) 2029 నాటికి నాలుగు ప్రయోగ వేదికలను ఏర్పాటు చేసుకుంటుంది.రాబోయే మూడు సంవత్సరాలలో డిమాండ్‌కు అనుగుణంగా ఈ వేదికలు అందుబాటులోకి వస్తాయని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ చెప్పారు. చెన్నైలోని ప్రైవేటు యూనివర్సిటీ గ్రాడ్యుయేషన్ సెర్మనీలో శనివారం మాట్లాడుతూ, ఇస్రో భవిష్యత్ బృహత్తర ప్రణాళికను వివరించారు. చిన్నపాటి కృత్రిమ ఉపగ్రహాలను ప్రయోగించడానికి వీలుగా ఎస్ఎస్ఎల్‌వి భవన సముదాయాన్ని ట్యూటికోరన్ జిల్లాలోని కులశేఖరపట్టిణం వద్ద నిర్మిస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష ప్రయోగ కార్యక్రమాల డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా వీటిని ఉపయోగిస్తామని చెప్పారు. జాతీయ అంతరిక్ష సంస్థను ఎప్పటికీ ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం లేదని ఆయన పునరుద్ఘాటించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రయోగాల డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా ప్రైవేటు సంస్థలతో అనివార్యంగా భాగస్వామ్య ఒప్పందాలు చేసుకుంటామని, దేశీయంగా కూడా వందలాది కృత్రిమ ఉపగ్రహాలను ప్రయోగించే డిమాండ్‌ను తీర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. విస్తరిస్తున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇస్రో అంకుర సంస్థలను, ప్రైవేటు సంస్థలను ప్రోత్సహిస్తుందని, వాటికి సాంకేతికతను బదిలీ చేస్తుందని, నైపుణ్యాన్ని పెంచుతుందని చెప్పారు. ఈ విధంగా ఆర్థికవృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. వేలాది మందికి హైటెక్ ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు.''భారతదేశం గణనీయస్థాయిలో అంతరిక్ష కార్యకలాపాలను విస్తరిస్తుంది, 2029 నాటికి నాలుగు ప్రయోగ వేదికలు అందుబాటులోకి వస్తాయి, ప్రైవేటు పరిశ్రమ భాగస్వామ్యం మద్దతుపై ఆధారపడతాం, వాటి పాత్ర పెరుగుతుంది, వాణిజ్యప్రాతిపదికపై కార్యకలాపాలను నిర్వహించాలంటే ఈ భాగస్వామ్యంఅవసరం'' అని నారాయణన్ చెప్పారు. కులశేకరపట్టిణం అంతరిక్ష వేదికలో సదుపాయాలు ఎంతో అత్యున్నతస్థాయిలో ఉంటాయని చెప్పారు. భవనసముదాయం సమగ్ర, సమీకృతవ్యవస్థను కలిగిఉంటుందని, లాంచ్‌ప్యాడ్స్, రైల్వే ట్రాకింగ్ వ్యవస్థ,టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ వ్యవస్థలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఐనప్పటికీ మిగిలిన మూడు ప్రయోగ వేదికలకు సంబంధించిన వివరాలను ఆయన తెలియజేయలేదు. అదేవిధంగా మానవ రహిత గగనయాన్ ప్రయోగం గురించి కూడా ఆయన వివరించారు. రాబోయే రెండు నెలల్లో ఈ ప్రయోగాలకు ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలన్నీ పర్యావరణ నియంత్రణ,భద్రతావ్యవస్థలు, అందులో ఉండే వ్యోమగాములు తప్పించుకు నే యంత్రాంగం, వారు ప్రయాణం చేసే మాడ్యూల్ లోపలి భాగం నిర్మాణం,వాటిలో వచ్చే ఒత్తిడి, ఉష్ణోగ్రతల నియంత్రణలకు అనుగుణంగా జరుగుతాయన్నారు.ఈ మానవ సహిత ప్రయోగానికి ముందుగా చేపడుతున్న మానవ రహిత ప్రయోగాలను ఉపరితలస్థాయిలో దాదాపు 8000 సార్లు విజయవంతంగా ఇస్రో నిర్వహించిందని చెప్పారు. నలుగురు వ్యోమగాములు ప్రస్తుతం ప్రత్యేక శిక్షణలో ఉన్నారని చెప్పారు. అదేవిధంగా రాబోయేకాలంలో చంద్రయాన్-5కు సంబంధించిన ప్రణాళికను వివరించారు. జపాన్ అంతరిక్ష సంస్థ సహాయంతో 350 కేజీలు బరువుగల రోవర్‌ను పంపిస్తామని, 100 రోజులపాటు చంద్రుడి ఉపరితలంపై ఈ ప్రయోగాలు జరుగుతాయని చెప్పారు.

## 'ఇసిఐ నెట్' సాఫ్ట్‌వేర్ సమాచారాన్ని ఎందుకు దాచిపెడుతున్నారు?

- భారత ఎన్నికల సంఘాన్ని నిలదీసిన కాంగ్రెస్ • 'సర్'లో జరిగిన భారీ, కేంద్రీకృత అవకతవకలపై వాస్తవాలు బయటపడతాయనే వెల్లడించేందుకు నిరాకరిస్తోందని మండిపాటు



**న్యూఢిల్లీ :** వివాదాస్పదమైన 'ఇసిఐ నెట్' సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎన్నికల సంఘం దాచిపెడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. విపత్కరమైన 'సర్'లో జరిగిన భారీ, కేంద్రీకృత అవకతవకల వాస్తవాలను బయటపెడుతుందనే కారణంతోనే ఎన్నికల సంఘం ఆ సమాచారాన్ని ఇవ్వడానికి పదేపదే నిరాకరిస్తోందని మండిపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలగాలని, అలాగే సర్‌ను తక్షణమే నిలిపివేయాలని ప్రతిపక్ష పార్టీ తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితాలోని తప్పులు, అవకతవకలను గుర్తించడానికి ఉపయోగించిన సాఫ్ట్‌వేర్ పేరు, వెర్షన్‌ను వెల్లడించడానికి భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నిరాకరించిందని ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పంచుకున్నారు. ఆ సమాచారం 'వాణిజ్య గోప్యత, వ్యాపార రహస్యాలు, మేధో సంపత్తి'కి సంబంధించినదని, సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద దీనికి మినహాయింపు ఉందని ఇసిఐ పేర్కొంది. కాగా, ఒక ప్రముఖ జాతీయ దినపత్రిక వెల్లడించిన దాని ప్రకారం, సమాచార హక్కు (ఆర్‌టిఐ) దరఖాస్తుకు ప్రతిస్పందనగా సర్‌లో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌పై సమాచారం ఇవ్వడానికి ఇసిఐ నిరాకరించిందని, బలహీనమైన సాకులతో, సర్‌లో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ పేరును చెప్పడానికి గానీ, ఎఐని ఉపయోగిస్తున్నారా లేదా, ఎలాంటి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయి అనే విషయాన్ని ధృవీకరించడానికి గానీ ఇసిఐ నిరాకరించిందని రమేశ్ అన్నారు. ఇసిఐ నెట్ సాఫ్ట్‌వేర్, ఎఐ వినియోగం విషయంలో పారదర్శకత లోపించడం వల్ల, పౌరులలో ఈ మొత్తం ప్రక్రియ విశ్వసనీయత దెబ్బతిందని ఆయన అన్నారు. ఈ సమాచారం ఇస్తే, జరిగిన భారీ, కేంద్రీకృత అవకతవకల వాస్తవికత బయటపడుతుంది కాబట్టి ఇసిఐ పదేపదే దీనిని ఇవ్వడానికి నిరాకరిస్తోందని రమేశ్ అన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) వెల్లడించిన వివరాల ద్వారా ఇసిఐ సాఫ్ట్‌వేర్‌ను తామే అభివృద్ధి చేశామని భారతీయులకు ఎలా తెలిసింది, ఈ విషయాన్ని ఇసిఐ ఎందుకు పారదర్శకంగా వెల్లడించలేదు అని ఆయన ప్రశ్నించారు. సర్, ఓటర్ల జాబితా సవరణలో ఎఐని స్పష్టంగా ఉపయోగిస్తున్నప్పటికీ, ఇసిఐ దాని వినియోగాన్ని ఎందుకు పదేపదే ఖండించిందని రమేశ్ ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లేవనెత్తిన అనేక అభ్యంతరాలకు ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్, ఇసిఐ ఐటి విభాగం కేంద్ర బిందువుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులు ప్రధానమంత్రి ఆధీనంలోనే ఉండే సిబ్బంది, శిక్షణ విభాగానికి (డిఒపిటి) కూడా చేరాయని ఆయన అన్నారు.

# ప్రపంచ సంక్షోభానికి... ఐక్యరాజ్యసమితి నాయకత్వం వహించాలి

**విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్**

**న్యూఢిల్లీ :** ఐక్యరాజ్యసమితి ప్రపంచ సంక్షోభాల విషయంలో కేవలం 'ప్రేక్షకుడిగా మిగిలిపోకుండా' నాయకత్వ బాధ్యతను ప్రదర్శించకాలని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. అదే సమయంలో, ఈ అంతర్జాతీయ సంస్థ తన లోపాలను, పరిమితులను గుర్తించి, మెరుగుదల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ 'సంస్కరించబడిన బహుపాక్షికవాదం' వాదన రోజురోజుకూ బలపడుతోందని ఆయన నొక్కిచెప్పారు. మంత్రి ఎస్.జైశంకర్‌తో పాటు వేదికను పంచుకున్న భారతదేశంలో ఐక్యరాజ్యసమితి రెసిడెంట్ కో-ఆర్డినేటర్ అయిన స్టీఫన్ ప్రీస్నర్ సమక్షంలో ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ మండపంలో జరిగిన ఈ కార్యక్రమం చిన్మయ మిషన్ 75వ కార్యక్రమాన్ని సూచిస్తుంది. ప్రపంచ సామూహిక, సహకార స్వభావాలు 8 దశాబ్దాల క్రితమే ఐక్యరాజ్యసమితిలో వ్యక్తమయ్యాయని జైశంకర్ అన్నారు. ఉమ్మడి లక్ష్యాల సాధనలో 'దేశాల చర్యలను సమన్వయం చేసే కేంద్రం'గా ఈ సంస్థ ఉండాలని ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 1 నిర్దేశిస్తుందని నొక్కిచెప్పారు. 'ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఐక్యతా భావాని పెంపొందించడానికి మనం అందరమూ సమావేశం అవడం సముచితం. అన్నింటికి మించి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు ఏవైనా, అవకాశాలు ఏవైనా, వాటిని పరిష్కరించుకుంటేనే ఉత్తమంగా, అత్యంత ప్రభావవంతంగా పరిష్కరించగలం' అని ఆయన అన్నారు. 'మనం అసంపూర్ణమైన ప్రపంచంలో జీవిస్తున్నామని మనకు తెలుసు. కానీ, మనందరం నిరంతరం మరింత పరిపూర్ణత వైపు కృషిచేస్తాం' అని జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్యసమితి విషయానికొస్తే, 'అది తన లోపాలను, పరిమితులను గుర్తించి' 'మెరుగుదల' కోసం ప్రయత్నించాలని దీని అర్థం అని మంత్రి చెప్పారు. ప్రపంచంలోని చాలా ప్రాంతాలను నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ నుంచి మినహాయించలేమని, ప్రపంచ సంక్షోభానికి అమెరికా నాయకత్వం వహించాలని, కేవలం ప్రేక్షకపాత్ర వహించకూడదని, సంస్కరించబడిన బహుపాక్షికవాదానికి ఆవశ్యకత మరింత బలపడుతోంది'అని జైశంకర్ అన్నారు. ఈ నెల ప్రారంభంలో ఇక్కడ జరిగిన 5వ కౌటిల్య ఆర్థిక సదస్సులో భాగంగా నిర్వహించిన ఒక ఇంటరాక్టివ్ సెషన్‌లో, ఉక్రెయిన్, గల్ఫ్‌లోని సంఘర్షణలతో సహా ప్రధాన ప్రపంచ సమస్యలపై నిర్ణయం తీసుకోవడంలో ఈ ప్రపంచ సంస్థ 'అప్రస్తుతంగా' మారిందని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలకు పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితి స్తంభించిపోయిందని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఇకపై ప్రపంచ ప్రయోజనాలన్నింటికీ ప్రాతినిథ్యం వహించడం లేదని కూడా ఆయన పేర్కొన్నారు. దీనికి అత్యంత అభివృద్ధి చెందిన వారే ఆదర్శంగా నిలవాల్సిన అవసరం లేదు' అని మంత్రి చెప్పారు.

### 'టెర్రరిజాన్ని' రాజనీతి సాధనంగా ఉపయోగించడం సరికాదు

ఉగ్రవాదాన్ని 'రాజనీతి సాధనంగా' ఉపయోగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దానిని ఎన్నటికీ సమర్థించలేమని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైంకర్ అన్నారు. ఈ దురాచారం పట్ల అన్ని దేశాలు నిజంగా 'జీరో టోలరెన్స్' ప్రదర్శించకపోవడం వల్లే ఇది కొనసాగుతోందని హితవు పలికారు. చరిత్ర దీనిపై ఎన్నో పాఠాలు నేర్పినప్పటికీ, కొన్నింటికి ఇప్పటికీ రాజకీయ లెక్కలే ప్రాధాన్యతను సంతరించుకుంటాయి' అని ఆయన ఏ దేశం పేరు ప్రస్తావించకుండా ఇక్కడ జరిగిన ఒక సమావేశంలో తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఆదివారం ఆయన ఇక్కడ జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ, 'ప్రపంచంలో కొనసాగుతున్న సంఘర్షణల నేపథ్యంలో శాంతి ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. 'ఎక్కడ యుద్ధం జరిగినా అది ప్రతిచోటా శాంతికి ముప్పు కలిగిస్తుంది' అని హెచ్చరించారు. ప్రపంచంలో ఉక్రెయిన్, పశ్చిమాసియాలో జరుగుతున్న రెండు ప్రధాన సంఘర్షణలను ఆయన ఉదహరిస్తూ, ఈ విషయంలో పెద్దగా ప్రమేయంలేని సమాజాలు, ఆర్థిక వ్యవస్థలు, ప్రజలు వాస్తవానికి 'మూల్యం చెల్లిస్తున్నారు' అని అన్నారు. 'మనం నిస్సహాయ ప్రేక్షకులుగా మిగిలిపోలేం. చర్చలు, దౌత్యమే ఏకైక పరిష్కారమని మనం కోరినప్పుడు భారత దేశం సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది' అని విదేశాంగ మంత్రి పేర్కొన్నారు.




## శాంతి, సామరస్యం కోసం 36 వర్గాల ప్రతినిధులతో కమిటీ

మణిపూర్ సిఎం వై. ఖేమ్‌చంద్‌సింగ్



**ఇంఫాల్ :** శాంతి, సామరస్యం, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని 36 వర్గాల ప్రతినిధులతో తమ ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తుందని మణిపూర్ ముఖ్యమంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్ తెలిపారు. అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఇప్పటికే అలాంటి కమిటీ ఉందా అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ ప్రతిపాదన చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంఫాల్‌లోని ముఖ్యమంత్రి సచివాలయంలో వివిధ గిరిజన తెగల అధిపతులను సన్మానించేందుకు శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో సింగ్ మాట్లాడారు. 'మేరా హౌ చోంగ్బా' ఉత్సవంలో భాగంగా ప్యాలెస్ కాంపౌండ్‌లో 'హిల్ (ట్రైబల్) చీఫ్స్ గెస్ట్ హౌస్' ప్రారంభోత్సవం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర భూమి, గుర్తింపు, వారసత్వాన్ని పరిరక్షించడానికి చేసిన త్యాగాలకు నివాళులర్పిస్తూ, ఆంగ్లో-మణిపూర్ యుద్ధం, ఏడేళ్ల విధ్వంసాన్ని గుర్తుచేసుకున్న సింగ్, మణిపూర్‌ను రక్షించడంలో, పరిరక్షించడంలో అన్ని వర్గాలు తమ వంతు కృషి చేశాయని అన్నారు. గతంలో ఇంఫాల్ సందర్శించడానికి విముఖత చూపిన కొందరితో సహా, కొండ ప్రాంతాల ప్రజలు ఈ సంవత్సరం ఉత్సవంలో పాల్గొనడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# మణిపూర్ సిఎం రాజీనామా చేయాలి

**అసెంబ్లీని రద్దు చేయాలి : కాంగ్రెస్ డిమాండ్**

**న్యూఢిల్లీ :** మణిపూర్ ఇంకా మండుతూనే ఉంది. ఇటీవల కూడా హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి వై. ఖేమ్‌చంద్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని, అసెంబ్లీని రద్దు చేయాలని, రాష్ట్ర ఎన్నికలను వెంటనే నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రతి వర్గానికి చెందిన పౌరులకు తక్షణ రక్షణ కల్పించాలని, హత్యలు, కాల్పులు, దహనాలు, పౌరుల ఆస్తుల విధ్వంసం వంటి ప్రతి కేసులోనూ కాలపరిమితితో కూడిన దర్యాప్తు, విచారణ జరపాలని మణిపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఎంపి సప్తగిరి ఉలక కూడా డిమాండ్ చేశారు. ఈ నెల 23న ఐదు జిల్లాల్లో వేలాది మంది డప్పులు, పాత్రలు వాయిస్తూ వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. వారు లోక్‌భవన్ వైపు ర్యాలీ చేయగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారిపై లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగించారని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లంబాతో కలిసి ఆదివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉలక అన్నారు. 19న, అడవిలో కట్టెలు సేకరిస్తున్న ముగ్గురు మైతేయి పౌరులు హత్యకు గురయ్యారని, మరికొందరు గాయపడ్డారని ఆయన అన్నారు. ప్రజలు వారి మృతదేహాలను ముఖ్యమంత్రి నివాసానికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. కామ్‌జాంగ్‌లో కూడా ఇలాంటి హింసే చోటుచేసుకుందని, అక్కడ కుకీ, నాగా పౌరులు హత్యకు గురయ్యారని ఆయన చెప్పారు. 'రాష్ట్రమంతా అట్టుడికిపోతోంది, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యత వహించాలి' అని ఉలక డిమాండ్ చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారని, వారిలో 24,000 మంది ఇప్పటికీ నిరాశ్రయులుగానే ఉన్నారని ఆయన తెలిపారు. 'మే 2023లో తొలి ఘర్షణలు చెలరేగినప్పుడు, మేము ఎంపిల బృందాన్ని మణిపూర్‌కు పంపాము. ఆ తర్వాత, ప్రతిపక్ష అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మణిపూర్‌ను సందర్శించారు. మేము మా 'భారత్ జోడో న్యాయ యాత్ర'ను కూడా మణిపూర్ నుంచే ప్రారంభించాము' అని ఆయన గుర్తుచేసుకున్నారు. '(గవర్నర్) అజయ్ కుమార్ భల్లాజీ అన్నీ సరిచేస్తానని చెప్పారు, కానీ ఏమీ జరగలేదు. ఆ తర్వాత కొత్త ముఖ్యమంత్రి వచ్చారు, ఆయన కూడా దేన్నీ నియంత్రించలేకపోతున్నారు' అని ఉలకా అన్నారు. హత్యలు, కాల్పులు, దహనాలు , పౌర ఆస్తుల విధ్వంసానికి సంబంధించిన ప్రతి కేసులో కాలపరిమితితో కూడిన దర్యాప్తు, విచారణ జరపాలని ఆయన కోరారు. మణిపూర్ అంతటా నిజమైన స్వేచ్ఛా రాకపోకలను పునరుద్ధరించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. తాను అక్టోబర్ 1 నుండి 4 వరకు మణిపూర్‌లో పర్యటించానని, అక్కడ 'గత 3 సంవత్సరాలుగా హింస కారణంగా బాధపడుతున్న మహిళలను కలిశామని లంబా అన్నారు. మణిపూర్‌లోని హింసను ఆపడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, హింస ఆగడం లేదు, హింసకు పాల్పడుతున్న వారికి శిక్ష కూడా పడటం లేదు అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్ 1న జరగనున్న ర్యాలీ కోసం హోం మంత్రి అమిత్ షా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సమావేశం నిర్వహించవచ్చు, కానీ మణిపూర్‌లో హింసను ఆపడానికి వారు ఇంఫాల్‌కు వెళ్లలేరని లంబా నిలదీశారు.

## ఆరు నెలల్లో 23 మరణశిక్షలు..!

ఫ్యామిలీ కోర్టుకు జడ్జి బదిలీ



**ముజఫర్‌నగర్ :** ఆరు నెలల వ్యవధిలోనే పలు కేసుల్లో 23 మందికి మరణశిక్ష విధిస్తూ ఓ న్యాయమూర్తి ఇచ్చిన తీర్పులు ఇటీవల చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. తాజాగా ఆ న్యాయమూర్తిని అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు ముజఫర్‌నగర్‌లోని ఫ్యామిలీ కోర్టుకు బదిలీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముజఫర్‌నగర్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా ఉన్న రవి కుమార్ దివాకర్.. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో 11 కేసులకు సంబంధించి 23 మందికి మరణశిక్ష విధించి సంచలనం సృష్టించారు. బరేలీలో పనిచేసిన సమయంలోనూ 13 మరణశిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించారు. అయితే, హత్య, తీవ్ర నేరాలకు సంబంధించి విచారణ ప్రక్రియలో ఉన్న 97 కేసులను (ఓ న్యాయమూర్తి ఆదేశాల మేరకు) తన కోర్టు నుంచి ఉపసంహరించుకోవడాన్ని జడ్జీ దివాకర్ తప్పుపట్టారు. పదేళ్ల నాటి కేసులో ఓ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించిన ఆయన.. విచారణలు ప్రారంభమైన కేసులను, చట్ట ప్రకారం నిబంధనలు పాటించకుండా పరిపాలనా ఉత్తర్వుల ద్వారా ఉపసంహరించుకోవచ్చా? అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే ఆయన బదిలీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## భారత జలాల్లోకి చొరబాటు నలుగురు పాక్ మత్స్యకారుల అరెస్టు

ఫిషింగ్ బోటు స్వాధీనం



**భుజ్:** భారత జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన నలుగురు పాకిస్థాన్ మత్స్యకారులను సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) అదుపులోకి తీసుకుంది. వారి నుంచి ఓ ఫిషింగ్ బోటును స్వాధీనం చేసుకుంది. గుజరాత్‌లోని కచ్ జిల్లా భారత్-పాక్ సరిహద్దు సమీపంలోని సర్ క్రీక్ ప్రాంతంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పక్కా నిఘా సమాచారంతో రంగంలోకి దిగిన బిఎస్ఎఫ్ బలగాలు సర్ క్రీక్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా భారత జలాల్లోకి వచ్చిన నలుగురు పాక్ మత్స్యకారులను గుర్తించి అదుపులోకి తీసుకున్నాయి. పీతలు పట్టుకునేందుకు వారు భారత జలాల్లోకి ప్రవేశించినట్లు అధికారులు వెల్లడించారు. పట్టుబడిన వారిని కదీర్ థైమోర్, మహమ్మద్ ముస్సా, అజ్గర్ థైమోర్, అహ్సన్ జాట్‌గా గుర్తించారు. వీరంతా పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్ చాచ్ జాన్ ఖాన్ గ్రామానికి చెందినవారని బిఎస్ఎఫ్ తెలిపింది. గుజరాత్, పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్ మధ్య రాన్ ఆఫ్ కచ్ తీరంలో సర్ క్రీక్ ఉంది. ఇది సన్నని చిత్తడి జలమార్గం.

# ఫోర్‌షోర్ ఎస్టేట్‌లో సచివాలయ నిర్మాణ ప్రతిపాదన విరమించండి

**తమిళనాడు సిఎంకు సిపిఐ విజ్ఞప్తి, జీఓ రద్దుకు సంతకాల సేకరణ**



**చెన్నై :** నగరంలోని మెరీనా బీచ్ పక్కన ఉన్న పట్టినాపాక్కం (ఫోర్‌షోర్ ఎస్టేట్)లో కొత్త సచివాలయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమిళనాడు ప్రభుత్వం విరమించుకోవాలని అధికార టివికె ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న సిపిఐ విజ్ఞప్తి చేసింది. ఆ ప్రాజెక్టును రద్దు చేస్తూ జీఓ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర కమిటీ తరపున ఈ ప్రచారాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.వీరపాండియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ఇతర వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులతో కలిసి ఈ చర్యకు వ్యతిరేకంగా నిరంతరం గళం విప్పుతోందని అన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి శివ, నియోజకవర్గ కార్యదర్శి మేరీ దివ్య నేతృత్వం వహిస్తున్నారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌కు విజ్ఞప్తి చేస్తూ, తీరప్రాంత భూములపై మత్స్యకారుల సాంప్రదాయ హక్కులను వీరపాండియన్ నొక్కిచెప్పారు. 'సముద్రం, తీరప్రాంతాలు వాటితో సామరస్యంగా జీవించే ప్రజలకు, అంటే మత్స్యకారుల సంఘానికి చెందినవి' అని ఆయన అన్నారు. కొండ ప్రాంతవాసులతో పోలుస్తూ, మత్స్యకారులను వారి స్వస్థలమైన తీరప్రాంతాల నుండి వెళ్లగొట్టడం వారి జీవనోపాధిని నాశనం చేస్తుందని, ఆ ప్రాంతం తన సారాన్ని కోల్పోతుందని ఆయన హెచ్చరించారు. సముద్రపు గాలికి అడ్డుగా బీచ్‌లో ఎలాంటి నిర్మాణం చేసినా అది ప్రకృతిపై దాడి అని పేర్కొంటూ, ఆ సిపిఐ నాయకుడు పర్యావరణంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బీచ్ ఒక ప్రజా ప్రదేశమని, అక్కడ ఎలాంటి భవనాలు నిర్మించకూడదని ఆయన నొక్కిచెప్పారు. అటువంటి మౌలిక సదుపాయాలు ప్రపంచ పర్యావరణ రాజకీయాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. పరిపాలనా సముదాయానికి ప్రభుత్వం వద్ద ప్రత్యామ్నాయ స్థలాలు లేవన్న వాదనను తోసిపుచ్చుతూ, అందుబాటులో ఉన్న స్థలాలను వినియోగించుకోవాలని వీరపాండియన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 'సచివాలయం నిర్మించడానికి భూమి అందుబాటులో లేదని ప్రభుత్వం భావించకూడదు. ఈ రోజు రేస్ కోర్సు వద్ద 120 ఎకరాల భూమి అందుబాటులో ఉంది' అని ఆయన పేర్కొంటూ, ప్రజలను స్థానభ్రంశం చేయని ప్రత్యామ్నాయ ప్రణాళికను అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## క్షిపణి దాడులను వీడియోల్లో చిత్రీకరించకండి

సౌదీలో భారతీయులకు దౌత్యకార్యాలయం అడ్వైజరీ

**దుబాయ్:** సౌదీఅరేబియాలో హౌతీ తిరుగుబాటు సైన్యాలు చేస్తున్న క్షిపణి దాడులు, వాటిని అడ్డుకునేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నియంత్రణ చర్యలు, వాటి తీవ్రతలను వీడియో చిత్రీకరణలు చేయవద్దని,ఆ దేశంలో అమలులో ఉన్న నిబంధనలు పాటించాలని అక్కడి భారతీయులకు మన దౌత్యకార్యాలయం ఆదివారం ఒక సలహా జారీ చేసింది.గడచిన కొద్దివారాలుగా హౌతీ తిరుగుబాటు సైన్యాలు సౌదీ అరేబియాలోని మౌలిక సదుపాయాలపై బాలిస్టిక్ క్షిపణి దాడులు,డ్రోన్ దాడులు చేస్తున్నాయి. ఈ దాడులను చిత్రీకరించకూడదని,భద్రతాపరమైన నిబంధనలు అమలులో ఉన్నాయని సౌదీ అరేబియా ప్రకటించింది. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న చట్టపరమైన నియమ నిబంధనలను అక్కడ నివసించే భారతీయులు పాటించాలని,లేకపోతే చట్టపరంగా శిక్షలకు గురికావాల్సివస్తుందని,జాగ్రత్తలు పాటించాలని సలహా జారీ చేసింది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న దశలో ఈ అడ్వైజరీ విడుదలైంది.సౌదీ అరేబియా పౌర రక్షణ సంచాలక కార్యాలయం ఒక నోటిఫికేషన్ ఈ మేరకు విడుదల చేయగా,భారత దౌత్య కార్యాలయం ఈ నోటిఫికేషన్‌ను సోషల్ మీడియా ద్వారా రీ-పోస్టింగ్ చేసింది.హౌతీల డ్రోన్లు,బాలిస్టిక్ క్షిపణులు దాడులు చేస్తున్నాయని, వాటిని అడ్డుకునేందుకు సౌదీ కూటమి సైన్యాలు కూడా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నదని, ఈ ప్రదేశాలలో జరిగే బీభత్సం, దృశ్యాలను చిత్రీకరించవద్దని భారతీయులను కోరింది.

# ఇరాన్‌పై తక్షణం దాడి లేదా ఒప్పందం: ట్రంప్



**వాషింగ్టన్:** ఇరాన్‌పై దాడి చేస్తామని లేదా ఒక ఒప్పందమైనా ఆ దేశంతో కుదిరే అవకాశాలు ఉన్నాయని, ఈ రెంటిలో ఏదో ఒకటి ఆదివారమే జరిగే అవకాశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించి ప్రపంచవ్యాప్తంగా మరోసారి కలకలం సృష్టించారు. ట్రంప్ వట్టి మాటల మనిషిగా తయారయ్యారని అందరికీ ఇప్పటికే తెలిసినప్పటికీ,''ఏం జరుగుతుంది?''అనే ఉత్కంఠ సర్వత్రా నెలకుంది. ఇరాన్‌పై దాడి చేసే విషయంలో ఇంకా ఎంతదూరంలో ఉన్నారు? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు మొదట ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దాడి చేస్తే ఆ విషయం మీకు చెబుతానని అనుకుంటున్నారా? అన్నారు. దాడి చేసే అవకాశం ఉంది, లేదా ఒక మంచి అద్భుతమైన ఒప్పందం కుదిరే అవకాశం కూడా ఉంది అన్నారు. ఇరాన్ ఒక ఒప్పందం చేసుకోవాలనుకుంటోందని, కానీ ఆ ఒప్పందాన్ని ఇరాన్ నిలబెట్టుకుంటుందా? అనేదే మొదటి నుండీ ప్రధాన ప్రశ్నగా ఉందని మరోసారి అన్నారు. ఇరాన్‌తో ఎలాంటి చర్చలు జరగడంలేదని ట్రంప్ చెప్పగా, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మాత్రం తాజా స్పందనలో, చర్చలను అమెరికా అడ్డుకుంటోందని విమర్శించారు. ''ఈ దుర్మార్గులు ఆట నిబంధనలు ఉల్లంఘించారు, చర్చలను అడ్డుకున్నారు, మనమే ఆట ముగించాలి'' అన్నారు.
గడచిన పది రోజులుగా ఇజ్రాయెల్–అమెరికా ఈసారి సంయుక్తంగా ఇరాన్‌పై దాడులకు దిగుతాయని వార్తలు పుంఖాను పుంఖాలుగా వస్తున్నాయి. ఈ విషయంలో ఇరాన్‌కూడా ప్రకటన చేస్తూ తాము సర్వసన్నద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. అమెరికా కూడా అదనపు యుద్ధ విమానాలను సిద్ధం చేసింది. ఐతే నిపుణులు మాత్రం మధ్యంతర ఎన్నికలు పూర్తయ్యేవరకూ ట్రంప్ యుద్ధం జోలికి వెళ్ళే అవకాశం లేదని అంచనావేస్తున్నారు. ట్రంప్ కూడా ఇంతకుముందు సోషల్ మీడియా వేదికగా ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. కానీ అమెరికా ఒకవైపు ఎన్నికల సందడిలో ఉండగా ట్రంప్ ఇరకాటంలో పడ్డారు. ఈ దశలో ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై తమ దాడులను ఉధృతం చేశారు. ఆదివారంనాడు కూడా ఈ దాడులు కొనసాగాయి. రియాద్ నగరంపై హౌతీలు దాడులు చేశారు. కాలా రెండు వారాల తర్వాత సౌదీ అరేబియా తన ప్రధానమైన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని విమానాల రాకపోకలకు తెరిచింది. హౌతీలు ఈ విమానాశ్రయంపై వరుస దాడులు చేశారు.

**శత్రువును ఊహాతీతంగా దెబ్బతీస్తాం: ఘాలిబాఫ్**

శత్రువును ఊహకు అతీతంగా దెబ్బతీస్తామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. అంచనాలకు మించినస్థాయిలో ప్రతిస్పందించడానికి ఇరాన్ సైన్యం సిద్ధంగా ఉందన్నారు. విస్తృతమైన యుద్ధం లేదా నిర్మూలిస్తామంటూ చేస్తున్న బెదిరింపులు చూసి ఇరానీయులు తమ హక్కులు వదులుకోవడానికి సిద్ధంగా లేరన్నారు. ఇరాన్‌లో అమెరికా సైనికులకు కల్పించిన ప్రత్యేక హక్కుల చట్టాన్ని 1964లో నాటి ఇమామ్ ఖమేనీ తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇది జాతికి అవమానకరమైనదని, ఖమేనీ ప్రసంగంలో అమెరికా–ఇజ్రాయెల్ మధ్య బంధాన్ని కూడా బహిర్గతం చేశారని గుర్తుచేశారు. ఇరాన్ పార్లమెంటు సమావేశాలను దృశ్యమాధ్యమ పద్ధతిలో, ప్రత్యక్షంగా ఆయన ప్రారంభిస్తూ ఆదివారం ఈ ప్రసంగం చేశారు. అమెరికా తన దురాశను విడనాడాలని, ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, అప్పుడే తాము ఆ దేశాన్ని విశ్వసిస్తామని చెప్పారు. ఇరాన్‌పై యుద్ధం చేయడం ద్వారా అమెరికా చిక్కుల్లో పడిందని, ఈ సమస్య నుండి బయట పడేందుకు ఆ దేశమే చర్యలు తీసుకోవాలని అన్నారు.
కాగా, ఇరాన్ పూర్తిగా ఐక్యంగా, అత్యున్నతస్థాయిలో అప్రమత్తంగా ఉందని విదేశీమంత్రిత్వశాఖలోని రాజకీయ, అంతర్జాతీయ అధ్యయనాల కేంద్రం అధిపతి సయీద్ ఖతిబ్జాదే చెప్పారు. అమరవీరుడు కమల్ ఖర్రాజీ పత్రాల కేంద్రం మ్యూజియం ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం టెహ్రాన్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలు చాలవన్నట్టుగా మరోసారి ఎలాంటి చర్యలకు పాల్పడినా వైఫల్యమే ఎదురవుతుందని హెచ్చరించారు. కొంత కాలంగా యూరప్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలకు ఇప్పుడు ఫలితం చెల్లిస్తోందన్నారు. అంతర్జాతీయ మానవతాచట్టాల ఉల్లంఘనకు దూరంగా ఉండాలన్నారు.

## ట్రంప్‌ను అడ్డుకోవాలంటే

# ఈ ఎన్నికలొక్కటే మార్గం: ఒబామా




**కొలంబస్:** మధ్యంతర ఎన్నికల తరుణంలో అమెరికాలోని పలు రాష్ట్రాలలో పోటాపోటీగా ప్రచార సభలు కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష డెమోక్రాట్స్ తరపున దేశ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఎన్నికల ర్యాలీల్లో పాల్గొంటున్నారు.డోనాల్డ్ ట్రంప్ దేశాన్ని అనవసరమైన యుద్ధంలోకి దించారని ఆయన ప్రచారసభలో మండిపడుతున్నారు.ఈ యుద్ధంవల్ల అమెరికా సైనికులు మరణించారని,ఎంతోమంది గాయపడ్డారని,ఇప్పుడు ఇరాన్‌కు హోర్ముజ్ జలసంధిపై వీటో అధికారం లభించిందని అన్నారు.
ఒహియో రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల ప్రచార ర్యాలీల్లో ఒబామా పాల్గొంటున్నారు.అంతర్జాతీయ సంబంధాల విషయంలో డోనాల్డ్ ట్రంప్ విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని,ఆయనను అదుపు చేయాలంటే ఈ మధ్యంతర ఎన్నికలు ఒక్కటే ఏకైక పరిష్కారమార్గమని,ఈ ఎన్నికల్లో డెమోక్రాట్స్‌కు పూర్తి మెజార్టీ ఇవ్వాలని ఒబామా ప్రజలను కోరారు.దేశంలో పెరిగిన ధరలకు కూడా ట్రంప్ ప్రధాన బాధ్యుడని విమర్శించారు.''ఈ పరిపాలనలో కొన్ని మూర్ఖపు పనులు జరుగుతున్నాయి,వాటిని అదుపులోకి తీసుకురావాలంటే ఈ ఎన్నికలు ఒక్కటే చిట్ట చివరి అత్యుత్తమ అవకాశం'' అన్నారు.ఒహియో,మిచిగాన్‌లలో జరిగిన సభల్లో ఒబామా మాట్లాడుతూ,ట్రంప్,ఆయన మంత్రివర్గ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు.వైట్‌హౌస్‌ను పునర్నిర్మించాలన్న ఆలోచనలను తీవ్రంగా తప్పుపట్టారు.ఆధునిక యుగంలో మనం ఎన్నడూ చూడని అవినీతి,క్రూరత్వం,అసమర్థత రెండేళ్ళుగా చూస్తున్నాం,ఇక చాలు,దీన్ని ఆపుదాం,అందుకు ఇదే మంచి అవకాశం'' అన్నారు.కోవిడ్ తర్వాత ఆర్థిక సమస్యలవల్ల డెమోక్రాట్లను 2024లో తిరస్కరించిన ఓటర్లపట్ల తాను సానుభూమి చూపిస్తున్నానన్నారు.కానీ ప్రస్తుత ఆర్థిక దుస్థితికి ట్రంప్ మాత్రమే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు.
ఇదిలా ఉండగా, జార్జియాలో జరిగిన ఎన్నికల సభలో డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ,పెట్రోలు ధరలు దేశంలో తాత్కాలికంగా అధికంగా ఉన్నాయన్న విషయాన్ని అంగీకరించారు. కానీ దేశం నానాటికీ బలంగా తయారవుతోందన్నారు.అమెరికా దేశం స్వర్ణయుగంలో ఉందని అన్నారు.ఆయన ప్రభుత్వం అనుసరించిన వలస విధానాలను,సుంకాల పెరుగుదల విధానాలను గట్టిగా సమర్థించుకున్నారు.అమెరికాను ఘనమైన దేశంగా తిరిగి ఉన్నతస్థానానికి తీసుకువెళతానన్నారు.ఇప్పటికే అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ముందస్తు ఓటింగ్ సరళి ప్రారంభమైంది. శనివారంనాడు ఫ్లోరిడాలో ట్రంప్ సభల్లో పాల్గొని తన భార్య మెలానియాతో కలిసి ఓటు హక్కు ఉపయోగించుకున్నారు.

# బల్గేరియాలో అధ్యక్ష ఎన్నికల ఓటింగ్




**సోఫియా:** యూరప్ ఆగ్నేయప్రాంతదేశం బల్గేరియాలో అధ్యక్షపదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఇద్దర ప్రధాన ప్రత్యర్థులు పోటీ పడుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. 61 ఏళ్ళ వయసుగలదేశాధ్యక్షురాలు ఇలియానా ఇయోటోవా, గతంలో కొద్దికాలం ప్రధాన మంత్రిగా పనిచేసిన యాభై ఏళ్ళు వయసు గల ఆండ్రీ గ్యురోవ్ సహా మరో 27 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ పడ్డారు. దేశంలో పార్లమెంటుకే అధికారాలు ఎక్కువ. అధ్యక్ష పదవి నామ మాత్రమే. బల్గేరియాలో ప్రజలకు పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు,నల్ల సముద్రంలో ఉద్ధృతంగా జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపు ద్వారా అధ్యక్షుడికి అపరిమితమైన అధికారాలు లభిస్తాయి. దేశాధ్యక్షుడు సాయుధ దళాలకు నాయకత్వం వహిస్తారు, చట్టాలను వీటో చేస్తారు. అంతర్జాతీయ ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. అర్హులైన 66 లక్షలమంది ఓటర్లు బల్గేరియాలో ఉన్నారు. ఐతే విజయం సాధించడానికి అవసరమైన 50 శాతం ఓట్లు పోటీ చేసిన అభ్యర్థులలో ఏ ఒక్కరికీ లేదని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల రెండో రౌండ్ ఓటింగ్ కూడా జరుగుతుందని అంచనావేస్తున్నారు. నవంబరు 1వ తేదీన తిరిగి రెండో విడత రన్నాప్ ఎన్నికలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# నెతన్యాహూ ఛాలెంజర్ ఐసెన్‌కోట్

- రేపు ఇజ్రాయెల్ పార్లమెంటు ఎన్నికలు
- స్వదేశానికి 67 వేలమంది ఓటర్ల రాక





**జెరూసలెం:** పాలస్తీనాపై కీలకమైన యుద్ధం తర్వాత ఇజ్రాయెల్ పార్లమెంటుకు వచ్చే మంగళవారం ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికలకు రంగం సిద్ధమైంది. దేశంలో 73 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. దాదాపు 67,000 మందిపైగా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేందుకు విదేశాల నుండి స్వదేశం చేరుకుంటున్నారు. వీరిలో ఎక్కువమంది అమెరికా నుండే వస్తున్నారు. బ్రిటన్, కెనడాల నుండి కూడా వస్తున్నారు. కానీ విదేశాలలో ఉన్న ఓటర్లు చాలా స్పష్టంగా ఇజ్రాయెల్ వ్యతిరేకతను, ద్వేషాన్ని అనుభవించారు. అందువల్ల వారంతా నెతన్యాహూను ఓడించాలనే సంకల్పంతో ఉన్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈసారి పోటీ నువ్వా–నేనా అనే రీతిలో ఉంది. నెతన్యాహూకు మద్దతు తగ్గిపోయింది. ఈసారి నెతన్యాహూకు ప్రతిపక్ష నేత, యాషెర్ పార్టీ నాయకుడు గాడీ ఐసెన్ కోట్ (66) తిపెద్ద ప్రధాన ప్రత్యర్థిగా తెరమీదకు వచ్చారు. 2015 నుండి 2019 వరకూ ఆయన ఇజ్రాయెల్ రక్షణ బలగాలకు ప్రధానాధిపతిగా పనిచేశారు. 2023, 2024 సంవత్సరాలలో ఎలాంటి శాఖ కేటాయింపులు లేకుండా యూనిటీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. తర్వాత బయటకు వచ్చి రాజకీయ పార్టీ స్థాపించారు. పౌరులందరికీ సమాన హక్కులు ఉండాలని, యూదు మత పునాదులున్న ప్రభుత్వం అధికారంలో ఉండాలని ఆయన వాదిస్తున్నారు. నెతన్యాహూ వ్యతిరేకతే ఆయన ప్రచార ఆయుధంగా మారింది. అనేక సర్వే ఫలితాల ప్రకారం ఆయన అనుసరించిన వ్యూహం ఫలించింది. ఆయన నెతన్యాహూకు పెద్ద సవాలుగా మారారు. నెతన్యాహూ లికుడ్ పార్టీ కంటే అత్యధికంగా ఆయన స్థానాలు సంపాదించుకుంటారని సర్వేలు ఇప్పటికే వెల్లడించాయి. యెయిర్ లాపిడ్ తరపున నఫ్తాలీ బెన్నెల్, బైచద్ కూడా పోటీలో ఉన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో 120 స్థానాలు ఉన్నాయి.ఏ పార్టీ లేదా కూటమికైనా 61 స్థానాలు లభిస్తేనే పార్లమెంటు అధికారం దక్కుతుంది. కానీ ఎవరికీ పూర్తి మెజార్టీవచ్చే అవకాశాలు లేవని నివేదికలు చెబుతున్నాయి.

# బ్రెజిల్‌లో రన్నాఫ్ పోలింగ్



**సావోపోలో:** బ్రెజిల్‌లో ఆదివారం తుదివిడత ఎన్నికల పోలింగ్ జరిగింది. డోనాల్డ్ ట్రంప్ మద్దతుగల మితవాద నాయకుడు ఫ్లావియా బోల్సెనారోకు, ప్రస్తుత అధ్యక్షుడు, వామపక్ష నాయకుడు లూలా డసిల్వాకు మధ్య హోరాహోరీగా జరిగిన మొదటి విడత ఎన్నికల్లో బోల్సెనారో స్వల్ప ఆధిక్యం సాధించారు. ఆయన తండ్రి జైర్ బోల్సెనారో ప్రస్తుతం అవినీతి ఆరోపణల్లో గృహనిర్బంధంలో శిక్ష అనుభవిస్తున్నారు. వామపక్ష నేత లులా డసిల్వాపై 11 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అవినీతి ఆరోపణలు, ఆర్థిక సమస్యలు ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశాలుగా కుదిపేశాయి. ఫ్లావియా బోల్సెనారోకు మొదటి విడత అక్టోబరు నాలుగో తేదీన జరిగిన పోలింగ్‌లో 47 శాతం ఓట్లు లభించగా, లులా డసిల్వాకు 45 శాతం ఓట్లు లభించాయి. దేశంలో 160 మిలియన్ (16 కోట్ల మంది)అర్హులైన ఓటర్లు ఉన్నారు.

## హక్కుల సాధన

**(మొదటి పేజీ తరువాయి)**

యూనియన్లు కృషి చేయాలన్నారు. మిదతూం జనరల్ సిఇఒ, వ్యవస్థాపకులు పోచయి ముత్తు ముత్తుస్వామి మాట్లాడుతూ మారుతున్న సమాజంలో వాస్తవాలను సమాజానికి అందించడంలో మహిళా జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుతం మీడియాలో సంచలనాలు పెరిగిపోయాయయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్లో అంతర్గతంగా అపారమైన మానసిక స్థైర్యం, శక్తి ఉంటుందన్నారు. ఐజెయు జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్లలో మహిళల భాగస్వామ్యం పెరిగితే ఐజెయు మరింత శక్తివంతంగా మారుతుందన్నారు.
ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ జర్నలిస్టు సంఘాలు, విధాన నిర్ణయక కమిటీల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగడం శుభ పరిణామమన్నారు. రాబోయే రోజుల్లో యూనియన్ కార్యకలాపాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని మహిళా జర్నలిస్టులను కోరారు. ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్.సిన్హా మాట్లాడుతూ మహిళలు నాయకత్వ బాధ్యతల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఐజెయు సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్లతో కలిసి మహిళలు సమిష్టిగా పనిచేస్తే మరిన్ని విజయాలు సాధించవచ్చున్నారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ మహిళా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ, ఐజెయు ఉపాధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె సెక్రెటరీ జనరల్ కె.రాంనారాయణ, సీనియర్ జర్నలిస్టు స్వప్న తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మీడియా సర్వే అంశంపై మహాన్యూస్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కె.అజీత, మహిళా జాతీయ సదస్సు తీర్మానాలను సీనియర్ జర్నలిస్ట్ అత్తులూరి అరుణ సభలో ప్రవేశపెట్టగా ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 65 మంది ప్రతినిధులతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి 70 మొత్తం 135 మందికిపైగా మహిళా జర్నలిస్టులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

**ఫీల్డ్ రిపోర్టర్లపై దాడులు,**
**ఆన్‌లైన్ వేధింపులకు అడ్డుకట్ట వేయాలి:**
**మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు తీర్మానం..**

దేశవ్యాప్తంగా మహిళా జర్నలిస్టుల వృత్తిపరమైన స్వేచ్ఛ, భద్రత, గౌరవానికి భంగం కలిగించే చర్యలను అరికట్టేందకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు కఠిన చర్యలు తీసుకోవాలని 'జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు' డిమాండ్ చేసింది. దేశ వ్యాప్తంగా మహిళా జర్నలిస్టుల స్వేచ్ఛ, భౌతిక దాడుల నుంచి భద్రత , ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా పెరుగుతున్న దాడులు, ప్రతికూల పరిణామాలను మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు ఖండించింది. రాజ్యాంగబద్ధమైన స్వేచ్ఛ, పని ప్రదేశాల్లో భద్రత ప్రాముఖ్యతను గుర్తిస్తూ, మహిళా జర్నలిస్టుల భద్రతను పటిష్టం చేయాలని, వారి వృత్తిపరమైన సమానత్వం, గౌరవం, స్వేచ్ఛను పరిరక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టాల అమలు తీరును పర్యవేక్షించే సంస్థలు, మీడియా సంస్థలను డిమాండ్ చేసింది..

**సదస్సులో ఆమోదించిన ప్రధాన తీర్మానాలు:...**

ప్రతి మీడియా సంస్థలో 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) 2013'ను తప్పని సరిగా అమలు చేయాలి. అన్ని సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు (ఐ సి సి) ఏర్పాటు చేయడంతో పాటు వేధింపులు, కక్షసాధింపు చర్యల నివారణకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో స్వతంత్ర భద్రతా విభాగాలను నెలకొల్పాలి. ఫీల్డ్‌లో వార్తా సేకరణకు వెళ్లే మహిళా జర్నలిస్టులపై జరిగే భౌతిక దాడులు, పోలీసుల దురుసు ప్రవర్తనను సదస్సు ఖండించింది. బాధ్యులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు సమగ్ర చట్టంతో పాటు ప్రభుత్వ నిధులతో ఉచిత న్యాయ సహాయం అందించాలి. మహిళా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని సైబర్ స్టాకింగ్, డాక్సింగ్, డీప్ఫేక్స్ వంటి దాడులపై చట్టపరమైన సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫారం బాధ్యతాయుతంగా స్పందించాలి. ఐటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ, బాధితుల వ్యక్తిగత గోప్యతను కాపాడాలి.
మీడియా సంస్థల్లో వేతన అసమానతలను రూపుమాపేందుకు 'సమాన వేతన చట్టం1976'ను పక్కాగా అమలు చేయాలి. మహిళా జర్నలిస్టులకు కీలకమైన రిపోర్టింగ్ బీట్లను కేటాయించడంతో పాటు సంపాదకీయ నాయకత్వ స్థానాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. ప్రసూతి ప్రయోజనాల చట్టం1961ను అమలు చేయడంతో పాటు నెలకు ఒకరోజు వేతనంతో కూడిన ప్రత్యేక రుతుక్రమ సెలవు మంజూరు చేయాలి. ఆఫీసుల్లో శిశు సంరక్షణ కేంద్రాలను, హెల్త్ కార్డులు అందించాలి. రిటైర్డ్, రెగ్యులర్, ఫ్రీలాన్స్ మహిళా జర్నలిస్టులందరికీ వర్తించేలా దేశ వ్యాప్తంగా ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలి. ప్రమాదవశాత్తు లేదా అకాల మరణం చెందిన మీడియా ప్రతినిధుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి. ఉద్యోగ ఒప్పందాల పరిరక్షణకు 'వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం1955'ను కచ్చితంగా అమలు చేయాలి. వివక్ష లేకుండా అర్హులైన మహిళా జర్నలిస్టులందరికీ ప్రభుత్వ అక్రిడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల సంక్షేమ పథకాల ద్వారా ప్రత్యేక హౌసింగ్ లేదా ఇళ్ల స్థలాల కేటాయింపులు చేపట్టాలి. ఈ తీర్మానాలను తక్షణమే పరిగణనలోకి తీసుకుని చట్టపరమైన, రక్షణాత్మక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సదస్సు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.

## మళ్లీ రోడ్డెక్కిన జనం

**(మొదటి పేజీ తరువాయి)**

పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరసన ప్రదర్శనలు చాలావరకూ శాంతియుతంగా జరిగినప్పటికీ అనేకచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రదర్శకులను చెదరగొట్టేందుకు బాష్పవాయువులు, నీటిగొట్టాలను ప్రయోగించారు. అదేసమయంలో మార్సెయిల్స్ నగరంలో ప్రదర్శకులు బారికేడ్లకు నిప్పుపెట్టారు. పలే దుకాణాల బోర్డులు పీకేశారు. పోలీసులు మరో 1300 మందిని అరెస్టు చేశారు. ఇప్పటికే మొదటి విడత హింసాత్మక ప్రదర్శనలలో 2,700 మందిని పోలీసులు అరెస్టు చేశారు. శరవేగంగా విచారణలు జరిపి అనేకమందికి శిక్షలు అమలు చేశారు. ఫ్రాన్స్ చరిత్రలో ఎన్నడూలేని రీతిలో దారుణ హింస, అల్లర్లు, లూటీలు గతవారంలో చెలరేగాయి. కానీ ఈసారి పోలీసులు ముందస్తు వ్యూహంతో ప్రదర్శకుల నుండి మారణాయుధాలను, గ్యాస్ మాస్కులు, గ్లౌజులు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రదర్శకులను గతంకంటే భిన్నంగా నియంత్రించగలిగారు. దీంతో ఈసారి హింసాకాండ లేకుండా ఉద్ధృతి తగ్గింది. చాలా వరకూ శాంతియుతంగా ప్రదర్శనలు జరిగాయి. శనివారం దేశవ్యాప్తంగా 4.10 లక్షలమంది ప్రదర్శనల్లో పాల్గొన్నారని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రకటించగా, ఎనిమిది లక్షలమంది పాల్గొన్నారని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. 70 వేలమంది పోలీసులను ప్రభుత్వం మోహరించింది. ఇటలీ, అల్బేనియా దేశాలలో కూడా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు వేలాదిమంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అల్బేనియా రాధాని తిరానాలో ఘర్షణలు చెలరేగాయి. ఇటలీ నగర మిలాన్‌లో వేలాదిమంది ప్రజలు శనివారంనాడు వీధుల్లో ర్యాలీలు చేశారు. దీంతోపాటు ఇటలీలోని ఇతర అనేక నగరాలలో కూడా ప్రదర్శకులు ప్రదర్శనలు జరిపారు. మిలాన్, రోమ్, తురిన్‌లలో భారీ ప్రదర్శనలు జరిగాయి. పోలీసులు, సైనికులు భారీసంఖ్యలో వారిని చుట్టుముట్టారు. హింస,లూటీలు జరగకుండా అడ్డుకున్నారు. మిలాన్‌లో శాంతియుత ప్రదర్శనలు జరిగాయి. అక్కడక్కడ ఘర్షణలు జరిగాయి. మిలాన్‌లో ప్రధానంగా వేలాదిమంది యువకులు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. అనేకచోట్ల దుకాణాలను తెరిచారు. వ్యాపార లావాదేవీలు జరిగాయి. 500 మంది సైనికులను అదనంగా మోహరించామని ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ చెప్పారు. మైనర్లు ప్రదర్శనల్లో పాల్గొంటే కఠినంగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించామన్నారు.

## సిఐడి కొరడా

**(మొదటి పేజీ తరువాయి)**

మిల్లర్లు దానిని బహిరంగ మార్కెట్‌కు మళ్లించి, తక్కువ ధర కలిగిన దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. ఇందులో రాష్ట్రం వెలుపలి నుంచి సేకరించిన బియ్యం కూడా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ టాస్క్‌ఫోర్స్ (ఇటిఎఫ్) బృందాలు నిర్వహించిన తనిఖీల అనంతరం సేకరించిన నమూనాలను ప్రయోగశాలల్లో పరీక్షించగా, పరిశీలించిన కేసుల్లో సరఫరా చేసిన బియ్యం కేటాయించిన సన్న రకానికి అనుగుణంగా లేనట్లు తేలిందని సిఐడి వెల్లడించింది. ఈ వ్యవహారం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) ఒప్పంద నిబంధనల ఉల్లంఘనతోపాటు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే అవకాశాలపై అనుమానాలు రేకెత్తించింది.నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న రకం బియ్యం కేటాయింపులకు బదులుగా 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యాన్ని సరఫరా చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సరఫరాల కారణంగా బోనస్ చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వానికి సుమారు రూ.1.69 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.మరోవైపు, 45,414.833 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు కేటాయింపులు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ పరిమాణానికి సంబంధించి బోనస్ రూపంలో ప్రభుత్వంపై పడే అవకాశం ఉన్న ఆర్థిక భారం సుమారు రూ.242 కోట్లుగా అంచనా వేశారు. అయితే, పౌరసరఫరాల శాఖ అధికారులు సకాలంలో స్పందించి, తదుపరి ప్రక్రియను నిలిపివేయడంతో ఈ మేరకు సంభవించగల నష్టాన్ని నివారించినట్లు సమాచారం.సన్న రకం ధాన్యం మళ్లింపు, బియ్యం రకం మార్పిడి, సిఎంఆర్ ఒప్పంద ఉల్లంఘన, ప్రభుత్వానికి తప్పుడు పద్ధతుల్లో నష్టం కలిగించడం, నేరపూరిత కుట్ర వంటి అంశాలపై సిఐడి దర్యాప్తు కొనసాగిస్తోంది. ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్ అనుమతులు ఎలా జారీ అయ్యాయి? ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ఏమైనా ఉందా? ఇతర వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే కోణాల్లోనూ విచారణ జరుపుతోంది. పత్రాలు, సాంకేతిక నివేదికలు, ఇతర ఆధారాలను సేకరించి, ప్రభుత్వానికి జరిగిన వాస్తవ నష్టాన్ని నిర్ధారించనున్నట్లు సిఐడి తెలిపింది.

## భగీరథ యత్నం

**(మొదటి పేజీ తరువాయి)**

తెలియజేసిన సమాచారం ప్రకారం గతంలో 2016 ఆగస్టు 23న అప్పటి తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రతో కుదుర్చుకున్న ఒప్పందంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నీటి మట్టాన్ని +148 మీటర్లకు పరిమితం చేసింది. ఆ తర్వాత గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టి తుమ్మడిహెట్టిని పూర్తిగా పక్కన పడేసింది. దీంతో ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు ఆశించిన స్థాయిలో సాగు, తాగునీరు అందలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు తాగు సాగు నీటిని అందించే సంకల్పంతో ఈ బ్యారేజీపై దృష్టి సారించారు. గ్రావిటీ ద్వారా ఎక్కువ నీటిని తెచ్చుకునేందుకు తుమ్మిడిహెట్టి నిర్మించేందుకు పున:ప్రయత్నాలు ప్రారంభించారు. 148 మీటర్ల ఎత్తున ఆశించినంత నీటిని తెచ్చుకునే వీలు లేనందున +152 మీటర్ల ఎత్తు బ్యారేజీ నిర్మించుకునేందుకు అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయటంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. 2025, డిసెంబర్ 4న ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ విజయోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇచ్చారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మడి హెట్టి నిర్మాణం చేపట్టి ఆదిలాబాద్ పంట పొలాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు.
2026 జనవరిలో నిర్మల్ సభలో మరోసారి స్పష్టత ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు.
ఏప్రిల్ 29న తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ కార్యాచరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో వెంటనే సంప్రదింపులు ప్రారంభించాలని ఆదేశించారు. మే 6న తుమ్మిడిహెట్టి బ్యారేజీపై చర్చలకు సమయం కేటాయించాలని కోరుతూ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి స్వయంగా లేఖ రాశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి సమయం ఇవ్వాలని కోరారు. బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం, ఇతర అంతర్రాష్ట్ర అంశాలపై పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. జూన్ 11న మహారాష్ట్రతో ఉన్న పెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రికి లేఖ రాశారు. రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగేలా సహకరించాలని కోరారు. తెలంగాణ భవిష్యత్ సాగు, తాగునీటి అవసరాలకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ముఖ్యమంత్రి లేఖను ప్రధానమంత్రి కార్యాలయం కేంద్ర జలశక్తి శాఖకు పంపించింది. ఆగస్టు 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర అంగీకారం సాధించేందుకు కేంద్రం సహకరించాలని కోరారు. కాగా +148 మీటర్ల వద్ద గ్రావిటీ ద్వారా ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని వివరించారు. ఇదిలా ఉండగా, +150 నుంచి +152 మీటర్ల వద్ద బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటిని తరలించి విద్యుత్ వ్యయాన్ని తగ్గించవచ్చని తెలిపారు. సిడబ్ల్యుపిఆర్ఎస్ పుణె నిర్వహించిన బ్యాక్ వాటర్ అధ్యయనాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని, అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో చర్చలు ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

## బియ్యం ధరలు పైపైకి...

**(మొదటి పేజీ తరువాయి)**

ఒక అధికారి అవినీతి అధికారులకు పట్టుబడిన ఆ శాఖాధికారుల్లో పెద్దగా మార్పు వచ్చినట్లు కనిపించడం లేదు. కోట్లు సంపాదించిన ఆ అధికారి బాటలోనే మరికొందరు నడుస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి రైసు మిల్లులకు ధాన్యం కేటాయించడం మిల్లర్లపై సరైన సమయంలో చర్యలు తీసుకోకపోవడం, బియ్యానికి సంబంధించి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టలేకపోవడంతో పౌర సరఫరాల శాఖ వైఫల్యం ప్రజలకు శాపంగా మారింది.

**నిబంధనలకు తూట్లు :**

లేవి కొరకు రైసు మిల్లులకు ధాన్యం కేటాయింపులో నిబంధనలకు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం ఏళ్ల తరబడి ఇవ్వకపోయినా అధికారులు పట్టించుకోకపోవడం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు దాడులు చేసి కేసులు నమోదు చేయడం మిల్లర్లు ముందస్తు బెయిల్ తెచ్చుకుని యథేచ్చగా వ్యాపారాలు తిరిగి కొనసాగిస్తుండడం అలవాటుగా మారిపోయింది. కూసుమంచి మండలంలో నిర్మాణంలో ఉన్న రైసుమిల్లుకు యాసంగిలో లేవి ధాన్యం కేటాయించారు. మిల్లు నిర్మాణం కాకముందే ధాన్యం కేటాయింపు చర్చనీయాంశమైంది. నేలకొండపల్లి మండలంలో ఓ రైసుమిల్లును ఓ వ్యాపారి అద్దెకు తీసుకుని నడిపిస్తుండగా ఆయనకు ధాన్యం కేటాయింపు దొడ్డిదారిన జరిగిందని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అయినా అధికారులు స్పందించకపోవడంతో ఇప్పుడు రూ. 8.25 కోట్ల విలువైన బియ్యం బకాయి ఉన్నట్లు అధికారులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు తర్వాత కూడా అటు పోలీసులు, ఇటు సివిల్ సప్లయ్ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో వ్యాపారి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నట్లు సమాచారం. విజిలెన్స్ దాడుల తర్వాత కూడా పౌర సరఫరాల శాఖ పరోక్ష సహకారంతోనే వ్యాపారులకు వెసులుబాటు లభిస్తుందన్న ఆరోపణలు వినపడుతున్నాయి. పౌర సరఫరాల శాఖ బియ్యం అక్రమ రవాణాపైన, అక్రమ నిల్వల పైన ఉదాసీనంగా వ్యవహరిస్తుంది. నిబంధనలకు వ్యతిరేకంగా నిల్వలు చేస్తున్నా, ఎగుమతులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. సెంచరీకి చేరువైన కేజీ బియ్యం ధరతో సామాన్యులు ఇబ్బందులు పడుతుండగా అసలే కష్టపడి ధాన్యం పండించిన రైతుకు కూడా ఒరిగింది ఏమి లేదు. రైతు, వినియోగదారుని మధ్యలో దళారులు కోట్లు దండుకుంటున్నారు. మిల్లర్ల మాయాజాలాన్ని అరికట్టడంతో పాటు బ్లాక్ మార్కెట్‌పై సత్వర కఠిన చర్యలు తీసుకోకపోతే సామాన్యులు మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

**రైతుకు భారీ ఊరటే కానీ...**

ఎల్‌నినో ప్రభావం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతుకు భారీ ఊరట లభిస్తుంది. మునుపెన్నడు లేనివిధంగా ధాన్యానికి రికార్డు ధర లభిస్తుంది. బియ్యం ధర కేజి రూ.100కు చేరువ కాగా ధాన్యం క్వింటా ఐదువేలకు చేరువవుతుంది. గతంలో ధాన్యం పండించి కొనుగోలు చేయండి మహాప్రభో అన్న స్పందన లేదు కానీ ఇప్పుడు పచ్చి ధాన్యాన్నే మంచి ధర చెల్లించి ఎగబడి కొనుగోళ్లు జరుపుతున్నారు. మంచి ధర లభించడం రైతుకు ఊరటే కానీ ఇది భవిష్యత్తులో ప్రమాదానికి కారణమవుతుంది. వ్యాపారులు కరువు నేపథ్యంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో విపరీతమైన బియ్యం కొరత ఏర్పడుతుంది. ఇప్పటికే కృత్రిమ కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యతతో పాటు ధరలను నియంత్రించాల్సిన బాధ్యత కూడా ఈ ప్రభుత్వంపై ఉంది. రైసుమిల్లర్ల మాయాజాలానికి సంబంధించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

# ఇషాన్ కిషన్ రీ-ఎంట్రీ.. వైభవ్ ఔట్?

న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న టీమిండియా వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఐదు టి–20ల సిరీస్‌లో భాగంగా టీమిండియా వరుసగా రెండు మ్యాచ్‌లలో గెలిచి 2–0 ఆధిక్యంలో నిలిచింది. సిరీస్‌ను 3–0తో గెలుచుకోవడమే లక్ష్యంగా మంగళవారం (అక్టోబర్ 27) వెల్లింగ్టన్‌లోని హెన్రీ స్టేడియం వేదికగా జరగనున్న మూడో టి–20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టును ఢీకొట్టేందుకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు సిద్ధమవుతోంది. అయితే ఈ మూడో టి–20 మ్యాచ్ కోసం తుది జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఈ సిరీస్ తీవ్ర నిరాశను మిగిల్చింది. అంతర్జాతీయ టి–20ల్లో 90 మ్యాచ్‌లు ఆడి 91వికెట్లు తీసిన భువీ.. ఈ సిరీస్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లలో ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. మొదటి మ్యాచ్ లో 49 పరుగులు ఇవ్వగా.. రెండో టి–20లో 4 ఓవర్లలో 50 పరుగులు ఇచ్చి కేవలం ఒకే ఒక్క వికెట్ పడగొట్టాడు. వరుసగా విఫలమవుతున్న భువనేశ్వర్ కుమార్‌కు జట్టు యాజమాన్యం విశ్రాంతి ఇవ్వాలని యోచిస్తోంది. భువీ స్థానంలో స్టార్ పేసర్ మయాంక్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. తొలి మ్యాచ్ మయాంక్ 40 పరుగులకు ఒక వికెట్ తీసినప్పటికీ.. రెండో మ్యాచ్‌లో ప్రిన్స్ యాదవ్ కోసం బెంచ్‌కే పరిమితమయ్యాడు. గాయం కారణంగా రెండో టి–20కి దూరమైన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. ఈ ఏడాది టి–20ల్లో భారత్ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచిన ఇషాన్ కిషన్ రాకతో భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు మరింత బలం చేకూరనుంది. కాగా రెండో టి–20లో ఇషాన్ కిషన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చి మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 8బంతుల్లో కేవలం 4 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ఇప్పుడు ఇషాన్ కిషన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో వైభవ్ తిరిగి బెంచ్‌కే పరిమితం కావడం ఖాయంగా కనిపిస్తోంది.



**స్థిరంగా మిగతా బ్యాటింగ్ లైనప్...**జట్టులోని మిగిలిన బ్యాటర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్‌రెడ్డిలు సిరీస్‌లో కనీసం ఒక్కసారైనా మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. దీంతో వీరంతా తుది జట్టులో తమ స్థానాలను నిలబెట్టుకోవడం దాదాపు ఖాయం. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ స్థానంలో స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ లేదా వరుణ్ చక్రవర్తిని పరిశీలించే అవకాశం ఉన్నప్పటికీ.. వెల్లింగ్టన్ పిచ్ స్వభావాన్ని బట్టి మ్యాచ్ ప్రారంభానికి ముందు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**మూడో టి–20 భారత తుది జట్టు(అంచనా):** అభిషేక్ శర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, ప్రిన్స్ యాదవ్, అర్షదీప్ సింగ్, మయాంక్ యాదవ్.

## ముగిసిన పారా ఆసియా క్రీడలు

**నగోయా:** పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. శనివారం జరిగిన ముగింపు వేడుకల పరేడ్‌లో డబుల్ గోల్డ్ మెడలిస్ట్, పారా షూటర్ మోనా అగర్వాల్.. అథ్లెట్ నిషాద్ కుమార్‌తో కలిసి భారత త్రివర్ణ పతాకాన్ని చేతబూని భారత బృందానికి ఫ్లాగ్ బేరర్‌గా నేతృత్వం వహించింది. ఆఖరి రోజు వరకు పతకాల పట్టికలో నాలుగో స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, దక్షిణ కొరియా (29 స్వర్ణాలు) నుంచి ఎదురైన పోటీని తట్టుకుని భారత్ తన నాలుగో స్థానాన్ని సురక్షితంగా నిలబెట్టుకుంది. భారత బృందం ఏకంగా 114 పతకాలు (30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు) సాధించి పారా ఆసియా క్రీడల చరిత్రలోనే తమ అత్యుత్తమ ప్రదర్శనతో కొత్త రికార్డు సృష్టించింది. చైనా (217 స్వర్ణాలు, 435 పతకాలు), జపాన్ (64 స్వర్ణాలు186 పతకాలు), ఉజ్బెకిస్తాన్ (45 స్వర్ణాలు145 పతకాలు) తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.





## ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో సింధు ఓటమి

ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో భారత క్రీడాకారిణి పివి సింధు ఓటమిపాలైంది. దక్షిణ కొరియాకు చెందిన క్రీడాకారిణి అన్ సె యంగ్ చేతిలో ఓడిపోయింది. దీంతో ఫ్రెంచ్ ఓపెన్ ఉమన్స్ సింగిల్ టైటిల్ను అన్ సె యంగ్ దక్కించుకుంది. ప్యారిస్లోని అరెనా గ్రాండ్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో సింధు.. వరల్ నెంబర్ వన్ ర్యాంక్ ప్లేయర్ అన్ సె యంగ్ చేతిలో ఓటమి పాలైంది. మూడు గేమ్‌లుగా గంటకుపైగా ఈ గేమ్ సాగింది. మొదటి గేమ్‌లో 16–21తో సింధు ఆధిక్యం ప్రదర్శించింది. ఒక దశలో సింధు ఆటతీరుకు యంగ్ ఆందోళనకు గురైంది. అయితే, ఆ తర్వాత యంగ్ తన పోరాట పటిమ ప్రదర్శించింది. సింధుకు ధీటుగా దూసుకెళ్లింది. ఫలితంగా తర్వాత సాగిన రెండు గేమ్‌లో సింధు ఇదే ఆట తీరు చూపలేకపోయింది. దీంతో తర్వాతి రెండు గేమ్‌లను 21–11, 21–12 తో సింధు కోల్పోయింది. అన్ సె యంగ్.. ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా నిలిచింది. ఈ విజయంతో అన్ సె యంగ్ వరుసగా నాలుగోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలుచుకుంది. ఇంతకుముందు సింధు,యంగ్ మధ్య 11 మ్యాచ్‌లు జరగగా.. 11సార్లు సింధు ఓటమిపాలైంది.

## ఆరోగ్యం

# ఎక్కువసేపు కూర్చుంటున్నారా? సమస్యలు తప్పవు.. జాగ్రత్త

ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం నుంచి వరుసగా వెబ్‌సిరీస్‌లు చూడటం వరకు, ఆన్‌లైన్ తరగతులకు హాజరవడం నుంచి వర్క్ ఫ్రమ్ హోం పనుల్లో నిమగ్నమయ్యే వరకు వివిధ కారణాలతో యువత గంటల తరబడి కదలకుండా కూర్చుంటున్నారు. ఇలా ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం వల్ల కాళ్లలో రక్తం గడ్డకట్టే ప్రమాదం పెరుగుతుందని రక్తనాళాల నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన కాళ్లలోని కండరాలు నడిచేటప్పుడు రక్తాన్ని గుండె వైపు పంపడానికి సహాయపడతాయి. అయితే, ఎక్కువసేపు కదలకుండా కూర్చుంటే ఈ కండరాల కదలిక తగ్గి, కాళ్లలో రక్తప్రసరణ మందగించవచ్చు. దీనివల్ల లోతైన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే పరిస్థితిని డీప్ వీన్ థ్రాంబోసిస్ (డివిటి) అంటారు. ఈ రక్తపు గడ్డ విడిపోయి ఊపిరితిత్తులకు చేరితే పల్మనరీ ఎంబాలిజం అనే ప్రాణాపాయకరమైన సమస్య ఏర్పడవచ్చు. సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనల విశ్లేషణ ప్రకారం, ఎక్కువసేపు నిశ్చలంగా ఉండేవారిలో రక్తం గడ్డకట్టే ప్రమాదం తక్కువసేపు కూర్చునేవారితో పోలిస్తే సుమారు 24 శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. రోజువారీ నిశ్చల సమయం ప్రతి అదనపు గంటకు ప్రమాదం సుమారు 2 శాతం పెరిగినట్లు కూడా పరిశోధనలో సంబంధం కనిపించింది.



అయితే, ఈ గణాంకాలు సమూహాల మధ్య కనిపించిన సంబంధాలను సూచిస్తాయి. ప్రతి వ్యక్తికి ప్రమాదం ఇదే స్థాయిలో పెరుగుతుందని అర్థం కాదు. గతంలో ఈ సమస్య వృద్ధులు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు లేదా ఎక్కువ కాలం మంచానికే పరిమితమైనవారిలో ఎక్కువగా కనిపిస్తుందని భావించేవారు. కానీఇప్పుడు యువతలోనూ దీనిపై అవగాహన అవసరమని వైద్యులు చెబుతున్నారు. ఊబకాయం, ధూమపానం, శరీరంలో నీరు తక్కువగా ఉండటం, కొన్ని హార్మోన్ల సమస్యలు, వంశపారంపర్యంగా రక్తం గడ్డకట్టే సమస్యలు, గతంలో డివిటి వచ్చిన చరిత్ర వంటి అంశాలు కూడా ప్రమాదాన్ని పెంచవచ్చు. అయితే, స్క్రీన్ ముందు ఎక్కువసేపు కూర్చోవడం ఒక్కటే రక్తం గడ్డకట్టడానికి కారణమని చెప్పలేం.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుర్తించాల్సిన లక్షణాలు

ఎక్కువసేపు కంప్యూటర్ ముందు పనిచేసేవారు, గేమ్స్ ఆడేవారు లేదా ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యేవారు లేదా వర్క్ ఫ్రమ్ హోం చేసేవారు ప్రతి 30 నుంచి 60 నిమిషాలకు ఒకసారి లేచి కొద్దిసేపు నడవడం అలవాటు చేసుకోవాలి. కూర్చున్నప్పుడే పాదాలను పైకి కిందికి కదిలించడం, రోజూ తగిన శారీరక వ్యాయామం చేయడం, తగినంత నీరు తాగడం ఉపయోగకరంగా ఉంటాయి. అయితే, వ్యాయామం చేస్తున్నామనే కారణంతో రోజంతా కదలకుండా కూర్చోవడం వల్ల అన్ని ప్రమాదాలు తొలగిపోతాయని భావించకూడదు. ఒక కాలులో అకస్మాత్తుగా వాపు, నొప్పి, వేడి లేదా ఎర్రదనం కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి, రక్తంతో దగ్గు లేదా మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసర వైద్యసహాయం పొందాలి. మొత్తంమీద, యువత ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయడంతో పాటు నిరంతరాయం గా కూర్చునే సమయాన్ని తగ్గించడం కూడా ముఖ్యం. ఎక్కువసేపు స్క్రీన్ చూడాల్సి వచ్చినా, మధ్యమధ్యలో లేచి కదలడం అలవాటు చేసుకోవడం రక్తప్రసరణకు తోడ్పడుతుంది.

## గుండె కవాటాల మార్పిడి శస్త్రచికిత్స



గుండెలో నాలుగు కవాటాలు (వాల్వ్స్) ఉంటాయి. ఇవి రక్తం సరైన దిశలో ప్రవహించేలా చేసి, తిరిగి వెనక్కి వెళ్లకుండా నిరోధిస్తాయి. ఈ కవాటాలు గట్టిపడినా, సరిగా మూసుకోకపోయినా గుండెపై ఒత్తిడి పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది గుండె వైఫల్యానికి దారితీయవచ్చు. అలాంటి పరిస్థితుల్లో శస్త్రచికిత్స అవసరమవుతుంది. గుండె కవాటాల మార్పిడి శస్త్రచికిత్సల్లో ఆధునిక వైద్య పద్ధతుల వల్ల మంచి ఫలితాలు లభిస్తున్నాయి. మైట్రల్ కవాటం (మైట్రల్ వాల్వ్) శస్త్రచికిత్సల్లో ప్రమాదం కొంత ఎక్కువగా ఉండవచ్చు. దీనికి వ్యాధి ముదిరిన తర్వాత గుర్తించడం, ఇతర గుండె సమస్యలు ఉండటం వంటి కారణాలు ఉన్నాయి. కవాట మార్పిడి శస్త్రచికిత్సలో తొలుత దెబ్బతిన్న కవాటాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త కవాటాన్ని అమర్చుతారు. ఇది రెండు విధాలుగా చేయవచ్చు. మొదటిది మెకానికల్ కవాటం. ఇది ఎక్కువకాలం మన్నుతుంది. అయితే, రక్తం గడ్డకట్టకుండా ఉండటానికి జీవితాంతం మందులు తీసుకోవాల్సి రావచ్చు. ఇక రెండోది టిష్యూ కవాటం. ప్రత్యేకంగా శుద్ధి చేసిన జీవ కణజాలంతో తయారు చేస్తారు. ఇవి సాధారణంగా 10 నుంచి 15సంవత్సరాల తర్వాత అరిగిపోవచ్చు. శస్త్రచికిత్స ఛాతీని తెరిచి చేయవచ్చు లేదా కొన్ని సందర్భాల్లో కాథెటర్ ద్వారా చేయవచ్చు. శస్త్ర చికిత్స ఎంతవరకు విజయవంతమవుతుందనేది రోగి వయస్సు, శరీర బలహీనత, గుండె రక్తాన్ని పంపే సామర్థ్యం, మధుమేహం, మూత్రపిండాల సమస్యలు, గతంలో గుండె శస్త్రచికిత్స జరిగిందా, అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి వచ్చిందా వంటి అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. గుండె కవాటాల మార్పిడి శస్త్రచికిత్సకు దారితీసే పరిస్థితులకు ముందే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి, గుండెదడ, కాళ్ల వాపు, అధిక అలసట, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే, నిర్ధారణ కోసం ఎకోకార్డియోగ్రామ్, ఇసిజి, ఛాతీ ఎక్స్‌రే వంటి పరీక్షలు చేస్తారు. ఓపెన్ హార్ట్ సర్జరీ తర్వాత సాధారణంగా ఆసుపత్రిలో 57 రోజులు ఉండాల్సి రావచ్చు. పూర్తిగా కోలుకోవడానికి సుమారు 68 వారాలు పట్టవచ్చు. ఏదిఏమైనా, గుండె కవాటాల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకుని, గుండె నిపుణుడి సలహా తీసుకోవాలి. ప్రతి రోగికి శస్త్రచికిత్స ఫలితం భిన్నంగా ఉండవచ్చు. మీ వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యుడే శస్త్రచికిత్స అవసరాన్ని, ప్రమాదాలను, విజయావకాశాలను అంచనా వేయగలరు.

# హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టం

### సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక సంక్షేమ చట్టం తీసుకురావాలని సివిల్ సప్లయ్ హమాలీ కార్మిక సంఘం ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి నాయకుడు ముత్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విలాస్, కె.శ్రీనివాసాచారితో కలిసి బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ హమాలీల ఐక్యమత్యంతోనే కూలీ రేట్లను పెంచుకోగలిగామని తెలిపారు. ఎఐటియుసి పోరాటాల ఫలితంగానే కార్మికులకు బోనస్, కుట్టు కూలీ సాధించుకోవడంతో పాటు మహిళా కార్మికులకు కూలీ రేట్లు పెరిగాయని గుర్తుచేశారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విలాస్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. హమాలీ కార్మికులకు పనిభద్రతతో పాటు ఇన్సూరెన్స్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం సాధించడం కోసం హమాలీ కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గ సంక్షేమం ధ్యేయంగా నిరంతరం పోరాటాలు సాగించాలని కోరారు. కార్యక్రమం లో ఎఐటియుసి నాయకులు పుండలీక్, సాయి, పిట్టల భీమేష్, ఘంచక్కర్ శివాజీ, పిల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులే

### సిపిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** నిత్యం పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని 17వ వార్డు సుభాష్ కాలనీలో సిపిఐ శాఖ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను రాజ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి నూకల చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సిపిఐకి వందేళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా సిపిఐ పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, సొతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజ్ సతీష్, నూకల చంద్రమౌళి, జి.శ్రీనివాస్, సంఘా శ్రీనివాస్, సదానందం, జిల్లా తిరుపతి,పల్లె కృష్ణ, గోలి లావణ్య, ఏనుగుల రాజయ్య, లింగయ్య కనవేని, గుడెల్లి ఐలయ్య, పవన్, రమాదేవి, సహస్ర రెడ్డి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

### ఆర్‌టిసి గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణ

**ప్రజాపక్షం/రెబ్బన/ఆసిఫాబాద్ :** కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. ఆర్‌టిసి గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ జోక్యానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్, వరంగల్, నల్లగొండ, సికింద్రాబాద్ రీజియన్లలో ప్రభుత్వ అనుకూల కూటమికి గుర్తింపు కల్పించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని విమర్శించారు. కార్మికుల తీర్పును గౌరవించకుండా, నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు కట్టబెట్టారని మండిపడ్డారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. అక్రమంగా ఇచ్చిన గుర్తింపును వెంటనే రద్దు చేసి, రాష్ట్రస్థాయిలో మెజారిటీ సాధించిన ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి)కు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికార దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, లేబర్ మంత్రిని పదవి నుంచి తొలగించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 28న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట వేలాది మంది కార్మికులతో మహాధర్నా, ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు సిహెచ్. మల్లికార్జున్, కార్యదర్శి ఎల్పుల అశోక్, సహాయ కార్యదర్శి నరేష్, కోశాధికారి జిఎం బాబు, నాయకుడు రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.



# జాప్యం చేయకుండా సిపిఎస్ రద్దుకు అధ్యయన కమిటీ

### ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను (సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్ పునరుద్ధరించే అంశంలో జాప్యం చేయకుండా సిపిఎస్ రద్దుకు అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన సిపిఎస్ రద్దు అంశంపైన కార్యాచరణను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియు సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రత్యేక సమావేశంలో సదానందం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో జిఒ 190ను అమలు చేయాలని, ఎంప్లాయీస్ నూతన హెల్త్ స్కీమ్ పారదర్శకంగా అమలు చేయాలని, క్షేత్ర స్థాయిలో నెలకొన్న ఇబ్బందులు తొలగించాలని కోరారు. పిఆర్‌సిపైన కాలయాపన సరికాదన్నారు. డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఎయిడెడ్, మోడల్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు 010 హెడ్ ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ జిఒ 25ను తక్షణమే సవరించాలన్నారు. సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి 'మినిమం టైమ్ స్కేల్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి, నాయకులు సయ్యద్ సాబెర్ అలీ, ఎల్‌ఎం.ప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, పోల్‌రెడ్డి, ఎవి.సుధాకర్, శంకర్ మాతంగి, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సారంపల్లి మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయం : ఎఐకెస్ నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతాంగ హక్కుల సాధనకు, రైతు సమస్యల పరిష్కారానికి సారంపల్లి మల్లారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకేఎస్) నాయకులు కొనియాడారు. రైతాంగాన్ని సంఘటితం చేయడంలో, వ్యవసాయరంగ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన పోషించిన పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. మాజీ ఎమ్మెల్యే, జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు, ప్రధాన కార్యదర్శిటి.సాగర్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం 24శాతం లోటుగా నమోదై పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పంట నష్టపోయిన రైతులకు ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు నష్టం జరగకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వెంటనే కరువు మండలాలను ప్రకటించి కేంద్ర బృందాన్ని రాష్ట్రానికి ఆహ్వానించడం ద్వారా కేంద్ర సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంస్మరణ సభ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. జంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, కందాల ప్రమీల, సుధాకర్ రెడ్డి, మాదినేని రమేష్, తుమ్మల వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయకార్యదర్శులు ఉడత రవీందర్, బొంతు రాంబాబు, అన్నవరపు సత్యనారాయణ, మల్లు నాగార్జున రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాటూరు బాలరాజు గౌడ్, భుక్య చందు నాయక్, వర్ణ వెంకట్‌రెడ్డి, కొంగరివెంకట్ మావో, డి.బాలరెడ్డి, ఎం.శ్రీనివాస్, పల్లపు వెంకటేష్, దుబ్బాక రామచందర్, కొక్కెరపాటి పుల్లయ్య పాల్గొన్నారు.



## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ కల్పించాలని వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ కల్పించాలని కోరుతూ సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన కోసం కృషి చేస్తున్న అఖిలపక్ష నాయకులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధి, ఆధునిక రవాణా సౌకర్యాల విస్తరణ, ప్రజలకు వేగవంతమైన ప్రయాణ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావల్సిన అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సూర్యాపేట రాష్ట్రంలో భౌగోళికంగా, వాణిజ్యపరంగా ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, ఇక్కడ బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ ఏర్పడితే హైదరాబాద్ తోపాటు ఇతర ప్రధాన నగరాలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు. దీనివల్ల వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఊతం లభించడంతోపాటు పెట్టుబడులకు అవకాశాలు పెరిగి, యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెంకన్న నాయక్, పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్, జెఏసి కన్వీనర్ ప్రొఫెసర్ జానకిరాంరెడ్డి, తండు శ్రీనివాస్, రమణాచారి, చల్లమల్ల నరసింహ, బూర వెంకటేశ్వర్లు, వనితక్క, డేవిడ్ కుమార్, భూపతి రాములు, నేరెళ్ళ మధు గౌడ్, అనంతుల మధు, అఖిల్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక, దేశీయ మద్యం పట్టివేత



**ప్రజాపక్షం/దేవరకొండ :** నాటు సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం 1,830కేజీలు, పటిక 160 కేజీలు, 5 లీటర్ల దేశీయ మద్యాన్ని ఆదివారం దేవరకొండ పట్టణ శివారులోని మైనంపల్లి గేటు వద్ద హైదరాబాద్ పిఅండ్ ఈఐ, ఎస్‌టిఎఫ్ విభాగాలకు చెందిన బృందం గణపతి రెడ్డి నేతృత్వంలో రోడ్డుకు కుడివైపున కొన్ని వాహనాలు ఆగిఉండడాన్ని గమనించి అక్కడికి వెళ్ళి పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు ఒక వాహనం నుండి మరోక వాహనంలోకి బస్తాలను మారుస్తూ కనిపించడంతో వారిని విచారించగా నాటు సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక, దేశీయ మద్యం ఉండడంతో నిందితులు గుండ్లపల్లి మండలం పరిధిలోని పెద్దతండాకు చెందిన కాట్రావత్ రాజు, డాక్య తండాకు చెందిన వడ్త్య అశోక్, ఫలక్‌నూమాకు చెందిన మహమ్మద్ ఇనయతుల్లాలను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి మారుతి స్విఫ్ట్ డిజైర్ టిఎస్05ఈయం 8611, అశోక్ లేలాండ్ టిఎస్ 12యూ 2890, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సిఐ తెలిపారు

## సామాజిక ప్రగతికి ఐక్యతే మూలస్తంభం

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో బలహీన వర్గాల హక్కుల సాధనకు, ఆత్మగౌరవ ప్రగతికి ఐకమత్యమే మూలస్తంభమని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ తెలిపారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో నూతనంగా నిర్మించిన పెరిక సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ సామాజిక వికాసానికి, ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడానికి సంఘ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పేద వర్గాల అభ్యున్నతికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇటువంటి భవనాలు సంక్షేమ కేంద్రాలుగా నిలవాలని ఆకాంక్షించారు. నూతన భవనాన్ని అందుబాటులోకి తెచ్చుకున్న పెరిక సంఘం నాయకులకు, ప్రతినిధులకు, సభ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ఉంటూ హక్కుల పరిరక్షణతో పాటు ప్రాంతీయ వికాసానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, పుట్టపాక శీను, పెరిక సంఘం బాధ్యులు, ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## అనంతలక్ష్మి మృతి బాధాకరం





**ప్రజాపక్షం/చింతపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపిటిసి వింజమూరు అనంతలక్ష్మి మృతి బాధాకరమని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని తన సొంత గ్రామమైన పికెమల్లేపల్లిలో అనంతలక్ష్మి ఆదివారం కన్నుమూశారు. మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావుతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి అనంతలక్ష్మి పార్థీవదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సిపిఐ శ్రేణులు మృతదేహంపై ఎర్రజెండాను కప్పి అమరవీరులకు జోహార్లంటూ నినదించారు. అనంతరం మృతురాలి కుటుంబానికి వారు ప్రగాఢ సానుబూతిని తెలిపి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. కాగా మృతురాలి భర్త వింజమూరి సీతారామాచారి సిపిఐ పార్టీకి విశేష సేవలు అందించి గతంలో కన్నుమూశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, వేముల బుచ్చయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మిడిదొడ్డి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శంశొద్దీన్, ఆ గ్రామ సిపిఐ కార్యదర్శి అయితపాక సైదులు, జితేంద్ర, వెంకటయ్య, గోపాల్, భిక్షమయ్య, పర్వతాలు తదితరులు ఉన్నారు.

# అక్రమ మిల్లర్లకు అధికారులే అండ!

### కిందిస్థాయి ఉద్యోగులపైనే వేటు






**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లా పౌరసరఫరాల శాఖలో అవినీతి కంపు కొడుతుంది. అక్రమాలను అరికట్టి ధాన్యాన్ని పక్కదోవ పట్టించిన మిల్లర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అక్రమ మిల్లర్లకు అండగా నిలుస్తున్నారు. అధికారులపై ఆరోపణలు వచ్చినప్పుడు ఉన్నతస్థాయి అధికారులు విచారణ పేరుతో కిందిస్థాయి ఉద్యోగులపైనే వేటువేస్తూ పై స్థాయి అధికారులను వదిలేస్తున్న పరిస్థితులు ఉన్నాయి.

రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ప్రభుత్వం సిఎంఆర్ (కస్టమ్స్ మిల్లింగ్ రైస్) కోసం జిల్లాలోని మిల్లర్లకు స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు కేటాయించడం జరిగింది. గత 2022 నుండి నేటి వరకు అనేక మంది మిల్లర్లు ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా మొండికేశారు. మరికొంతమంది ధాన్యాన్ని పక్కదోవ పట్టించి సొమ్ము చేసుకోగా వారిపై కేసులు నమోదు చేసి మిల్లులను కూడా సీజ్ చేశారు. సిఎంఆర్ బకాయిల్లో సూర్యాపేట మిల్లర్లు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండడంతో సిఎం రేవంత్ రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో వరుస దాడులు చేయించారు. దీనితో దాదాపు 20కు పైగా మిల్లుల్లో ప్రభుత్వం కేటాయించిన ధాన్యం లేకపోవడంతో మిల్లులను సీజ్ చేసి, మిల్లర్లపై కేసులు పెట్టడంతో జైలులో ఊసలు లెక్కబెట్టారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు అక్రమ మిల్లర్లకు అండదండగా నిలువడం తోనే వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లకు కేటాయించిన ధాన్యం నిల్వ ఉందా లేదా అనే వివరాలను సేకరించేందుకు అధికారులు ప్రతినెలా సదరు మిల్లులను విజిట్ చేసి రాష్ట్ర స్థాయిలో ఉన్న అధికారులకు నివేదిక అందించాల్సి ఉంది. కానీ అవేమి పట్టించుకోకుండా తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ వ్యవహారంలో మిల్లర్ల నుండి కొంతమంది అధికారులకు పెద్దఎత్తున ముడుపులు ముట్టినట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అధికారుల అండతో...!**

జిల్లాలోని కొంతమంది అక్రమ మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు అండగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లు ఇచ్చే ముడుపులకు ఆశపడి తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలను తొక్కిపడుతున్నట్లు సమాచారం. కోదాడ, మేళ్ళచెరువు, హుజూర్‌నగర్, గరిడేపల్లి, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, సూర్యాపేట రూరల్ మండలాల పరిధిలో ఉన్న కొన్ని మిల్లుల్లో కోట్లాది రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లర్లు పక్కదోవ పట్టించినట్లుగా అధికారుల తనిఖీల్లో తేలినా వాటిని బయటపెట్టకుండా తొక్కిపట్టినట్లు తెలిసింది. తనిఖీలకు వచ్చినా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కూడా ఏమార్చి ధాన్యం మిల్లుల్లో స్టాక్ లేకున్నా ఉన్నట్లు లెక్కల్లో చూపించడం, తమకు గిట్టని మిల్లుల్లో అక్రమాలు బయటపడితే తక్షణమే కేసులు నమోదు చేసి మిల్లులను సీజ్ చేయడం జరిగింది. సీజ్ చేసిన ధాన్యాన్ని కొంత మంది అక్రమ మిల్లర్లు అధికారుల అండతో రాత్రికి రాత్రే పక్కదోవ పట్టించినట్లు ఆరోపణలు లేకపోలేదు.

**కిందిస్థాయి ఉద్యోగులపైనే వేటు...**

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన మిల్లులు తనిఖీల్లో కొన్ని అక్రమాలు వెలుగుచూశాయి. కోట్లాది రూపాయల ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లర్లు పక్కదోవ పట్టించారని లెక్కలు తేల్చారు. ఇంతవరకు బాగానే ఉన్న కొంతమంది మిల్లర్లపై ఉన్న ప్రేమతో కొంతమేరకే ధాన్యం లేదంటూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీనిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఓ బిజెపి నాయకుడు వేల కోట్ల రూపాయల ధాన్యం పక్కదారి పట్టగా కొంత మేరకే బయటికి వెల్లడించారని ఇందులో అధికారులు తేల్చి జేబులు నింపుకున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంతో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విచారణకు ఆదేశించగా పౌరసరఫరాల శాఖ అధికారులు తిరిగి సదరు మిల్లును తనిఖీ చేయగా అసలు బండారం బయటపడింది. దీనితో జిల్లా కలెక్టర్ గత మూడు రోజుల క్రితం ఓ డిప్యూటి తహశీల్దార్‌ను కమిషనరేట్‌కు అటాచ్ చేయగా, టెక్నికల్ అసిస్టెంట్‌ను ఉద్యోగం నుంచి టర్మినేట్ చేయాలంటూ సివిల్ సప్లై కమీషనర్‌కు లేఖ రాయడం గమనార్హం. ఈ ఇరువురి ఉద్యోగులపైనే వేటు పడడం ఏంటని అధికారులకు కూడా బాధ్యత ఉంది కదా వారిపై కూడా శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదని కిందిస్థాయి ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లు తనిఖీకి వెళ్ళినప్పుడు వారు కూడా తమతో పాటే ఉన్నారు కదా వారు బాధ్యులు కారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదిలాఉంటే జిల్లాలోని రెండు, మూడు మిల్లుల్లో అధికారులు తనిఖీలు చేసి ధాన్యం పక్కదారి పట్టినట్లుగా తేల్చినప్పటికి సదరు మిల్లర్లపై చర్యలు తీసుకోకుండా తొక్కిపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రస్థాయి పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ మిల్లర్లకు అండగా నిలుస్తున్న కొందరి అధికారులపై చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



## పిఆర్‌సి వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ కమిషన్‌ను వెంటనే అమ లు చేయాలని టిఎస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నేరేడుచర్లలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండల మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. 2024 తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 రోజుల్లో పెండింగ్ డిఎలన్ని ఇస్తామని, పిఆర్‌సి అమ లు చేస్తామని, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, నేటి వరకు హామీలు నెరవేరలేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన నాలుగు కరువు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, కొత్త బడులు ఏర్పాటు చేసే బదులు ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు మధ్యాహ్న భోజన రేట్లు పెంచాలని, పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.బాలసైదిరెడ్డి, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ సాంబయ్య, నేరేడుచర్ల మండల కమిటి అధ్యక్షులు ఆర్.శ్రీనయ్య, అక్కయ్యబాబు, నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింహారావు, బి.వెంకటనర్సయ్య, రవీందర్‌రెడ్డి, వై.రామానుజం, ఎండి మజీదాబేగం, సైదమ్మ, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయంతోనే అన్నదాత అభ్యున్నతి

రాష్ట్రానికి ఆదర్శంగా కట్టంగూర్ ఎఫ్‌పిఒ

ఎఫ్‌పిఒను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దే యోచన

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి,ఎపిసి కె. సురేంద్ర మోహన్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,వ్యవసాయ యాంత్రీకరణ, ఆహార శుద్ధి, రైతులకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందించడం ద్వారా అన్నదాతల అభ్యున్నతి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్ కె.సురేంద్ర మోహన్ అన్నారు.ఆదివారం గంగాదేవిగూడెంలోని కట్టంగూర్ ఎఫ్‌పీఓను సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయిల్‌పామ్ కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ప్రారంభించి, సంస్థలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. బయోచార్ తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. స్వచ్ఛ శక్తి బ్యాటరీ వ్యవస్థను ప్రారంభించారు. సహకార శాఖ,ఎన్‌డీసీసీబీ సహకారంతో పది మంది మహిళలకు బ్యాటరీ వాహనాలను పంపిణీ చేశారు.రైతులకు అవసరమైన యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సాగు పనులు సులభతరమవుతాయని,పెట్టుబడి భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎఫ్‌పీఓ రాష్ట్రంలోని ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. రాష్ట్రంలో ఒక ఎఫ్‌పీఓను అత్యుత్తమ కేంద్రంగా (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) తీర్చిదిద్దే ఆలోచన ఉందని, భవిష్యత్తులో కట్టంగూర్ ఎఫ్‌పీఓను ఆ స్థాయికి తీసుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. కట్టంగూర్ సంస్థ అందిస్తున్న సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాంమాజీ శాసనసభ్యులు నంద్యాల నర్సింహారెడ్డి,నాబార్డు డీజీఎం ఎం.వినయ్ కుమార్, కట్టంగూర్ ఎఫ్‌పీఓ చైర్మన్ చౌగోని సైదమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్,జిల్లా ఉద్యాన అధికారి టి.శేఖర్,జిల్లా సహకార అధికారి షాలిని, తహసీల్దార్ పుష్పలత, సీఈఓ ఆర్.శంకర్ రావు,రావుల విద్యాసాగర్,పిండిప్రోలు వెంకట్, శ్వేత, ప్రవీణ్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

# నవంబర్ 1న ‘ఓట్ బచావో’-‘దేశ్ బచావో’ సభ




విజయవంతం చేయాలని ఎఐసిసి పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే ఓట్ బచావో దేశ్ బచావో సభను విజయవంతం చేయాలని ఎఐసిసి పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఓట్ బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి పార్టీలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు వందేళ్ల క్రితం నాటి సైమన్ కమీషన్‌తో ప్రస్తుత పరిస్థితులను పోలుస్తూ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరగాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని, సుప్రీంకోర్టు ఈ అంశంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, వడ్డెర కార్పోరేషన్ చైర్మన్ గుంజ రేణుక, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్నలతోపాటు వార్డు కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## వచ్చింది ఎల్ నినో కరువు కాదు... కాంగ్రెస్ తెచ్చిన కరువు

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ ,ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి బిఆర్ ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి , సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చండూరు మున్సిపల్ పట్టణంలోని రాజశ్రీ బ్యాంకేటాల్ లో మునుగోడు నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియకు కావలసిన పత్రాలు, దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నాయకులు ,కార్యకర్తలు బాధ్యతలు తీసుకొని ఓటరు నమోదు చేయించాలని తెలిపారు. రాష్ట్రంలో వచ్చింది ఎల్‌నినో కరువు కాదని ఇది కాంగ్రెస్ కరువు అని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవిగౌడ్ , బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వెంకటనారాయణ గౌడ్ ,పాల్వాయి స్రవంతి, మునగాల నారాయణరావు, గుర్రం వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు తోకల వెంకన్న, పల్లె కళ్యాణిరవిగౌడ్ పాల్గొన్నారు.



## బాల సాహిత్యంతోనే మనోవికాసం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బాల సాహిత్యం మనోవికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని ప్రముఖ కథా రచయిత, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మేరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు.సిద్దిపేటకు చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ రచించిన తాత మనవరాళ్లు ,భల్లూకం తాత బాలల కథల పుస్తకాలను ఆయన నల్లగొండలోని అల్ మదీనా బీఈడీ కళాశాలలో ఆవిష్కరించారు.సృజన సాహితీ ఆధ్వర్యంలో పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యాదగిరి రెడ్డి మాట్లాడుతూ బాలల్లో నైతిక విలువలు పెంపొందించడానికి, సృజనాత్మకతను వెలికితీయడానికి, ఆలోచనా ఆసక్తిని వికసింపజేయడానికి బాల సాహిత్యం చదివించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,బాల సాహితీవేత్త, ప్రముఖ కార్టూనిస్ట్ వడ్డేపల్లి వెంకటేష్,సృజన సాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య,బాల సాహితీ మిత్ర డాక్టర్ పొట్ట బత్తుల రామకృష్ణ,డాక్టర్ చింతోజు మల్లికార్జునాచారి,మాదగాని శంకరయ్య, సిలివేరు లింగమూర్తి,గంటెకంపు గణేష్,అట్ల చంద్రశేఖర్,బరిగల శ్రవణ్ కుమార్,సూక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలే ఫౌండేషన్ లక్ష్యం



**ప్రజాపక్షం/మోతె :** గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు పెద్ద ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలను అందించడమే ఆచార్య ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం మండలంలోని సిరికొండ గ్రామంలో ఆచార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిభిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు. రోగ నిర్ధారణ అనంతరం హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. సుమారు 80 మందిని పరిశీలించగా 50 మందిని హైదరాబాద్ కామినేనికి వివిధ సమస్యలతో ఉన్న రోగులను పంపించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అమ్రిన్ మీర్జా, డాక్టర్ శంకర్ నాయక్, నేత్ర వైద్య నిపుణురాలు తేజశ్రీ, జిల్లా సీనియర్ సిటిజన్స్ కన్వీనర్ దామెడి గోపాల్ రెడ్డి, బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర సీనియర్ నాయకులు షకీల్ మీర్జా, జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షులు కట్టుకోజు నాగేంద్రాచారి, జిల్లా ప్రవాసి కన్వీనర్ జనార్ధన్, కార్యదర్శి బానోతు శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ధరల పట్టిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** పట్టణ టెంట్ హౌస్ యాజమానుల అసోసియేషన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో నూతన ధరల పట్టిక ను ఆదివారం నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రెసిడెంట్ ఎడ్ల నర్సింహ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలు దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని వినియోగదారులు గమనించి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ గురిజ వెంకన్న,కోశాధికారి జేడీ విజయ్ కుమార్,ఉపాధ్యక్షుడు జోసెఫ్,మెంబర్ సంపత్ కుమార్,శ్రీనివాస్ రెడ్డి, రమేష్ అశోక్,వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఎల్లయ్య, పాల్గొన్నారు.



# యాసంగి సాగుపై సందిగ్ధంలో అన్నదాత

### నాణ్యమైన కరెంట్ తోనే జల వినియోగం



**ప్రజాపక్షం/హనుమకొండ :** యాసంగి సాగుపై అన్నదాతలు సందిగ్ధంలో పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ నుంచే యాసంగి సీజన్ ప్రారంభమైంది. అయితే వచ్చే జులై వరకు ఎల్ నినో కొనసాగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం కూడా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నది. మరో పక్క సాగుకు ప్రధాన ఆధారమైన ప్రాజెక్టుల్లోకి నీరు చేరనందున యాసంగిలో పంటలకు నీరు విడుదల చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచిస్తోంది. ఈ నేపథ్యంలో యాసంగి సీజన్ లోనూ అన్నదాతలకు అవస్థలు తప్పక పోవచ్చుననిపిస్తోంది. ప్రస్తుతం వానా కాలం పంటలు చేతికొచ్చే దశలో ఉండటంతో, రైతులకు ఒక వైపు దిగుబడుల ఆందోళన, మరో వైపు యాసంగి సాగుపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే 2026–27 యాసంగి సీజన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులకు సాగునీటి కొరత, భూగర్భ జలాలు పడిపోవడం, విద్యుత్ సమస్యలు ప్రధాన సవాళ్లుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా వరి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఈ వానాకాలం సీజన్లో ఉమ్మడి జిల్లా పరిధిలో సాధారణం కంటే సగటున 21.5 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ పరి స్థితి వానాకాలం పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. యాసంగిలో కూడా నీటి సరఫరా లేక పోతే పంటల దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. వర్షాభావంతో పత్తి దిగుబడిపై కూడా ప్రభావం పడనున్నది. నేలలో తేమ తగ్గడం, తెగుళ్లు, చీడపీడల కారణంగా ఇబ్బందులు ఎదురుకావచ్చు.

**ఆదుకునేందుకు సహాయక చర్యలు:** యాసంగిలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే సహాయక చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. ఆరుతడి పంటలకు విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై సరఫరా చేయాలని, ఇందు వల్ల ఉమ్మడి జిల్లా రైతులపై రూ.170 కోట్ల వరకు ఆర్థిక భారం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు రూ.22 కోట్ల యాంత్రీకరణ నిధులను వెంటనే విడుదల చేసి రాయితీపై పరికరాలను సరఫరా చేయాలని కోరుతున్నారు. రూ.100 కోట్లతో బిందు, తుంపర సేద్య పరికరాలు ఇవ్వాలని, విత్తనోత్పత్తి పంట సాగుపై కంపెనీలతో రైతులు ముందస్తు రాతపూర్వక ఒప్పందాలను అధికారుల సమక్షంలోనే నిర్వహించాలని, ప్రస్తుతం అయిల్పామ్ సాగుకు అదను ఉన్నందున దరఖాస్తు చేసుకున్న రైతుల క్షేత్రాల్లో మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో యాసంగిలో రూ.3198 కోట్ల లక్ష్యం మేరకు పంట రుణాలు మంజూరు చేయాలని, రైతులకు రావలసిన రూ.230 కోట్ల పావలా వడ్డీ రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని, పంటల బీమా అమలుతో పాటు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు. చెరువులు, కుంటల్లోని నీరు వేగంగా అడుగంటే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సగటు భూగర్భ జలమట్టాలు 6.20 మీటర్లకు పడిపోయాయి. నవంబర్‌లో 7.40 మీటర్లకు పడిపోయే అవకాశం ఉన్నట్టు భూగర్భజల నిపుణులు అంచనా వేస్తున్నారు.

**యాసంగిలో విస్తీర్ణం 16.20 లక్షల ఎకరాలు:** ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 16.20 లక్షల ఎకరాలు కాగా, ఈ వానా కాలం సీజన్ లో సాగు విస్తీర్ణం 70 శాతంలోపే పరిమితమైంది. 12.20 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలు వేయగా వరి విస్తీర్ణం 6.30 లక్షల ఎకరాల్లో వేశారు. సాధారణ విస్తీర్ణంకన్నా 3 లక్షల ఎకరాలు తగ్గింది. యాసంగిలో సాధారణ సాగు 14 లక్షల ఎకరాలు కాగా, అన్ని రకాల పంటలు కలిపి 10 లక్షల ఎకరాల్లో వేస్తారని అంచనా. ఇందులో 5.30 లక్షల ఎకరాల్లో పంటలకు బావులు, బోర్లే ఆధారమైనందున కనీసం రోజుకు 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తేనే రైతులు ఈ గడ్డుపరిస్థితుల నుంచి గట్టెక్కేది.

## ఎల్ నినో ప్రభావంపై బిఆర్ఎస్ ప్రచారాన్ని నమ్మొవద్దు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ తో కలిసి హన్మకొండ డిసిసి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అధికారంలో ఉన్నది ఎవరు? నిర్మాణ నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? నేడు బ్యారేజీల పరిస్థితిపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు బిఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టును తమ ఘనతగా ప్రచారం చేసుకున్న బిఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు అదే ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు తమ పదేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులను ఆందోళనకు గురిచేసేలా బిఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు సూచించారు. ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా రైతులకు ఉపయోగపడే నిర్మాణాత్మక సూచనలు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గమనించాలని కోరారు.

## రోడ్డు ప్రమాద బాధితులు 'పిఎం రహత్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సిపి ఎన్.శ్వేత



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పిఎం రహత్ పథకాన్ని అర్హులైన బాధితులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపిఎస్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో మొత్తం 63 ఎంప్యానెల్డ్ ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5 లక్షల వరకు గరిష్ఠంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయాలని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆసుపత్రికి తరలించేలా సహకరించాలని, పథకం కింద వైద్య సేవలు పొందేందుకు ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి, అవసరమైన వివరాలను అందించాలని, ప్రమాద బాధితులకు సహాయం చేయడంలో మానవతా దృక్పథంతో వ్యవహరించి, పోలీసులకు వైద్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, ప్రజలు పీ.ఎం.రహత్ పథకంపై అవగాహన పెంపొందించుకుని అర్హులైన బాధితులకు ఈ పథకం ప్రయోజనాలు అందేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## సర్వోత్తమ్ రెడ్డి గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/ఆత్మకూరు:** సర్వోత్తమ్‌రెడ్డి గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. రాబోయే వరంగల్ ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సన్నాహక సమావేశం ఆగ్రంపహాడ్ లోని జిఆర్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సభ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ శంకర్ నాయక్, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ డిసిసి అధ్యక్షులు ఎండి అయ్యూబ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు నమోదు చేసుకునేలా నాయకులు చొరవ చూపాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో పరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్, నియోజకవర్గంలోని వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

## హంటర్ రోడ్డులో ఘోర ప్రమాదం

### రియల్ఎస్టేట్ వ్యాపారి మృతి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నగరంలోని హంటర్ రోడ్డులో తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉర్సు ప్రాంతానికి చెందిన రియలెస్టేట్ వ్యాపారి ఆవునూరి రాజు (57) మృతి చెందారు. లారీ, ద్విచక్రవాహనం ఢీ కొనడంతో రాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఉర్సు ప్రాంతంలో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మీ–సేవా నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి: బైరా శంకర్

**ప్రజాపక్షం/వరంగల్ :** మీ–సేవా నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షులు బైరా శంకర్ అన్నారు. తెలంగాణ మీ–సేవా ఫెడరేషన్ (టిజిఎంఎఫ్) వరంగల్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్బాంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా మీ–సేవా నిర్వాహకుల సమస్యలు, కమీషన్లు, కొత్త సేవలు, ఆరోగ్య బీమా, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు, విఎల్ఇల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, రాష్ట్రంలోని ప్రతి మీ–సేవా నిర్వాహకుడు ఐక్యంగా ముందుకు రావాలని, విఎల్ఇల హక్కుల సాధన, కుటుంబాల భద్రత, వృత్తి గౌరవం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విఎల్ఇల సమస్యల పరిష్కారం, సంక్షేమం, ఆర్థిక భద్రత సాధించే వరకు టిజిఎంఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ మోహీద్, జిల్లా అధ్యక్షులు సామల రాకేష్, జిల్లా ఉపాధ్యక్షులు సాజిద్, లావణ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కూచన సంతోష్ కుమార్, జిల్లా కోశాధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వసతి గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/ నర్సంపేట:** నర్సంపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన గిరిజన బాలికల వసతి గృహాన్ని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారదతో కలిసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా గదులు సరిపోకపోవడాన్ని గుర్తించి, వారి సౌకర్యార్థం రూ.2 కోట్ల వ్యయంతో నూతన వసతి గృహాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం గిరిజన బాలికల వసతి గృహంలో సుమారు 300 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి సరిపడా వసతి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో నూతన భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ వసతి గృహం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యాలు లభిస్తాయని, వారు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మి రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాలాయి శ్రీనివాస్, రావుల హరీష్ రెడ్డి, మున్సిపాలిటి వైస్ చైర్మన్ గంధం నరేందర్, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్యనాయకులు సంబంధిత అధికారులు, గిరిజనులు సంక్షేమ శాఖ అధికారులు, పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే కన్నెపల్లి సందర్శన

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** కరువు పరిస్థితులను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సరి కాదని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను బిఆర్ఎస్ నాయకులు మానుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ ప్రయోజనాల కోసమే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించారని విమర్శించారు. కరువు నివారణకు రాజకీయాలకు అతీతంగా అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు చేల్సిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని, అందుకు బాధ్యత వహిస్తూ అప్పటి పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు అందలేదని ఆరోపించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు కూడా వారికి మద్దతుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలు ఎండిపోకుండా రైతులకు అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. అవసరమైతే అదనపు విద్యుత్ కొనుగోలు చేసైనా రైతులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, ప్రజలకు తాగు నీరు, పశువులకు నీరు అందించే చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ సమావేశంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, రెడ్ క్రాస్ చైర్మన్ చల్లూరి మధు, మాజీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావతి దేవన్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, కౌన్సిలర్లు బొడ్డు అశోక్, మూత సహదేవ్, అరుణ్ రావు, ధరావత్ శారద, కాంగ్రెస్ పార్టీ నాయకులు క్యాథరాజు సాంబమూర్తి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ అగ్నిప్రమాదం... రెండు షాపులు దగ్ధం

### రూ.80 లక్షల మేర ఆస్తి నష్టం



**ప్రజాపక్షం/నర్సంపేట:** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు షాపులు ధ్వంసమైన సంఘటన నర్సంపేట పట్టణంలోని నెహ్రూ సెంటర్‌లో తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట పట్టణంలోని నెహ్రూ పార్క్ సెంటర్ వద్ద హాక ఫార్మర్స్ సర్వీస్ సెంటర్ ( ఫర్టిలైజర్) షాపులో తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తు మంటలు లేచాయి. దీంతో పక్కనే ఉన్న శ్రీలక్ష్మి ఆటోమొబైల్స్‌కు ఈ మంటలు వ్యాప్తిచెందండంతో రెండు షాపులు దగ్ధమయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు,ఫైర్ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకోని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అప్పటి సుమారు రెండుషాపుల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.80 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న నర్సంపేట పట్టణ బిఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత వ్యాపారులను పరామర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్లు బానోత్ నవీన్ నాయక్, కీర్తి దుశ్వంత్ రెడ్డి, బూస శిరీష రాజులు మాట్లాడుతూ గత నెల రోజులుగా నర్సంపేట పట్టణంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, విద్యుత్ కోతలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థపై సంబంధిత అధికారులు తగిన పర్యవేక్షణ చేపట్టాలని, ప్రస్తుత అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అగ్నిప్రమాదంలో వ్యాపారులు భారీగా నష్టపోయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, బాధితులను పరామర్శించకపోవడంపై బిఆర్ఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## మానుకోట ప్రభుత్వ క్లబ్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

### క్లబ్ చరిత్రను వివరించిన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ నడిబొడ్డున 33 వ వార్డు పరిధిలో ఉన్న మహబూబాబాద్ ప్రభుత్వ క్లబ్ 1932ను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సిపిఐ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా దీర్ఘ కాలంగా వివిధ రూపాల్లో సాగిస్తున్న పోరాటాల నేపథ్యంలో మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ బి వినోద్‌కుమార్‌కి పలు సందర్భాల్లో వినతి పత్రాలు ఇవ్వటం కాకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రశ్నించడం ద్వారా కమీషనర్ స్పందించి ఆదివారం ప్రభుత్వ క్లబ్‌ను సిపిఐ బృందంతో కలిసి పరిశీలించారు. అక్కడ 1932 లో మహబూబాబాద్ క్లబ్ పేరుతో అప్పటి వరంగల్ కలెక్టర్ బాసిత్ అలీ పేరుతో ఏర్పాటు చేసిన ఆ భవనంలో ఉన్న ఫౌండేషన్ స్టోన్ శిలాఫలకానికి సంబంధించిన మున్సిపల్ రికార్డులో ఉన్న ఆధారాలను వివరించి చూపించారు. ప్రధాన రోడ్డు వైపు మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్ అదేవిధంగా విశాలమైన సుమారు ఎకరంన్నర పైగా ఉన్న స్థలంలో బహుళ ప్రజా ప్రయోజనంగా జిల్లా కేంద్రానికి తలమానికంగా ఉండే ఐకాన్ నిర్మాణాన్ని చేపట్టవచ్చని అజయ్‌సారథిరెడ్డి కమీషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్ అన్ని పరిశీలించిన మిగతా అందరితో చర్చించి తగిన అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పరిశీలన వచ్చిన సిపిఐ బృందం, తదితరులకు తెలిపారు.

**కొత్త నాన్ వెజ్ మాంసాహార మార్కెట్ వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు:** మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్థానిక కౌన్సిలర్ అజయ్‌సారథి రెడ్డి మహబూబాబాద్ మున్సిపాలిటీ 33వ వార్డు పరిధిలో ఉన్న కొత్త సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్లోకి పరిసర ప్రాంతాల్లో ఉన్న మటన్ చికెన్ షాపులను మటన్ మార్కెట్లోకి తరలించేందుకు సంబంధించిన మటన్ చికెన్ షాప్‌లో యజమాలతో కలిసి విషయాలపై తరలింపు చర్యల మీద పరిశీలించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎండి యూసఫ్, యాకన్న, గిసా గాని కుమార్, చీకటి తిరుమలేష్, వెంకట్రావు, కవిత, నీలం వెంకటేశ్వర్లు, యూసుఫ్, బిక్కి సాయి, కుమార్, రమేష్, రాంబాబు, వినయ్, లతీఫ్, సత్యమూర్తి, అప్సర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆయుష్ మిషన్ పోస్టుల భర్తీ పరీక్ష ప్రశాంతం



**ప్రజాపక్షం/జనగామ:** జాతీయ ఆయుష్ మిషన్ పరిధిలో ఆయుష్ ప్రజారోగ్య కార్యక్రమాల అమలులో భాగంగా జిల్లాలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఐదు కేటగిరిల్లో నిర్వహించిన 8 పోస్టుల భర్తి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో రాత పరీక్షను పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించారు. 8 పోస్టులకు 229 మంది ధరఖాస్తు చేసుకోగా 208 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజర్ అయ్యారు. ఆయుష్ వైద్యాధికారి పోస్టులు మూడు ఉండగా 63 మంది ధరఖాస్తు చేసుకోగా 47 మంది పరీక్షలు రాశారు. 16 మంది గైర్హాజర్ అయ్యారు. ఫార్మాసిస్ట్ పోస్టు ఒకటి ఉండగా 39 మంది ధరఖాస్తు చేసుకొని 39 మంది పరీక్షలు రాశారు. మానసిక సామాజిక సలహాదారు పోస్టు ఒకటి కాగా 7 గురు ధరఖాస్తు చేసకొని ఏడుగురు పరీక్ష రాశారు. యోగా నిపుణుల పోస్టు ఒకటి కాగా ఐదుగురు ధరఖాస్తు చేసుకొని ఐదుగురు పరీక్ష రాశారు. బహుళ ప్రయోజన సిబ్బంది ఫోస్టులు రెండు కాగా 115 మంది ధరఖాస్తు చేసుకొని 110 మంది పరీక్షలు రాశారు. అభ్యర్థులకు మౌకిక పరీక్షలు నిర్వహించి 52 మందిని ఇంటర్వ్యూలకు పిలిచారు. ఇంటర్వ్యూకు జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించగా జిల్లా ఉపాధి కల్పన అధికారి సభ్యులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, ఉపాధి కల్పన అధికారి కుమారస్వామి, డాక్టర్ మమత, ఎస్ సుధాకర్ పాల్గొన్నారు.

## రైస్‌మిల్ ఎన్నికల్లో 'హైడ్రామా'!

### అరెస్టులు.. నామినేషన్ ఉపసంహరణ
### సతీష్ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు ఆదివారం నాటకీయ పరిణామాల మధ్య ముగిశాయి. ఉదయం అరెస్టులు.. మధ్యాహ్నం పోలీసుల కదలికలు.. నామినేషన్ ఉపసంహరణ.. చివరకు ఏకగ్రీవ ఎన్నికతో ఉత్కంఠకు తెరపడింది. అధ్యక్షుడిగా కాట్రగడ్డ సతీష్ ఎన్నిక కావడంతో కొందరు కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోవడం రాజకీయ చర్చకు దారితీసింది. గతంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగిన బాదం ప్రవీణ్ చుట్టూ చోటు చేసుకున్న పరిణామాలు కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలున్నాయా? అనే ప్రశ్నలను లేవనెత్తాయి.

**ఉదయం అరెస్టులతో కలకలం:** అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల రోజే బాదం ప్రవీణ్‌తో పాటు మరో ఆరుగురు రైస్ మిల్లర్లను సిబిఐ అధికారులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో ఈ పరిణామం చోటు చేసుకోవడంతో మిల్లర్లలో గందరగోళం నెలకొంది. అధ్యక్ష పదవికి పోటీ ఎలా సాగుతుందనే ఉత్కంఠ ఏర్పడింది. అయితే ఈ అరెస్టుల వెనుక రాజకీయ కోణం ఉందంటూ ప్రచారం జరగడం చర్చనీయాంశమైంది. దీనిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

**ఎన్నికల ప్రాంగణానికి ప్రవీణ్.. అపై ఉపసంహరణ** అరెస్టుల అనంతరం మధ్యాహ్న బాదం ప్రవీణ్‌తో పాటు మరికొందరిని పోలీసులు ఎన్నికలు జరిగే ప్రదేశానికి తీసుకొచ్చారు. దీనితో ప్రవీన్ పోటీలో కొనసాగుతారా? అనే ఆసక్తి నెలకొంది. అయితే చివరకు ఆయన తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో అధ్యక్ష పదవికి పోటీ లేకుండా పోయింది. అనంతరం కాట్రగడ్డ సతీష్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత ప్రవీణ్‌ను పోలీసులు తిరిగి స్టేషన్‌కు తీసుకెళ్ళినట్లు తెలిసింది.

**ఏకగ్రీవ ఎన్నికతో సంబరాలు:** సతీష్ ఎన్నిక ప్రకటన వెలువడిన వెంటనే అసోసియేషన్ భవనం ఎదుట కొందరు కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. సాధారణంగా సంఘ ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థి మద్దతుదారులు సంబరాలు చేసుకోవడం సహజమే. అయితే, అదే రోజు ప్రవీణ్ అరెస్టు, నామినేషన్ ఉపసంహరణ చోటు చేసుకోవడంతో ఈ సంబరాలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలో అధ్యక్షుడిగా కొనసాగిన ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు కావడంతో ఈ పరిణామాలపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

**కాంగ్రెస్‌లో విభేదాలున్నాయా?:** ప్రవీన్ పోటీ నుండి తప్పుకోవడం, సతీష్ ఏకగ్రీవ ఎన్నిక అనంతరం కొందరు కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకోవడం పార్టీ అంతర్గత పరిణామాలపై చర్చకు దారితీసింది. తమకు అనుకూలమైన అభ్యర్థిని గెలిపించుకునేందుకు కొందరు నాయకులు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైస్ మిల్లర్లకు ఫోన్లు చేసి తమకు మద్దతున్న అభ్యర్థికి సహకరించాలని కోరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర్య నిర్ధారణ లేదు. ఎన్నికల పరిణామాల వెనుక రాజకీయ జోక్యం ఉందా? లేదా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. మొత్తంగా రైస్‌మిల్ అసోసియేషన్ ఎన్నికలు ములుగు రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
26-10-2026
www.prajapaksham.in

"మైత్రీ మూవీ మేకర్స్ లేటెస్ట్ సూపర్ హిట్ '418'. దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ రూపొందిన ఈ సినిమాతో కీర్తన్ నాదగౌడ దర్శకుడిగా పరిచయం అయ్యారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు."

# రీల్


నిర్మాత రవిశంకర్

## '418'కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్

మైత్రీ మూవీ మేకర్స్ లేటెస్ట్ సూపర్ హిట్ '418'. దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ రూపొందిన ఈ సినిమాతో కీర్తన్ నాదగౌడ దర్శకుడిగా పరిచయం అయ్యారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. చైత్ర ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ కీలక పాత్రల్లో నటించారు అక్టోబర్ 23న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో మైత్రీ నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ '418' సినిమాకు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నిన్నటి కంటే మేము చేసిన ఫస్ట్ హారర్ సినిమా ఇది. మా బ్యానర్‌కు ఇంత మంచి సినిమా చేసి పెట్టిన డైరెక్టర్ కీర్తన్‌కు థాంక్యూ. చాలా యంగ్ టీమ్‌తో చేసిన సినిమా ఇది. ఒక యంగ్ టీమ్‌తో పనిచేసి హిట్ వస్తే ఆ ఆనందం వేరుగా ఉంటుంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ సినిమా మాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది. అందరూ ఈ సినిమాను థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. కీర్తన్ ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ రాసి, సినిమాను అద్భుతంగా చేశాడు. సౌండ్ డిజైన్ .ఈ మధ్యకాలంలో తెలుగులో ఇలాంటి హారర్ సినిమా నేను చూడలేదు.టికెట్ రేట్లు కూడా రీజనబుల్‌గానే ఉన్నాయి. తప్పకుండా మీరందరూ ఈ సినిమాను థియేటర్లలో చూడాలని కోరుకుంటున్నాను.డైరెక్టర్ కీర్తన్ నాదగౌడ, ప్రీతి పగడాల , చరణ్ లక్కరాజు , సౌండ్ డిజైనర్ అనుపమ్, మ్యూజిక్ డైరెక్టర్ వెంకీ జీజీ పాల్గొన్నారు.

## 'రుక్కురుక్కు రుక్మిణి' అంటున్న నితిన్



నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీ కాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మిస్తున్న 'అలియాస్ రుక్మిణి' ఒక విలక్షణమైన కథనంతో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ను కిక్ స్టార్ట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫస్ట్ సింగిల్ 'రుక్కురుక్కు రుక్మిణి' పాటను అక్టోబర్ 27న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫార్మల్ డ్రెస్‌లో నితిన్ కూల్ అండ్ స్టైలిష్‌గా కనిపిస్తే, సంప్రదాయ చీరకట్టులో ఆఫియా సయ్యద్ అందంగా మెరిశారు. హీరో–హీరోయిన్ల లుక్, పోస్టర్‌లోని విజువల్స్ ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రానికి జోమోన్ టి. జాన్ ఐఎస్సి డిఓపి అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్. ఈ చిత్రం డిసెంబర్ 4న విడుదల కానుంది.



## 'రోమియో జూలియట్' సాంగ్ లాంచ్

హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రోమియో జూలియట్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఇటివి విన్ సమర్పిస్తుండగా, నవరస ఎంటర్‌టైనెమెంట్స్ బ్యానర్‌పై సుందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి అంచనాలు క్రియేట్ చేసింది. 'రోమియో జూలియట్' నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సారీ బేబీ సాంగ్ లాంచ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో హర్షిత్ మాట్లాడుతూ. దివాన సినిమాకి అందరూ సపోర్ట్ చేశారు.'రోమియో జూలియట్'కు మా సినిమా గ్లింప్స్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సందర్భంగా ప్రభాస్ గారికి ధన్యవాదాలు. ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం మా అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. భార్గవ్ ఈ కథను చాలా ఎంటర్‌టైనింగ్‌గా ప్రజెంట్ చేశాడు. ఇలాంటి క్యారెకర్‌ను తెలుగు సినిమాలో చూసి ఉండరు అన్నారు. డైరెక్టర్ భార్గవ్ మాచర్ల మాట్లాడుతూ ఇది అందరి బయోపిక్. మనందరి జీవితంలో ఎక్కడో ఒకచోట కనెక్ట్ అయ్యే ఎమోషన్‌ను తీసుకుని సినిమాగా చేయడం జరిగింది. ఇది హిలేరియస్ ఫన్ రైడ్‌లో ఉంటుంది. రిలేషన్‌షిప్స్‌పై సోషల్ సెటైర్‌తో పాటు మంచి డ్రామా కూడా ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నవంబర్ 13న అందరూ థియేటర్లలో ఎంజాయ్ చేస్తారు. ఇటివి విన్ వైస్ ప్రెసిడెంట్ సాయికృష్ణ, ఇటివి విన్ కంటెంట్ హెడ్ భరణ్, హీరోయిన్ విశాఖ ధిమాన్, వైవా హర్ష పాల్గొన్నారు.

## 'శనార్తి' రెగ్యులర్ షూట్ ప్రారంభం



ఆదిత్య మూవీస్ సమర్పణలో సంపత్ నంది టీమ్ వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో రాజ్ వెడ్స్ రాంబాయ్ ఫేమ్ అఖిల్ రాజ్, ఫోక్ క్వీన్ నాగదుర్గ హీరో, హీరోయిన్లుగా రాబోతున్న చిత్రం 'శనార్తి' రెగ్యులర్ షూట్ కరీంనగర్ జిల్లా వెలిచాలలో పూజ కార్యక్రమంతో ఘనంగా మొదలయింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు సంపత్ నంది, ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి, ఇతర నటీనటులు పాల్గొన్నారు. సుమారు నెల పాటు వెలిచాల, గట్టు భూత్కూర్‌లో జరగనుంది. ఈ చిత్ర దర్శకులు గణేష్ రాజ్ ఉప్పునూటి గంగాధర మండలం, గట్టు బూత్కూర్ చెందిన వారు కావడం విశేషం. తెలంగాణ సంప్రదాయ, సాంస్కృతిక మూలాల్ని గుర్తు చేసే ఈ చిత్రం ఒక మరిచిపోలేని మైలురాయిగా నిలవనుంది.రచయితగా, కథకుడిగా, షోరన్నర్‌గా తనకున్న ప్రతిభతో పేరుగాంచిన దర్శకుడు సంపత్ నంది 'ఓదెల' ఫ్రాంచైజీతో సహా విజయవంతమైన కథలు, ఫ్రాంచైజీలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. 'శనార్తి'తో ఆయన అనుబంధం ఈ ప్రాజెక్ట్స్ అంచనాలను పెంచుతోంది. తన విలక్షణమైన సంగీతంతో పుశంసలు పొందిన సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతపరంగా మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. ఈ చిత్రానికి విశ్వనాథ్ రెడ్డి డిఓపి, బేబీ సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్టర్. అఖిల్ రాజ్, నాగ దుర్గ, మురళీధర్ గౌడ్, సునందిని, సుంకర లక్ష్మి , రమేష్ నకిరికంటి, వైవా రెడ్డి, మై విలేజ్‌షో రాజు, అంజిబాబు తడిఆత్రులు నటిస్తున్నారు.



## 'ఆకాశంలో ఒక తార'లో బిజిలీగా రుహానీ శర్మ

దుల్కర్ సల్మాన్ హీరోగా, క్రియేటివ్ డైరెక్టర్ పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న డిఫరెంట్ ఎమోషనల్ డ్రామా 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతుండగా, శ్రుతి హాసన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి మరో ముఖ్యమైన పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. ఈ సినిమాలో బిజిలీగా నటిస్తున్న రుహానీ శర్మ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. కిటికీ పక్కన కూర్చుని కనిపిస్తున్న ఆమె సంప్రదాయ దుస్తుల్లో సింపుల్గా, అందంగా ఆకట్టుకున్నారు. ప్లజెంట్ ప్రెజెంటేషన్‌లో రుహానీ సహజమైన అందంతో మెరిసింది. బిజిలీ పాత్ర సినిమాలో ఎలాంటి మలుపులు తీసుకొస్తుందనే ఆసక్తిని ఈ ఫస్ట్ లుక్ పెంచుతోంది. అనుకోని సమయంలో కథలోకి ప్రవేశించి, అప్పటివరకు సాగుతున్న ప్రయాణానికి కొత్త వెలుగును తీసుకొచ్చే పాత్రగా బిజిలీని మేకర్స్ పరిచయం చేశారు. పెద్ద కలలతో ముందుకు సాగాలనుకునే ఒ పల్లెటూరి అమ్మాయి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. తన కలలను నిజం చేసుకునే ప్రయాణంలో హీరో ఆమెకు అండగా నిలుస్తాడు. ఈ చిత్రానికి సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జివి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్వేత సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని నవంబర్ 20న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## 'మమ్మామియా' పాట విడుదల



రొమాంటిక్ కామెడీ చిత్రం 'ఫీల్ గుడ్' నుంచి 'మమ్మా మియా' పూర్తి పాటను చిత్ర బృందం విడుదల చేసింది. విశ్వరూప ఫిలిమ్స్ బ్యానర్‌పై దయానంద్ కథ, దర్శకత్వంలో సుచిత్ నిర్మాణంలో సుచిత్, అదితి త్రిపాఠి జంటగా నటించిన ఈ పాట ఆకట్టుకునే సంగీతం, మధురమైన గాత్రంతో ప్రేమలోని మాధుర్యాన్ని ఆవిష్కరిస్తోంది. యువతను ఆకట్టుకునే బాణీ, ఉత్సాహభరితమైన పదాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.'వైబ్', 'సింక్', 'ట్రెండ్', 'హైప్' వంటి పదాలతో సాగిపోయే ఈ పాటలో యూత్ఫుల్ ఎనర్జీ కనిపిస్తుంది. లవ్‌లోని సరదా, స్నేహం, ధైర్యం, ఉత్సాహాన్ని ప్రతిబింబించేలా పాటను రూపొందించారు. శాండిల్య పిసపాటి అందించిన మ్యూజిక్, కదలి సత్యనారాయణ సాహిత్యం, తుషార నిలయ, శాండిల్య పిసపాటి పాడిన ఈ పాట నేటి యువత అభిరుచులకు అనుగుణంగా ఫీల్ గుడ్‌గా రూపొందింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న .ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయడానికి చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. 'మమ్మా మియా' పాట విడుదలతో 'ఫీల్ గుడ్' చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతుందని, యూత్ ఆడియన్స్‌కు కనెక్ట్ చేస్తుందని చిత్ర బృందం ఆశిస్తోంది.

## 'కాళేశ్వరం' వైఫల్యానికి
# కెసిఆర్, హరీష్ బాధ్యత వహించాలి

### ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన వైఫల్యాలపై మాజీ సిఎం కెసిఆర్, హరీష్ రావులే బాధ్యత వహించాలని ఫిషర్‌మెన్ కాంగ్రెస్ చైర్మన్ మెట్టు సాయి డిమాండ్ చేశారు. మేడిగడ్డ, కాళేశ్వరం విషయంలో కెసిఆర్‌కు ఎంత బాధ్యత ఉందో హరీష్ రావుకు కూడా అంతే బాధ్యత ఉందని అన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి మేడిగడ్డ బ్యారేజీని కూల్చేశారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డను సందర్శించిన బిఆర్ఎస్ నాయకులు హరీష్‌రావును స్థానికులు నిలదీయాలని సూచించారు. ప్రాజెక్టుల విషయంలో బిఆర్ఎస్ చేసిన తప్పులు ప్రజలకు తెలియాల్సిన అవసరముందన్నారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని



ఆగం చేసిన నాయకులు ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.బిఆర్ఎస్‌లో రెండో స్థానాన్ని దక్కించుకోవడానికి హరీష్ రావు ప్రయత్నిస్తున్నారని, ఎంతగా ప్రయత్నించినా ఆయనకు ఆ స్థానం దక్కదని ఆయన వ్యాఖ్యానించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు వంటి సీనియర్ నాయకులకు పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వాలని అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నాయకుడని గుర్తు చేశారు. అలాంటి నాయకులతో పాటు పద్మారావుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి చేపట్టే అర్హత లేదా? అని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్‌లో వివేకానంద గౌడ్ చేసిన అక్రమాలు చాలా ఉన్నాయని మెట్టు సాయి ఆరోపించారు.

## పోరాటమూ మీదే

(మొదటి పేజీ తరువాయి)

7 రోజులు కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకిత భావాన్ని కొనసాగించాలని కోరారు. 'సేవ్ ది ఓట్, సేవ్ ది కంట్రీ' పేరుతో జన మార్చ్, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు రాహుల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు సహా ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఓటర్ల జాబితాల నుం చి పేర్లను తొలగిస్తున్నారు. నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారు. దీనిని ఏ పరిస్థితుల్లోనూ ప్రజలు మౌనంగా సహించరు. నవంబర్ 1న ఢిల్లీకి పదండి. ఓటును, దేశాన్ని కాపాడుకుందాం. ప్ర జాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు పౌరులు ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఓటు మీది. పోరాటమూ మీదే' అంటూ రాంలీలా మైదాన్, ఢిల్లీ అని పోస్ట్‌లో రాసుకొచ్చారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలపై ఉప్పు చల్లేందుకు నవంబర్ 1వ తేదీనే ఇండియా బ్లాక్ ర్యాలీ నిర్వహించాలని రాహుల్ గాంధీ పట్టుదలతో ఉన్నారని ఆరోపిస్తూ, ఢిల్లీలో జరగబోయే ఇండి యా బ్లాక్ ర్యాలీపై శనివారం బిజెపి కాంగ్రెస్‌పై విరుచుకుపడింది. ప్రతిపక్ష ఇండియా కూటమి నాయకులు అక్టోబర్ 30న సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ అభిశంసన చేపట్టి, ఆయనకు వ్యతిరేకంగా బహిరంగ తీర్పును ప్రకటించనున్నారు. రామలీలా మైదాన్‌కు 'ఢిల్లీ చలో మార్చ్'ను ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన అతిపెద్ద కార్యక్రమంగా కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అభివర్ణించారు.

**మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఎంపిలు**

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో పార్టీ ఎంపిలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సూచనలు చేశారు. అక్టోబర్ 30,31, నవంబర్ 1 తేదీల్లో ఎంపిలంతా ఢిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎంపిలు పాల్గొనేలా కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల అక్రమాలు, ఓట్ల తొలగింపు ను నిరసిస్తూ 30న ఢిల్లీలోని అశోక్ హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించనున్నాయి. రాజ్యాంగబద్ధమైన సిఇసి తీరును ఎండగడుతూ ప్రతీకాత్మకంగా ఈ వేదికగా ప్ర జా అభిశంసన చేపట్టనున్నారు. ఈ మాక్ పార్లమెంట్ ముగిసిన అనంతరం నవంబర్ 1న ఓట్ చోరీకి వ్యతిరేకంగా పదిలక్షల మం దితో రాంలీలా మైదానానికి ఢిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని కాంగ్రెస్ తలపెట్టింది.

## బస్సు కిందకు తోసిన మహిళ

(మొదటి పేజీ తరువాయి)

అసభ్యంగా మాట్లాడుతుండడంతో బస్సును అశ్వాపురం పోలీస్ స్టేషన్ వద్ద ఆపాలని కండక్టర్ డ్రైవర్‌ను కోరింది. ఇలోపు ప్రయాణికురాలు తాను దిగిపోతానంటూ బస్సు ఆపాలని కోరింది. బస్సు ఆగిన తర్వాత దిగండి అని కండక్టర్ చెబుతుండగా కండక్టర్‌ను నెట్టివేసి కిందకు దిగేందుకు ప్రయత్నం చేసింది. కండక్టర్ రోడ్డుపై పడడంతో బస్సు చక్రం ఆమె కాలుపై నుంచి వెళ్లింది. వెంటనే ప్రయాణికులు 108కు ఫోన్ చేసి కండక్టర్ ప్రవళికను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. భద్రాచలం మణుగూరు డిపో మేనేజర్ ప్రవళికను పరామర్శించి మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకున్నారు.

**తీవ్రంగా ఖండించిన ఎంప్లాయీస్ యూనియన్**

కండక్టర్ ప్రవళికపై దాడిని ఎంప్లాయీస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి పరిణామాలు ఎదురు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. విధుల్లో భాగంగా భద్రాచలం వచ్చిన ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఈదురు వెంకన్న ఆసుపత్రిలో ప్రవళికను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని అధికారులను కోరారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు దా డికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కండక్టర్ ప్రవళికను పరామర్శించిన వారిలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు జివిఎస్ నారాయణ, బి. రమణరావు,వెంకన్న, మణుగూరు డిపో కార్యదర్శి పవన్‌కుమార్, మ ధు, మురళీతో పాటు పలువురు ఆమెను పరామర్శించారు. పలు డిపోల వద్ద ఆర్టిసి కార్మికులు ఆందోళన నిర్వహించారు.

**కార్మిక సంఘాలు ఆందోళన**

విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలు దాడి చేయడం అమానుషమని ఎంప్లాయీస్ యూనియన్(ఇయు), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టిఎంయు) నాయకులు తీవ్రంగా ఖండించారు. చిల్లర వివాదంలో కండక్టర్‌ను ప్రయాణికురాలు తోసివేయడంతో ఆమె బస్సు చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడిన ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం, యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్. బాబు, కార్యదర్శి ఈదురు వెంకన్న స్పందిస్తూ ఉద్యోగులకు తగిన భద్రత కల్పించడంతోపాటు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కండక్టర్ ప్రవళిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షుడు పి. కమాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి మౌలానా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. నరేందర్ స్పందిస్తూ ప్రజలకు సేవలందించే కార్మికులకే రక్షణ లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, ఆర్‌టిసి యాజమాన్యాన్ని కోరారు. టిఎంయు జనరల్ సెక్రటరీ థామ స్ రెడ్డి స్పందిస్తూ కండక్టర్, డ్రైవర్లు ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు సేవలందిస్తూ అనేక ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్నారని, అలాంటి ఉద్యోగులపై దాడులు, బెదిరింపులు, తోపులాటలు జరగడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ప్రయాణికులు, ఉద్యోగుల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కరించేందుకు సమర్థవంతమైన ఫిర్యాదు, సహాయక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు.

## కార్పొరేట్ విద్య

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాష్ట్రంలోని 326 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఒకే ప్రాంగణంలో నాలుగు గురుకుల విద్యాసంస్థలకు అవసరమైన భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే చోట విద్యనభ్యసించేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని, రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారుగతంలో కొండగట్టు బస్సు ప్రమాదం, కరోనా వంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు తాము అప్పటి ప్రభుత్వాన్ని నిందించలేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో విద్యారంగానికి భారీ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముందుకు సాగుతున్నారని తెలిపారు. జగిత్యాలలో ఇటీవల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. విద్య, సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా సాగినప్పుడే సమాజంలో సమగ్ర పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు విద్యనందించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.నిర్మాణ పనులను 18 నెలల్లో పూర్తి చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రసన్నాంబ,మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఉన్నారు.

## అటవీ సంరక్షణ

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన ఎకోటూరిజం నిధులు భారీగా పక్కదారి పట్టాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇప్పటికే కొత్త కమిటి అధికారంలో ఉండగా నిధులు డ్రా కోసమే పాత పాలకవర్గం పేరిట దొంగ తీర్మానాలు సృష్టించి అందినకాడికి దండుకున్నారనే సంచలన ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. రికార్డుల్లో నిధుల ఖర్చు కోట్లలో కనిపిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పర్యాటకులకు కనీస వసతులు కరుమై పనులు ఎక్కడికక్కడె ఆగిపోయాయి. పర్యవేక్షించాల్సిన విజిలెన్స్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో మొక్కల పెంపకం హరిత హారం లెక్కలు పర్యాటక అభివృద్ధి నిధులన్నీ కాగితాలకే పరిమితమై అక్కమార్కుల జేబుల్లోకి చేరుతున్నాయి.

**మూగజీవాల పాలిట శాపం.. అటవీ సంపదకు ఎసరు!**

అభయారణ్యంలో రక్షణ కల్పించాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యవైఖరి మూగజీవాల ప్రాణాలకే ముప్పుగా పరిణమిస్తోంది కొత్త గూడ గూడూరు రేంజ్ పరిధిలోని అడవుల్లో రోజు రోజుకూ వన్యప్రాణుల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పడిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అడవిలో సహజ ఆవాసాలు దెబ్బతినడం నిరంతర గస్తి లేకపోవడంతో వేటగాళ్లు స్మగ్లర్లు యథేచ్ఛగా సంచరిస్తున్నారు. అరుదైన వన్యప్రాణులు మాయవుతున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారా? లేక వారే స్వయంగా స్మగ్లర్లతో కుమ్మక్కై సహకరిస్తున్నారా?అన్న బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అడవికి సంబంధించిన అక్రమ రవాణా దొరికిన సందర్భాల్లో సైతం కేసులు నమోదు చేయకుండా లోపాయికారీ ఒప్పందాలతో డబ్బులు తీసుకోని వదిలేస్తున్నారనే తీవ్రమైన అపవాదు స్థానిక అధికారులపై మూటగట్టుకుంది. ఇటీవల కొత్తగూడ మండలంలోని ముస్మీ వద్ద స్వాదీనం చేసుకున్న విలువైన దుంగలను మరుసటి రోజు డిపోకు తరలిస్తామని చెప్పి అడవిలోనే వదిలేయడం రాత్రికి రాత్రే అందులో సగం దుంగలను స్మగ్లర్ల మాయం చేయడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. ఈ వ్యవహారంపై శాఖాపరమైన దర్యాప్తు జరిగి కొంతమంది అధికారులపై వేటు పడినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది ఉన్నతతాధికారుల తీరులో ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం పైపై సమర్థనలతో సరిపెడుతున్న ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో అక్రమాలు కళ్లముందే కనిపిస్తున్నా రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ రావు మాత్రం తమ శాఖలో ఎలాంటి అవినీతి జరగడం లేదని అంతా సజావుగానే సాగుతోందంటూ దాటవేత ధోరణీ ప్రదర్శించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఒకటి రెండు ఘటనల్లో తప్పు చేసిన వారిపై వేటు వేశామని చెప్తున్నప్పటికీ గూడూరు రేంజ్ వ్యాప్తంగా పర్యాటక నిధుల గోల్‌మాల్ వన్యప్రాణుల అదృశ్యం అటవీ భూముల ఆక్రమణలపై స్వతంత్ర విచారణ చేపట్టడానికి ఎందుకు వెనుకాడుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేవలం కంటితుడుపు చర్యలతో ఉన్నతాధికారులు చేతులు దులుపుకుంటే దట్టమైన అడవి కాస్తా ఎడారిగా మారే ప్రమాధముంది. ఉన్నత స్థాయి విజిలెన్స్ బృందాలతో సమగ్ర దర్యాప్తు జరిపిం,చి భీమునిపాదం నిధుల దోపిడీకీ పాల్పడిన సూత్రదారులతో పాటు అటవీ సంపదను నిర్వీర్యం చేస్తున్న అధికారులపై కఠన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

**భీముని జలపాతం నిధుల గోల్‌మాల్‌తో మాకు సంబంధం లేదు .. ఈడీసీ చైర్మన్ రజిత నాయక్**

భీముని జలపాతం అభివృద్ధి నిధులు గోల్‌మాల్ వ్యవహారంపై పర్యావరణ అభివృద్ధి కమిటి (ఈడీసీ) నూతన చైర్మన్ రజిత నాయక్ స్పష్టతనిచ్చారు. ఈ అవకతవకలతో ప్రస్తుత నూతన కమిటికి ఎలాంటి సంబంధం లేదని ఆమే తేల్చిచెప్పారు. గత కమిటి హయాంలోనే నిధుల దుర్వినియోగం గోల్‌మాల్ జరిగాయని తాము భాధ్యతలు స్వీకరించకముందే ఆ లావాదేవీలు పూర్తయ్యాయని ఆమె వివరించారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పర్యాటక ప్రాంత అభివృద్ధికి నూతన కమిటి పూర్తి పారదర్శకతతో పనిచేస్తుందని ఆమె పేర్కోన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com